తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శనివారం 24.05.2025 | సంపుటి : 11 సంచిక : 305 | పేజీలు : 12 వెల : రూ. 4/-

సామాన్యుని స్వరం

JANAMSAKSHI TV

తెలంగాణ

Simultaneously Published from Hyderabad & Karimnagar

ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698



## ఏఐ వచ్చేసింది.. వేలాది ఉద్యోగాలు మింగేసింది..

- ముఖ్యంగా మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల ఆవేదన వర్ణణాతీతం
- వారు సృష్టించిన ఏఐ వారి కొంపే ముంచింది
- సంస్థలో 3 శాతం కొలువులకు ఉద్వాసన
- ప్రపంచవ్యాప్తంగా సుమారు 6వేల మందిపై ప్రభావం

ఏఐద్వారా ప్రపంచవ్యాప్తంగా సుమారు 6వేల మంది ఉద్యోగులపై ప్రభావం పడింది. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమమేధ వినియోగాన్ని పెంచే దిశగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ లేఆఫ్‌లు చోటుచేసుకున్నాయి. అయితే, ఇందులో ఏఐ వ్యవస్థలు రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఎక్కువగా ఎఫెక్ట్ అయ్యారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి వాషింగ్టన్ ఆఫీసులో తొలగించిన 40శాతం ఉద్యోగుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే ఎక్కువగా ఉన్నారు.ఏఐ సాధనాల వినియోగాన్ని, వాటిపై ఆధారపడటాన్ని పెంచాలని వారికి సంస్థ యాజమాన్యం కొన్ని నెలల క్రితం సూచించినట్లు తెలుస్తోంది. దాంతో వారు పలు ఏఐ వ్యవస్థలను రూపొందించారు. ఆ వ్యవస్థలతోనే ఇప్పుడు వారి ఉద్యోగాలను సంస్థ భర్తీ చేయడం గమనార్హం.


న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ తన సిబ్బందిలో మూడు శాతం మందికి ఇటీవల ఉద్వాసన పలికింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా సుమారు 6వేల మంది ఉద్యోగులపై ప్రభావం పడింది. సంస్థ కార్యక లాపాల్లో కృత్రిమమేధ వినియోగాన్ని పెంచే దిశగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ లేఆఫ్‌లు చోటుచేసుకున్నాయి. అయితే, ఇందులో ఏఐ వ్యవస్థలు రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఎక్కువగా ఎఫెక్ట్ అయ్యా రని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నా యి వాషింగ్టన్ ఆఫీసులో తొలగించిన 40శాతం ఉద్యోగుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే ఎక్కువగా ఉన్నారు. ఏఐ సాధనాల వినియోగా న్ని, వాటిపై ఆధారపడటాన్ని పెంచాలని వారికి సంస్థ యాజమాన్యం కొన్ని నెలల క్రితం సూచించినట్లు తెలుస్తోంది. దాంతో వారు పలు ఏఐ వ్యవస్థలను రూపొందించారు. ఆ వ్యవస్థలతోనే ఇప్పుడు వారి ఉద్యోగాలను సంస్థ భర్తీ చేయడం గమనార్హం. 50శాతం మేర కోడ్ రాసేందుకు ఓపెన్ ఏఐ చాట్‌బాట్‌లను ఉపయోగించుకోవాలని మిగతా 2లో..

# దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం..

**బిలియన్ డాలర్ ఏకానమీయే లక్ష్యం : సీఎం రేవంత్**

- రాష్ట్రాభివృద్ధికి కోసం ప్రధానిని కలుస్తూనే ఉంటా
- కేసీఆర్ 40 ఏళ్ల అనుభవం రాష్ట్రానికి అవసరం
- పదవి ఉంటేనే అసెంబ్లీకి వస్తానంటే ఎలా?
- యువత భవితను తీర్చిదిద్దడమే లక్ష్యం
- జహీరాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి

సంగారెడ్డిప్రతినిధి, మే 23(జనంసాక్షి): ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని హుగ్గెల్లి చౌరస్తాలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని మాకు చెప్పండని కోరారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా? అని ప్రశ్నించారు. మేము పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నామ ని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. మిగతా 2లో..





**ఢిల్లీకి చేరిన సీఎం**

నేడు నీతి అయోగ్ సమావేశంలో పాల్గొనన్ను ముఖ్యమంత్రి

2018 తర్వాత భేటీకి హాజరుకానున్న తెలంగాణ సీఎం

2లో

## ఏ తప్పూ చేయకుంటే విచారణకు రండి

- నోటీసు ఇవ్వగానే ఉలికిపాటు ఎందుకు?
- కమిషన్‌ను తప్పుబడుతూ మాట్లాడటం విచారకరం
- మేడిగడ్డ ప్రాజెక్టుపై మేము బాంబులు వేస్తే అప్పుడు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు పేర్కొనలేదు
- కాళేశ్వరం ప్రాజెక్టును తెల్ల ఏనుగుతో పోల్చుతూ అప్పట్లోనే కాగ్ నివేదిక
- భారాస నేతలు జేబులు నింపుకొనేందుకు మేడిగడ్డలో ప్రాజెక్టు నిర్మించారు
- కాళేశ్వరంలో అక్రమాలు తేల్చేందుకే పేరు మోసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిటీవేశాం:మంత్రి ఉత్తమ్



హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరంలో అక్రమాలు తేల్చేందుకే దేశంలోనే పేరు మోసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిషన్ వేశామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏ తప్పూ చేయకుంటే మిగతా 2లో..

### వివాదాలు లేకుండా ఆస్తుల పంపకాలు

విభజన సమస్యలపై నాదెండ్లతో మంత్రి ఉత్తమ్ చర్చలు

పౌరసరఫరాల భవనం తెలంగాణకు అప్పగింత

వార్త 2లో

## 'యాపిల్' ఉత్పత్తులు అమెరికాలోనే తయారు చేయాలి

- భారత్ లేదా మరే దేశంలో తయారు చేయొద్దు
- అలాచేస్తే 25% సుంకం చెల్లించాల్సిందే!
- సంస్థకు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్..



వాషింగ్టన్(జనంసాక్షి):ఐఫోన్ల తయారీకి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'యాపిల్' సంస్థను మరోసారి హెచ్చరించారు. అమెరికాలో విక్రయించే ఐఫోన్లను స్థానికంగానే తయారు చేయాలన్నారు. భారత్ లేదా మరే దేశంలో తయారు చేయొద్దని.. అలా చేస్తే కనీసం 25శాతం సుంకం ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. "అమెరికాలో విక్రయించే ఐఫోన్లను యునైటెడ్ స్టేట్స్‌లోనే తయారు చేయాలి. భారత్ లేదా మరో దేశంలో కాదని టిమ్ కుక్‌కు ఇదివరకే తెలియజేశా. అలా కుదరదంటే.. కనీసం 25శాతం సుంకాన్ని అమెరికాకు యాపిల్ చెల్లించాల్సిందే" అని అధ్యక్షుడు ట్రంప్ సొంత సామాజిక వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఆ వెంటనే యాపిల్ షేరు విలువ మూడు శాతం పతనమైనట్లు తెలుస్తోంది.చైనాపై అమెరికా సుంకాల ప్రభావం నేపథ్యంలో ఐఫోన్ల తయారీని భారత్‌లో చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు యాపిల్ ఇదివరకే వెల్లడించింది. ఈ విస్తరణ ప్రక్రియపై ఇటీవల స్పందించిన ట్రంప్.. దాన్ని నిలిపివేయాలని యాపిల్‌కు సూచించారు. భారత్‌లో యాపిల్ భారీగా తయారీ కార్యక్రమాలు చేపడుతోందని.. అది తనకు ఇష్టం లేదనే విషయాన్ని ఖతార్ పర్యటన సందర్భంగా ట్రంప్ వెల్లడించారు. తాజాగా ఇదే విషయంపై మళ్లీ స్పందించిన ఆయన.. అమెరికాలో తయారు చేయకుంటే సుంకాలు చెల్లించక తప్పదంటూ యాపిల్‌ను హెచ్చరించడం గమనార్హం. ఈయూ దేశాలపై ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించారు. ఆయా దేశాలపై 50 శాతం సుంకం విధిస్తామని, జూన్ 1 నుంచి కొత్త టారిఫ్ అమల్లోకి వస్తుందని తెలిపారు. ఈయూతో జరిపిన చర్చలు ఫలవంతం కాలేదని, చర్చలు నిలిచిపోయిన నేపథ్యంలో ఈ సుంకాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

**రష్యా- ఉక్రెయిన్ శాంతి చర్చలు**

### కీలక నిర్ణయం రాబోతోంది! : ట్రంప్

2లో

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

**నలుగురు మావోయిస్టులు మృతి**

గడ్చిరోలి(జనంసాక్షి): మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీస్ స్పెషల్ కమాండో యూనిట్ సీ-60, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గడ్చిరోలి జిల్లాలో ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.కవండే ప్రాంతంలో ఇటీవల ప్రారంభించిన ఫార్వార్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్‌వోబీ) సమీపంలో మావోయిస్టులు మిగతా 2లో..



## కవిత లేఖ కలకలం

**అది ఒక ఫ్యామిలీ డ్రామా**

- వందేళ్లయినా కేసీఆర్ ఫ్యామిలీ అంతా ఒక్కటే
- లేఖను సృష్టించాల్సిన అవసరం సీఎం రేవంత్‌కు లేదు
- బీఆర్ఎస్ డ్రామాలో భాగమే కవిత లేఖ: కోమటిరెడ్డి
- కవిత లేఖ కాంగ్రెస్ వదిలిన బాణం : కేంద్ర మంత్రి బండి
- కవిత లేఖ డ్రామా వెనక రేవంత్ : రఘునందన రావు

హైదరాబాద్(జనంసాక్షి):ఆర్టిఫిషియల్‌లేఖను కూడా ఎమ్మెల్సీ కవిత సరిగా రాయలేక పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. లేఖకు, ఎమ్మెల్సీ కవితకు సంబంధమే లేదని కోమటిరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని అన్నారు. కోమటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని చెప్పారు. 20 లేదా 30 సీట్లలోనే బిఆర్ఎస్ పోటీ- చేస్తుందని, బిఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలుస్తుందని జోస్యం చెప్పారు. వందేళ్లయినా కెసిఆర్ కుటుంబం కలిసే ఉంటుందని, కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా మిగతా 2లో..





### నా అభిప్రాయాలే నాన్నకు తెలియజేశా..

ఆ లేఖ ఎలా బయటికి వచ్చిందో తెలియట్లేదు

కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాల వల్ల పార్టీకి నష్టం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్(జనంసాక్షి): 'మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది' అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ఆమెకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో జాగృతి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. 'వరగంల్ సభ తర్వాత మిగతా 2లో..

## ఈశాన్య రాష్ట్రాలను అభివృద్ధి చేస్తాం

**మా ప్రభుత్వ లక్ష్యం అదే**

**'రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఈశాన్య రాష్ట్రాలు ఎప్పుడూ లేనంతంగా పురోగమిస్తు న్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వాటి అభివృద్ధి పథాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిశ్చయించుకుందని చెప్పారు. ఈశాన్య ప్రాంత వైవిధ్యమే దాని అతిపెద్ద బలం అని, ఈ ప్రాంతం అభివృద్ధి మార్గంలో ముందు వరుసలో నిలుస్తోందన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ 'రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో ప్రసంగించారు. ఈ ఈవెంట్‌కు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు, అధికారులు, దౌత్యవేత్తలతో పాటు తదితరులు హాజరయ్యారు.గతంలో ఈశాన్య ప్రాంతం అంటే బాంబులు, తుపాకులు, రాకెట్లకు మారుపేరుగా ఉండేదని, దానివల్ల యువత చాలా అవకాశాలు కోల్పోయారని నరేంద్ర మోదీ అన్నారు. అయితే గత దశాబ్ద కాలంలో నార్త్? ఈస్ట్? యువత హింసను మిగతా 2లో..



## జయహో హైడ్రా

**జూబ్లీహిల్స్‌లో రూ. 200 కోట్ల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా**

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్‌లో దాదాపు రూ.200 కోట్లు విలువ చేసే రెండెకరాల పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41 పెద్దమ్మగుడి సమీపంలో నాలాతో పాటు పార్క్ రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. ఇంటిని అద్దెకు తీసుకొని ఆ ఇంటి యజమానికి తెలియకుండా చుట్టూ ఉన్న మిగతా 2లో..

## చేతులు జోడించి క్షమాపణ చెబుతున్నా..

- అది 'భాషా పరమైన తప్పిదమే'
- ఏ మతాన్నీ కించపరచాలనే ఉద్దేశంతో వ్యాఖ్యలు చేయలేదు
- సోఫియా ఖురేషీ వివాదంపై మరోసారి స్పందించిన మంత్రి విజయ్ షా



భోపాల్(జనంసాక్షి): భారత వైమానిక దళ అధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా మరోసారి క్షమాపణలు చెప్పారు.అది 'భాషా పరమైన తప్పిదమే' తప్ప ఏ మతాన్నీ కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఇండియన్ ఆర్మీకి, సోదరి కర్నల్ సోఫియా ఖురేషీకి, యావత్ దేశ ప్రజలకు క్షమాపణలు చెబుతున్నట్లు ఓ వీడియోను విడుదల చేశారు."ఇటీవల పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడి మిగతా 2లో..

## ఆర్‌బీఐ గుడ్‌న్యూస్

- కేంద్రానికి భారీ డివిడెండ్



ముంబయి(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్ న్యూస్ చెప్పింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను డివిడెండ్‌గా రూ.2.69 లక్షల కోట్లు చెల్లించాలని నిర్ణయించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రానికి ఆర్‌బీఐ రూ.2.1 లక్షల కోట్లు చెల్లించింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఈ మొత్తం 27.4 శాతం మేర పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ రూ. 87,416 కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించింది. ఏటికేడు ఈ మొత్తం పెరుగుతూ వస్తోంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ కేంద్ర మిగతా 9లో..

## ప్రసూతి సెలవులు మహిళల హక్కు

**ఏ సంస్థ కూడా వాటిని హరించలేదు: సుప్రీం**



న్యూఢిల్లీ(జనంసాక్షి):మహిళలకు ప్రసూతి సెలవులను దేశ అత్యున్నత న్యాయస్థానం మరోసారి సమర్థించింది. వారు మాతృత్వపు లబ్ధి, సంతానం పొందే హక్కుల్లో ఇవి అత్యంత కీలకమైనవని అభివర్ణించింది.ఏ సంస్థ స్త్రీలకు ఉన్న ప్రసూతి సెలవు హక్కును హరించలేదని న్యాయస్థానం వెల్లడించింది.తమిళనాడుకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయినికి రెండో వివాహం అనంతరం బిడ్డకు జన్మనిచ్చేందుకు ప్రసూతి సెలవులను మిగతా 2లో..

# సింధూ నీటిని ఆపితే భారత ప్రజల ఊపిరి ఆపేస్తాం

### మళ్లీ నోరుపారేసుకున్న పాక్ అధికారి

### ఆ దేశ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ ప్రేలాపణలు

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాదితో చేసుకున్న సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయాలని న్యూఢిల్లీ నిర్ణయించుకున్న విషయం తెలిసిందే.దీనిపై పాక్ నేతలు స్పందిస్తూ పలుమార్లు భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తాజాగా పాకిస్థాన్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి మాట్లాడుతూ భారత్‌పై ప్రేలాపనలు పేలారు. పాక్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అహ్మద్ షరీఫ్ ప్రసంగిస్తూ..”భారత్ మాకు వచ్చే నీటిని అడ్డుకుంటే అక్కడి ప్రజల ఊపిరి ఆపేస్తాం. సింధూ నదిలో జలాలకు బదులుగా వారి రక్తం పారుతుంది” అని అన్నారు.ఆయన వ్యాఖ్యలను అఫ్ఘాన్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మరియం సోలైమాంఖిల్ తీవ్రంగా ఖండించారు. దేశానికి చెందిన ఓ సైనికాధికారి ఇలా మాట్లాడటం సరైన చర్య కాదని అన్నారు. లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ సింధూ నది (%×అంబం =అజవతీ%) గురించి మాట్లాడుతూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అన్నారు. “కశ్మీర్‌లో డ్యాం నిర్మించడం ద్వారా పాక్‌కు నీళ్లు ఆపేస్తామని మీరంటున్నారు. పాక్‌ను నాశనం చేయాలని, చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా ప్రణాళికలను విఫలం చేయాలని కోరుకుంటున్నారు. కానీ మీరు నీళ్లు ఆపేస్తే.. నదుల్లో మళ్లీ రక్తం పారుతుంది” అని అతడు అన్నాడని గుర్తు చేశారు. పాక్ అధికారులు అక్కడి ఉగ్రవాదుల స్క్రిప్ట్‌ను చదువుతున్నట్లు ఉందని పేర్కొన్నారు.1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూఢిల్లీ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. దీంతో పాక్ నేతలు భారత్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పాక్ మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టో పాక్ రక్షణ మంత్రి సైతం ఇటీవల ఈ విషయంలో భారత్‌పై నోరు పారేసుకున్నారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. గతంలో లష్కరే తయ్యిబా ఉగ్రవాది సైతం ఇవే వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఏఐ వచ్చేసింది.. వేలాది ఉద్యోగాలు మింగేసింది.

తన ఆధ్వర్యంలో ఉన్న 400 మంది ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ ఉన్నతాధికారి జెఫ్ హల్స్ కొన్ని వారాల క్రితం సూచించారు. తాజా తొలగింపుల్లో ఆ బృందం కూడా ఉంది. అంటే వారికి తెలియకుండానే వారి ఉద్యోగాలకు వారే ఎసరు తెచ్చుకున్నట్లయింది.జూనియర్ కోడర్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉన్నవారు, ఏఐ ప్రాజెక్టుల్లో పనిచేస్తోన్న సిబ్బంది ఈ కొత్త లేఆఫ్‌ను ఎదుర్కొన్నారు. చివరకు మైక్రోసాఫ్ట్ స్టార్టప్‌లకు చెందిన ఏఐ డైరెక్టర్ గాబ్రియెలా డికిరోజ్ కూడా తన పదవిని కోల్పోవడం గమనార్హం. దీనిపై ఆమె స్పందిస్తూ.. చేదు రుచి కలిగిన తీపి ఇది అని పేర్కొన్నారు. సంస్థ కోసం ఎంతో కృషి చేసినవారు తమ ఉద్యోగాలను కోల్పోవడం విచారకమని వ్యాఖ్యానించారు. 2023లో 10 వేల మందికి మైక్రోసాఫ్ట్ ఉద్వాసన పలికింది. అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. “మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలుచేస్తూనే ఉంటాం” అని ఈ లేఆఫ్‌లపై మైక్రోసాఫ్ట్ ప్రతినిధి ఒకరు స్పందించారు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని చెప్పారు.గత నెల మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కృత్రిమ మేధ వినియోగంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తమ కంపెనీకి సంబంధించి 30 శాతం కోడింగ్‌ను కృత్రిమ మేధ సాయంతోనే రాస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యత కోసం ఏఐ ఆధారిత టూల్స్‌పై ఆధారపడటం పెరుగుతోందన్నారు. ఆ వ్యాఖ్యల అనంతరమే 3 శాతం మంది ఉద్యోగుల తొలగింపు ప్రకటన వచ్చింది.

## కవిత లేఖ కలకలం

అని ఎద్దేవా చేశారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకే లేదని, ఇక మా సిఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. వరంగల్ లో కెసిఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని కోమటి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాసకు భవిష్యత్తు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాసినట్లు- బయటకు వచ్చిన లేఖపై ఆయన స్పందించారు. ఆ లేఖ.. ఓ జోక్ అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ రాసే లేఖ ఓ పద్ధతిగా ఉందా? ఆ లేఖను సృష్టించాల్సిన అవసరం మాకేంటి? భారాసలో చీలిక ఏమీ లేదు.. ఇదంతా ఓ డ్రామా. దానిలో భాగమే ఈ లేఖ. తండ్రికి లేఖ రాయాల్సిన అవసరమేంటి? ఆమె నేరుగా చెప్పొచ్చు కదా! కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు వస్తాయంటే ఎవరైనా నమ్ముతారా? వారు గొడవపడరు.. ఒకవేళ అలా జరిగితే అది ఆస్తుల గురించే అవుతుందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్ వదిలిన బాణం : బండి**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లేఖపై ఇప్పటికే రేవంత్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు స్పందించారు. తాజాగా కవిత లేఖపై బీజేపీ సైతం స్పందించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన ట్విట్టర్ వేదికగా శుక్రవారం స్పందించారు. కాంగ్రెస్ వదిలిన బాణం అనే శీర్షికతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. డాడీకి రాసిన లేఖ ఒక ఓటీటీ- ఫ్యామిలీ డ్రామాగా మారవచ్చునని ఆయన వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. తెలంగాణను విఫలం చేశాయని మండిపడ్డారు.

## నా అభిప్రాయాలే నాన్నకు తెలియజేశా..

రెండు వారాల క్రితం నా తండ్రి, భారాస అధినేత కేసీఆర్‌కు లేఖ రాశా. నా అభిప్రాయాలు లేఖ ద్వారా స్పష్టం చేశా. అంతర్గతంగా రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందో అర్థం కావడం లేదు. దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు. నా కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుక పూర్తి చేసుకొని అమెరికా నుంచి వచ్చే లోపు లేఖ బహిర్గతం అయింది. దానిపై హంగామా నడుస్తున్నట్టు తెలిసింది. కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయని మొన్ననే చెప్పాను. నేను అంతర్గతంగా కేసీఆర్‌కు రాసిన ఉత్తరం బహిర్గతం కావడంపై పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన విషయం. పార్టీలో నాయకులు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో ప్రస్తావించాను. గతంలోనూ నా తండ్రికి అంతర్గతంగా లేఖలు రాశా. కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖ లీక్ అయింది. దీన్ని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నా పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన వారి పరిస్థితేంటి? నా లేఖ లీక్ వెనుక ఎవరో ఉండి ఉండొచ్చు. కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. వాటి వల్లే పార్టీకి నష్టం. మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది. కేసీఆర్ నాయకత్వంలోనే భారాస పార్టీ ముందుకెళ్తుంది.కోవర్టులను పక్కకు తప్పిస్తే పార్టీ బాగుపడుతుంది.

## జయహో హైడ్రా

ప్రభుత్వ, ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ఆక్రమించిన కబ్జాదారుడు.. హోటల్, హాస్టల్‌కు అద్దెక్కిచ్చి నెలకు రూ.10లక్షలు వసూలు చేస్తున్నాడు. ఈ విషయంపై హైడ్రాకు ఇంటి యజమాని ఫిర్యాదు చేయడంతో స్పందించిన హైడ్రా.. గతంలోనే కిరాయిదారుడికి నోటీసులు ఇచ్చింది. సదరు కిరాయిదారుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఆ నిర్మాణాలపై ఎలాంటి హక్కు లేదని.. రోడ్డు, నాలాను ఆక్రమించి భవనాలు ఎలా నిర్మిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. ఇవాళ బుల్డోజర్లతో విరుచుకుపడి వాటిని నేలమట్టం చేసింది. ఆ ప్రదేశంలో జీహెచ్ఎంసీ చక్కటి పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

# దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం




రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి సీఎం అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు సుకుంటున్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.రాష్ట్రానికి రావాల్సిన నిధులు కోసం ప్రధాని మోడీని ఎన్ని సార్లు అయిన కలుస్తామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే మనకే వాసన వస్తుందని.. ఒకాయన అలాగే అలిగి ఫామ్ హౌస్ లో పడుకున్నారని తీవ్రంగా విమర్శించారు. నేను మీ కోసం పని చేస్తా కష్టపడుతానన్నా రు.జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా... వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, నారాయణఖేడ్ ఎంపీ సురేష్ శెట్కార్, ఎమ్మెల్యేలు పట్లోళ్ల సంజీవరెడ్డి, మాణిక్ రావు, మదన్ మోహన్ రావు, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, బర్దిపూర్ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి చేరిన సీఎం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నేడు దిల్లీలో జరిగే నీతిఅయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. 2018 తర్వాత రాష్ట్ర సీఎం ఈ భేటీకి హాజరుకానుండగా 2047 నాటికి తెలంగాణ సాధించాలనుకున్న లక్ష్యాలు అందుకు అనుసరించే పాలసీలు, సుపరిపాలన విధానాలపై ప్రత్యేక నివేదిక సమర్పించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనలు ఫలితాలనిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. సీఎం చొరవ వల్లే రాష్ట్రానికి ఐపీఎస్‌ల సంఖ్య పెంచడం సహా ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం మంజూరు చేసిందని ప్రభుత్వం వెల్లడించింది.దిల్లీలో శనివారం జరిగే నీతిఅయోగ్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో ‘వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్’ అజెండాతో ఏర్పాటు చేసిన నీతి అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. 2047 నాటికి తెలంగాణ సాధించాలనుకున్న లక్ష్యాలు అందుకు అనుసరించే పాలసీలు, సుపరిపాలన విధానాలు రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం అందించాల్సిన సహకారాలపై ప్రత్యేక నివేదిక సమర్పిస్తారు.

## చేతులు జోడించి క్షమాపణ చెబుతున్నా..

నన్ను ఎంతగానో బాధించింది. దేశంపై నాకు అపారమైన ప్రేమ, భారత ఆర్మీపై అంచంచలమైన గౌరవం ఉన్నాయి. నా వ్యాఖ్యలు ఓ సామాజిక వర్గాన్ని, మతాన్ని, దేశ ప్రజలందర్నీ బాధించాయి. అది భాషాపరంగా నేను చేసిన తప్పు. అందుకు మనస్ఫూర్తిగా చింతిస్తున్నాను. దేశ ప్రజలకు, భారత ఆర్మీకి, సోదరి కర్నల్ సోఫియాకు చేతులు జోడించి క్షమాపణ చెబుతున్నా” అని విజయ్ షా ఆ వీడియోలో పేర్కొన్నారు.విజయ్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికిన సంగతి తెలిసిందే. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిని సవాల్ చేస్తూ.. ఇటీవల మంత్రి సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. సర్వోన్నత న్యాయస్థానం సైతం ఆయనపై తీరును ఆక్షేపించింది. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి అభ్యంతరం ఏంటని నిలదీసింది. ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ డీజీపీని ఆదేశించింది. ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయింపు కల్పించిన ధర్మాసనం.. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది.

## వివాదాలు లేకుండా ఆస్తుల పంపకాలు

విజయవాడ(జనంసాక్షి): నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలోనే ఉమ్మడి ఏపీలో తెలంగాణ బిల్లు పాస్ అయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆ క్రెడిట్ అప్పటి స్పీకర్‌గా నాదెండ్లకు ఇవ్వాలన్నారు. ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇరు రాష్ట్రాల విధానాలు, బెటర్ టెక్నాలజీ గురించి చర్చించినట్లు తెలిపారు. కాకినాడ పోర్ట్ నుంచి రైస్ ఎక్స్ పోర్ట్ చేస్తున్నామని.. ఇల్లీగల్ రైస్ కట్టడి గురించి మాట్లాడినట్లు చెప్పారు. ఆస్తుల బదలాయింపు గురించి మాట్లాడుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర విభజనలో సివిల్ స్లపై సగం బిల్డింగ్ ఏపీకి వెళ్ళిందని.. రెసిడెంట్స్ ప్లాట్ 16 పంజాగుట్టలో ఉన్నాయి. తెలంగాణకే రాబోతున్నాయని స్పష్టం చేశారు. తెలంగాణ సివిల్ స్లపై ఆఫీస్ బిల్డింగ్ ఇరుగ్గా ఉందని.. బయట మీటింగ్ లు పెట్టాల్సి వస్తోందన్నారు. ఫుడ్ రిలేటెడ్ డిపార్ట్ మెంట్ లు ఇక్కడే ఉండాలని ఈ ఏపీ బిల్డింగ్ అడిగినట్లు తెలిపారు. జూన్ 1 నుంచి పూర్తి బిల్డింగ్ మనకు అప్పగిస్తున్నారని స్పష్టం చేశారు. సివిల్ స్లపై ఆస్తులపై చర్చలు జరిగాయని.. కార్పొరేషన్ కు ఉన్న ఆస్తుల బదిలీ మీద మాట్లాడుతున్నట్లు- వెల్లడించారు. అనంతరం ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలని... ఎవ్వరూ సమస్యలు ఎదుర్కోవద్దని.. ప్రజలకు మేలు చెయ్యాలని మా ఉద్దేశం. వీలైనంత త్వరగా మంచి వాతావరణంలో కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయం. 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఏపీ సివిల్ స్లపై భవన్ ను పూర్తిగా తెలంగాణకు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో అమల్లో ఉన్న టెక్నాలజీ మార్పులను మేము అందుకుంటాం. తెలంగాణలో కొన్ని అద్భుతమైన సంస్కరణలు చేశారు. కాకినాడ నుంచి పిలిప్పిన్ కు బియ్యం ఎగుమతి చేస్తున్నాం.. దానికి అవసరమైన అన్ని సౌకర్యాల మీద చర్చించాం. ఆస్తుల బదిలీ జరగాల్సిన అవసరం ఉంది. రైతాంగానికి మేలు జరిగేలా ఆహార భద్రతలో లోపాలు లేకుండా చెయ్యాలని ఉద్దేశ్యం. జూన్ 12 నుంచి పాఠశాలల్లో సన్న బియ్యం అందించనున్నాం. ఎక్స్ పోర్ట్ మీద కూడా చర్చించాం అన్నారు

## ‘ఆపరేషన్ సిందూర్’తో పాక్‌వైఖరి ప్రపంచానికి తెలిసింది

### ఆపరేషన్‌తో అక్కడి ఉగ్రస్థావరాలను బయటపడ్డాయి:అమిత్ షా

**న్యూయార్క్(జనంసాక్షి):**పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదానికి దీటైన జవాబు అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.పహల్గాం దాడులతో అన్ని హద్దులూ దాటిన ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించడానికి.. వారి స్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిందన్నారు. పాక్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను భారత్ బయటపెట్టడంతో.. ఆ దేశం ఉగ్రవాదులను పోషిస్తుందనే నిజం మరోసారి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచమంతా కొనియాడిందని షా పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ బలమైన రాజకీయ సంకల్పం.. నిఘా సంస్థలు అందించిన కచ్చితమైన సమాచారం.. త్రివిధ దళాల అద్భుత ప్రదర్శన వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యిందని అమిత్ షా అన్నారు. పాక్.. భారత్‌పై క్షిపణులు ప్రయోగించిన సమయంలో దేశాన్ని కాపాడడంలో బీఎస్‌ఎఫ్ దళాలు ముఖ్యపాత్ర పోషించాయని అమిత్ షా అన్నారు. బంగ్లాదేశ్‌తో సహా అంతర్జాతీయ సరిహద్దులను కాపాడటంలో బీఎస్‌ఎఫ్ పాత్రను అభినందించారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పిదాల వల్ల భారత్ అనేక దశాబ్దాలుగా ఉగ్ర సమస్యను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి భారత్ ఉగ్ర దాడులకు గట్టి బదులిస్తోందని అన్నారు. పహల్గాం ఘటన సమయంలో ఉగ్రవాదులు పర్యాటకులను మతం అడిగి మరీ చంపడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు.ఆపరేషన్ సిందూర్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని.. వాటిలో 2 వాటి ప్రధాన ఉగ్ర కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ దాడిలో పాక్ ప్రజలకు గానీ, సైనిక స్థావరాలకు గానీ ఎటువంటి నష్టం కలిగించలేదని స్పష్టంచేశారు. కానీ పాక్ సైన్యం మాత్రం నిషేధిత ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరై.. ఉగ్రవాదానికి మద్దతు పలికారని అమిత్‌షా అన్నారు. వారి చర్యలను ప్రపంచం మొత్తం చూసిందని.. ఉగ్రవాదుల వెనక ఎవరు ఉన్నారనే విషయం అన్ని దేశాలకు అర్థమయ్యిందని తెలిపారు. 1965 నుంచి నేటివరకు దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలు అర్పించిన 2,000 మందికి పైగా సరిహద్దు గార్డులకు దేశం తరఫున నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కీలక నిర్ణయం రాబోతోంది!..

**న్యూయార్క్(జనంసాక్షి):**రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈక్రమంలో ఇరుదేశాల మధ్య జరుగుతున్న శాంతి చర్చలను గురించి ప్రస్తావిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.అందులో ఇరుదేశాల మధ్య ఖైదీల మార్పిడి పూర్తయినట్లు పేర్కొంటూ.. రష్యా- ఉక్రెయిన్‌కు అభినందనలు తెలిపారు. ఇరుదేశాల మధ్య శాంతిచర్చలు సఫలమయ్యాయని వెల్లడించారు. ఒక్క అడుగే ఓ పెద్ద మార్పునకు కారణమవుతుందని కీలక నిర్ణయం వెలువడబోతోందని రాసుకొచ్చారు. అయితే, ఖైదీల మార్పిడిని రష్యా, ఉక్రెయిన్ ఇంకా ధ్రువీకరించలేదు.ఈ నెలలో ఇరుదేశాల మధ్య ఇస్తాంబుల్ వేదికగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో 1,000 మంది ఖైదీలను మార్పిడి చేసుకోవడానికి మాస్కో, కీవ్ అంగీకరించిన తర్వాత ట్రంప్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తాజాగా జరిగిన ముందస్తు ఖైదీల మార్పిడిలో ఇరుదేశాలు 205 మంది సైనికులను విడుదల చేశాయి. ఇటీవల ఇరుదేశాలతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడిన అనంతరం మీడియా ప్రకటన వెలువరుస్తూ.. ఇరుదేశాలు తక్షణమే కాల్పుల విరమణ చర్చలు ప్రారంభిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అయితే యుద్ధం ముగించే ఉద్దేశం రష్యాకు ఉన్నట్లు తనకు అనిపించడం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు.ఆయన వ్యాఖ్యలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ.. శాంతిస్థాపన పురోగతికి పలు సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ రష్యా నిబద్ధతను ట్రంప్ అంగీకరించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య చర్చలు సరైన దిశలోనే సాగుతున్నట్లు పుతిన్ తెలిపారు. అయితే శాంతిస్థాపన అనేది సంఘర్షణలకు మూల కారణాలను పరిష్కరించడంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇరుదేశాల్లో శాంతి కోసం ఉత్తమమైన మార్గాలను వెతకడం ప్రస్తుతం ముఖ్యమని పేర్కొన్నారు. కాగా కాల్పుల విరమణకు ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ అనిశ్చితి

**- సైన్యాధ్యక్షుడు వకారుజ్జమాన్‌తో విభేదలు తీవ్రం**

**- రాజీనామాకు సిద్ధపడ్డ తాత్కాలిక అధ్యక్షుడు మహ్మద్ యూనస్**

**ఢాకా(జనంసాక్షి):** బంగ్లాదేశ్మరోమారు సంక్షోభం అంచుకు చేరింది. అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఇంకెంతో కాలం మనజాలదని పరిస్థితులు రుజువు చేస్తున్నారు. దీనికితోడు సైన్యంతో పొసగక బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మమద్ యూనస్ తన పదవికి రాజీనామా చేస్తారనే చర్చ సాగుతోంది. దేశంలో తాజాగా రాజకీయ అస్థిర పరిస్థితులు నెలకున్నాయి. అలాంటి వేళ.. ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయం రావడంతో విఫలమవ్వడం వల్లే ఆయన ఈ నిర్ణయానికి వచ్చి ఉండవచ్చని స్థానిక మీడియా తన కథనంలో వెల్లడించింది. ఈ అంశంపై నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు నిద్ ఇస్లాం స్పందించారు. గురువారం ఉదయం నుంచి మహ్మమద్ యూనస్ రాజీనామా చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయనతో కలిసి మాట్లాడినట్లు చెప్పారు. రాజీనామా అంశంపై ఆలోచిస్తున్నట్లు ఆయన చెప్పారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగేలేనని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు. గత రెండు రోజులుగా యూనస్ ప్రభుత్వం పలు సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. వాటిలో ఏకీకృత మిలటరీ దళాలు అంశం ఒకటి అని వివరించారు.

# ఏ తప్పూ చేయకుంటే విచారణకు రండి

నోటీసు ఇవ్వగానే అంత ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. నోటీసు ఇవ్వగానే కమిషన్‌ను తప్పుబడుతూ మాట్లాడటం విచారకరమన్న ఉత్తమ్.. ఇందిరగాంధీ లాంటి వాళ్లే కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారని గుర్తు చేశారు. నోటీసులు ఇచ్చాక జ్యుడీషియల్ కమిషన్‌నే కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకే జ్యుడీషియల్ కమిషన్ వేశామన్నారు.”బాంబులు వేశారని చెబుతున్నారు.. అప్పుడు మీరే ప్రభుత్వంలో ఉన్నారు. మేడిగడ్డపై బాంబులు వేస్తే అప్పుడు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు పేర్కొనలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును తెల్ల ఏనుగుతో పోల్చుతూ కాగ్ నివేదికలో పేర్కొంది. భారాస నేతలు జేబులు నింపుకొనేందుకు మేడిగడ్డ ప్రాజెక్టు ప్రాంతం మార్చారు. డీపీఆర్‌లో పేర్కొన్న ప్రదేశం కాకుండా మరోచోట ప్రాజెక్టు కట్టారు. నాలుగు రెట్లు వ్యయం పెరిగిన ప్రాజెక్టుతో అదనపు ఆయకట్టు నామమాత్రంగా పెరిగింది. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు ప్రాంతం మార్చారు. కాళేశ్వరం తెల్ల ఏనుగుగా మారబోతోందని కేంద్ర సంస్థలు చెప్పాయి. భారాస ఎంపీల మద్దతుతోనే ఎన్డీఎస్ఏ చట్టం వచ్చింది. కాళేశ్వరం డీపీఆర్, రీడిజైన్, నిర్మాణంలో లోపాలున్నాయని ఎన్డీఎస్ఏ చెప్పింది. ప్రాజెక్టును పునఃవినియోగంలోకి తేవడంపై మేం చాలా అధ్యయనం చేస్తున్నాం. ప్రాజెక్టు పునాదుల్లోనే ఎన్నో లోపాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కూలిపోయిన ప్రాజెక్టును అద్భుతమని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. జ్యుడీషియల్ కమిషన్ ముందు హాజరై వాళ్ల వాదన ఏంటో వినిపించాలి” అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

## ఉగ్రవాదానికి పాక్ బానిసైంది

### దానిని అక్కడి ప్రభుత్వం,ఆర్మీ పెంచి పోషిస్తున్నాయి: జైశంకర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఘటన జరిగిన ప్రతిసారీ తమకేమీ తెలియదన్నట్లు నటిస్తున్నదని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మండిపడ్డారు. తమ నేలపై ఉగ్రవాదం లేదంటూ పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనలను ఆయన ఖండించారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో పాకిస్థాన్ ప్రభుత్వంతోపాటు ఆ దేశ సైన్యం కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యూరప్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా నెదర్లాండ్స్‌లో మంత్రి జై శంకర్ పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన జాబితాలోని ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఉన్నారన్నారు. వారంతా పెద్దపెద్ద నగరాల్లో నివసిస్తున్నారని చెప్పుకొచ్చారు. అక్కడి నుంచే వారు ఈ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వారి చిరునామాలే కాదు.. ఎవరెవరితో వారు సంబంధాలు నెరుపుతున్నారో కూడా పాక్ ప్రభుత్వానికి తెలుసని వెల్లడించారు. అంతేకాదు వారంతా పట్టపగలు పాకిస్థాన్‌లో బహిరంగంగా తిరుగుతున్నారంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ వైఖరిని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ విషయంలో భారత్ ఒక ఖచ్చితమైన ముగింపును మాత్రం కోరుకుంటుందన్నారు. తమకు పాకిస్థాన్‌పై ఆగ్రహం లేదని.. కానీ ఉగ్రవాదంపై ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పాకిస్థాన్‌లో లెక్కలేనన్ని ఉగ్రవాద స్థావరాలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. అలాంటి పాకిస్థాన్.. తమ దేశానికి ఉగ్రవాదంతో ఎటువంటి సంబంధం లేదంటూ చెప్పడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఇరు దేశాల మధ్య కాల్పులు విరమణ ఒప్పందం ప్రస్తుతం కొనసాగుతుందని చెప్పారు. పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదం ఇదే రీతిగా కొనసాగితే.. ఆ తర్వాత భారత్ నుంచి ఎదురయ్యే పరిణామాలను ఆ దేశం తప్పక ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి జై శంకర్ హెచ్చరించారు. అలాగే భారత్‌కు ఉగ్రవాదం, జమ్మూకాశ్మీర్ అంశాలు వేర్వేరని స్పష్టం చేశారు. ఉగ్రవాదం అనేది స్వతంత్రమైనది. అదే విధంగా పూర్తిగా ఆమోదయోగ్యం కాని అంతర్జాతీయ నేరమన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించకూడదని ఆయన పేర్కొన్నారు.

## ఈశాన్య రాష్ట్రాలను అభివృద్ధి చేస్తాం

వదిలిపెట్టారని తెలిపారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదం, నక్సలిజాన్ని ఉపేక్షించడం లేదన్నారు.కాగా, ఈశాన్య ప్రాంతాన్ని అవకాశాల భూమిగా చేయడం, జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ఈ శిఖరాగ్ర సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల కీలక వాటాదారులు, ఇన్వెస్టర్లు, విధాన రూపకర్తలను ఒకే వేదిక వస్తారని చెప్పారు.పలు రోడ్‌షోలు, రాష్ట్ర స్థాయి రౌండ్ టెబుల్ సమావేశం వంటి ప్రీ-సమిట్ కార్యక్రమాల తర్వాత ఈ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిఖరాగ్ర సమిట్?లో మంత్రుల సమావేశాలు, బిజినెస్? టు గవర్నమెంట్ సెషన్స్?, బిజినెస్ టు బిజినెస్ మీటింగ్స్- పాలసీ ఎగ్జిబిషన్లు వంటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వా కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు.పర్యటకం, వ్యవసాయ-ఆహార ప్రాసెసింగ్ అనుబంధ రంగాలు, వస్త్రాలు, చేనేత, హస్తకళలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి, సమాచార సాంకేతికత-సమాచార సాంకేతికత ఆధారిత సేవలు, మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్, ఇంధనం, వినోదం, క్రీడా రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంపై ఈ సమిట్ ప్రధానంగా దృష్టి సారించింది.

## ప్రసూతి సెలవులు మహిళల హక్కు

నిరాకరించారు. దీంతో ఆమె అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన మొదటి వివాహం నుంచి ఇద్దరు బిడ్డలకు జన్మనివ్వడంతో.. తాజాగా మరోసారి ప్రసూతి సెలవులకు నిరాకరించినట్లు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్ర నిబంధనల ప్రకారం తొలి ఇద్దరు పిల్లలకు మహిళలు ప్రసూతి లబ్ధిని పొందే అవకాశం ఉంది.తాను రెండో వివాహం చేసుకొన్న అనంతరం ప్రభుత్వ ఉద్యోగంలో చేరినట్లు ఆ ఉపాధ్యాయిని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు.. తన రెండు కాన్పులకు ఎటువంటి ప్రసూతి సెలవులు వాడుకోలేదన్నారు. ఈ సందర్భంగా ఆమె తరఫున వాదిస్తున్న న్యాయవాది కేవీ ముత్తుకుమార్ స్పందిస్తూ.. ఆమె ప్రాథమిక హక్కులను హరించేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఉందని పేర్కొన్నారు

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

ఉన్నట్లు అందిన సమాచారం ఆధారంగా గురువారం మధ్యాహ్నం ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. భారీ వర్షం మధ్య దాదాపు 300 మంది సీ-60 కమాండోలు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆపరేషన్ నిర్వహించారని.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరపడంతో భద్రతా దళాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు. దాదాపు రెండు గంటల పాటు కాల్పుల అనంతరం భద్రతాదళాలు గాలించగా నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనా స్థలంలో కొన్ని తుపాకులు, వాకీటాకీ, నక్సల్ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతతో పాటు 27మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.

## విద్యార్థుల ఆత్మహత్యలు కోటాలోనే ఎందుకు?

### ప్రభుత్వం వీటిని ఎందుకు పట్టించుకోవడం లేదు: సుప్రీం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కోటాలోనే ఇలాంటివి ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ-ఖరగ్‌పుర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులను విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది.ఐఐటీ- ఖరగ్‌పుర్‌కు చెందిన విద్యార్థి (22) ఆత్మహత్యకు సంబంధించిన కేసును సుప్రీం విచారించింది. మే 4న హాస్టల్ గదిలో ఉరివేసుకొని మరణించగా.. పోలీసులు మాత్రం మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది.

## రూ.200 కోట్లు విలువ చేసే స్థలం కబ్జా


- జూబ్లీహిల్స్‌లో కూల్చేసి స్వాధీనం చేసుకున్న హైడ్రా



**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్‌లో దాదాపు రూ.200 కోట్లు విలువ చేసే రెండెకరాల పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ప్రభుత్వ స్థలాలన్ని కబ్జాచేయడమే గాకుండా తనదే స్థలం అంటూ సుప్రీం దాకా వెళ్లగా కోర్టు దానిని తిరస్కరించింది.దీంతో హైడ్రా రంగప్రవేశం చేసి స్థలంలో ఉన్న కట్టడాలను కూల్చేసి దానిని కాపాడింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41 పెద్దమ్మగుడి సమీపంలో నాలాతో పాటు పార్క్ రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది శుక్రవారం నేలమట్టం చేసింది. ఇంటిని అద్దెకు తీసుకొని ఆ ఇంటి యజమానికి తెలియకుండా చుట్టూ ఉన్న ప్రభుత్వ, ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ఆక్రమించిన కబ్జాదారుడు.. హోటల్, హాస్టల్‌కు అద్దెక్కిచ్చి నెలకు రూ.10లక్షలు వసూలు చేస్తున్నాడు. ఈ విషయంపై హైడ్రాకు ఇంటి యజమాని ఫిర్యాదు చేయడంతో స్పందించిన హైడ్రా.. గతంలోనే కిరాయిదారుడికి నోటీసులు ఇచ్చింది. సదరు కిరాయిదారుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఆ నిర్మాణాలపై ఎలాంటి హక్కు లేదని.. రోడ్డు, నాలాను ఆక్రమించి భవనాలు ఎలా నిర్మిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. దీంతో శుక్రవారం బుల్డోజర్లతో విరుచుకుపడి వాటిని నేలమట్టం చేసింది. ఆ ప్రదేశంలో జీహెచ్‌ఎంసీ చక్కటి పార్క్‌ను ఏర్పాటు-చేయనున్నట్టు- హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా చర్యలను స్థానికులు అభినందించారు. ప్రభుత్వభూమిని కాపాడారని కొనియాడారు. ఈ కూల్చివేతల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సీఎం ప్రజావాణిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

- చిన్నారెడ్డి, దివ్యలతో భేటీ
- సీఎం ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజావాణి : చిన్నారెడ్డి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం జరిగిన 'సీఎం ప్రజావాణి'ని శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్ర క్యాడర్ ఐఏఎస్ అధికారుల బృందం సందర్శించింది. సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును వారు క్షుణ్ణంగా పరిశీలించారు. పలు అంశాలపై సీఎం ప్రజావాణికి వస్తున్న ప్రజలు అందజేసే వినతి పత్రాల దరఖాస్తులను హెల్ప్ డెస్క్ సిబ్బంది సహకారాన్ని ఇవ్వడం, డెస్క్ అధికారులు వాటిని స్వీకరించి ఆన్లైన్లో సంబంధిత శాఖలకు పంపించే విధానాన్ని, ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో జరుపుతున్న సమన్వయ తీరును శిక్షణ పొందుతున్న ఐ.ఏ.ఎస్. అధికారులు పరిశీలించారు. అత్యవసర వైద్య సేవలు అందించే విభాగాన్ని కూడా వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఐఏఎస్ అధికారులు సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లతో భేటీ అయ్యారు. సీఎం ప్రజావాణి గురించి వారు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని చిన్నారెడ్డి వారికి తెలిపారు. సీఎం ప్రజావాణిలో సమస్యల పరిష్కారం ప్రస్తుతం 68 శాతం ఉందని, రానున్న రోజుల్లో 70 శాతానికి మించి అత్యుత్తమ ఫలితాలు ఉంటాయని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రజల నుంచి పిటిషన్స్ తీసుకుని సమస్యలు విని సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి, పిటిషన్స్ పై ఎండార్స్ మెంట్ చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చిన్నారెడ్డి వారికి వివరించారు. సీఎం ప్రజావాణి అమలు తీరు తమకు ఎంతో స్ఫూర్తిని కలిగించిందని, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారంలో తమకు ఇక్కడి అనుభవాలు చాలా ఉపయోగపడతాయని ట్రైనీ ఐఏఎస్ అధికారులు ప్రణయ్ కుమార్, సాలోని చాబ్ర పేర్కొన్నారు.



## మంత్రి వెంకటరెడ్డికి 'ఉప్పల' జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇంక్రిమెంట్‌కు అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాల లలో పని చేస్తున్న రెగ్యులర్ అధ్యాపకుల రెండో వార్షిక ఇంక్రిమెంట్ విషయంలొ కొందరు కావాలని సమస్యలు సృష్టించి జీతాల బిల్లులలో రెండో ఇంక్రిమెంట్ రాకుండా అడ్డుపడుతున్నారని ప్రభుత్వ మైనారిటీ అధ్యాపక సంఘ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ జబి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా సోహెల్, మిన్ హాజ్ పేర్కొన్నారు. ఈ విషయంలో వివిధ జిల్లాలలోని ఇంటర్ విద్య అధికారులు ఆదేశాలు ఇవ్వకపోవడంతో కొందరు ప్రిన్సిపాల్లు లెక్చరర్లకు ఇచ్చే ఇంక్రిమెంట్ లను ఆపే ప్రయత్నాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. గతంలో క్రమబద్దీకరణ జరిగిన మూడు వేల అధ్యాపకులను కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం మొదటి ఇంక్రిమెంట్ ఆలస్యం చేయకుండా ఇచ్చిందని తెలిపారు. ఈసారి ప్రభుత్వం నుండి కానీ, ఇంటర్ బోర్డు నుండి కానీ ఈ విషయంలొ ఎలాంటి అడ్డంకులు లేకపోయినప్పటికీ కొందరు ఇంటర్ వ్యవస్థలోని వ్యక్తులు సమస్యలు సృష్టించాలానే ఉద్దేశంతో అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి గందరగోళం సృష్టిస్తున్న వారిపై ప్రభుత్వం, సంబంధిత శాఖ మరియు ఇంటర్ విద్య శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోని ఈ నెల ఇంక్రిమెంట్ ఇచ్చేలా చూడాలని కోరారు, ప్రభుత్వ కళాశాలల అభివృద్ధిలొ తమ వంతుగా కృషి చేస్తూ, కళాశాలలొ నిధులు లేకపోయినప్పటికీ అడ్మిషన్ ల ప్రచారానికి, కాలేజ్ డెవలప్ ఫండ్ లలో, వివిధ అవసరాలలో ఆర్థికంగా సహాయపడుతున్న అధ్యాపకులకు నష్టపరిచే చర్యలు కొందరు నాయకులు చేయడం, అధికారులతో సంబంధం లేకుండా కొందరు సంఘ నాయకులే ఆర్థికపారమైన ఆదేశాలు ఇవ్వడం, అధికారులకు అధ్యాపకులకు మధ్య అగాధం సృష్టించడం లాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్య లోని అన్ని సంఘాల నాయకులు కోరుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## అస్తమానం ఫోన్‌లోనే ఉంటావా అంటూ భార్యను మందలించిన భర్త

- బావను చితకబాదిన బామ్మర్దులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎప్పుడూ మీ అమ్మతో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉంటావా.. బాబును పట్టించుకోవా అని భర్త మందలించినందుకు భార్య పెద్ద గొడవ చేసింది. అంతటితో ఆగకుండా తన కుటుంబసభ్యులను పిలిపించింది. ఈ క్రమంలో ఇంటికొచ్చిన బామ్మర్దులు.. బావ అని కూడా చూడకుండా ఇష్టమొచ్చినట్లుగా దాడికి పాల్పడ్డారు. హైదరాబాద్ ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట సమీపంలోని సక్కుబాయినగర్‌లో నివాసం ఉండే మనీశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ప్రియాంక అనే యువతితో పెళ్లయింది. వారికి ఏడాది బాబు ఉన్నాడు. అయితే కొంతకాలంగా ప్రియాంక తన తల్లితో గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడుతూ బాబును సరిగ్గా పట్టించుకోవడం లేదు. ఇది గమనించిన మనీశ్ ప్రియాంకను మందలించారు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ప్రియాంక ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులు మనీశ్ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో మనీశ్ కుటుంబసభ్యులు, ప్రియాంక కుటుంబసభ్యలకు మధ్య మాటామాటా పెరగడంతో పెద్ద గొడవ జరిగింది. ఈ గొడవలో భాగంగానే మనీశ్‌పై అతని బామ్మర్దులు విశాల్, రోహిత్ దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు వచ్చిన మనీశ్ సోదరుడు కార్తీక్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులపై సైతం దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు బీఎన్ఎస్ 115(2), 127(2),329(4), రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉద్యానవన సాగును విస్తృతంగా అభివృద్ధి చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



**వరంగల్ ప్రతినిధి, మే 23 (జనంసాక్షి):** రాబోవు ఖరీఫ్ సీజన్లో అన్నదాతలు ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంపొందించుకోవడానికి పంట ఉత్పత్తులను అధిక రాబడి రావడానికి ఉద్యానవన పంటల వైపు సాగుబడి కి దృష్టి సారించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఉద్యానవన శాఖ జిల్లా స్థాయి కమిటీ మీటింగ్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా హార్టికల్చర్ అధికారిణి సంగీత లక్ష్మి , జే డి అగ్రికల్చర్ అధికారిణి అనురాధ, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డి ఆర్ డి ఓ పి డి కౌసల్య దేవి పాల్గొని జిల్లాలో సాగు చేసే పండ్లతోటలు, కూరగాయల సాగు విస్తీర్ణం పై సంబంధిత అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి సమీక్షించడం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025- 2026 వార్షిక ప్రణాళిక వివిధ పథకాల ద్వారా రాష్ట్ర స్థాయి నుంచి కేటాయించబడిన వార్షిక ప్రణాళికను ఆమోదించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు పండ్లతోటలతో మల్చింగ్, బిందు సేద్యం, స్టేట్ వెదురు మిషన్ వంటి పథకాలకు ఉద్యానవన శాఖ అందిస్తుందని ఇట్టి రాయితీలను ఉత్సాహవంతులైన రైతులకు అందించి హార్టికల్చర్ సేద్యం పెంచేందుకు కృషి చేయాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో వ్యవసాయాన్ని ఆధునీకరించి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఉద్యానవన సాగును విస్తృతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.జిల్లాలో ప్రస్తుత హార్టికల్చర్ పంటల విస్తీర్ణాన్ని 32 వేల ఎకరాలనుండి 50 వేల ఎకరాలకు పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.ఉద్యానవన సాగు ప్రాధాన్యత అంశాలను వివరిస్తూ హార్టికల్చర్ పంటలు (పండ్లు, కూరగాయలు, పూలు, మందుల మొక్కలు) సాంప్రదాయ పంటల కంటే ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాల్సిందిగా సూచించారు.తక్కువ నీటి వినియోగంతో అధిక ఉత్పత్తిని సాధించవచ్చునని,మార్కెట్ డిమాండ్ ఉన్న విలువైన పంటల సాగుతో రైతులకు స్థిర ఆదాయం లభిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.పంట వైవిధ్యీకరణ పంటలు రైతులు కేవలం ధాన్యం, పత్తి వంటి పంటలకే పరిమితమవకుండా పండ్లు (మామిడి, సీతాఫలం, బొప్పాయ, అరటి, డ్రాగన్ ఫ్రూట్), తదితర పంటలే కాకుండా కూరగాయలు సాగు చేయాలని సూచించారు.మైక్రో ఇరిగేషన్ పద్ధతుల వినియోగం పై వివరిస్తూ,నీటి వినియోగాన్ని తగ్గించేందుకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్లు,పద్ధతులను ప్రోత్సహించాలని అన్నారు.పరిశ్రమ అనుసంధానం విషయానికి వస్తే ఉత్పత్తి అయిన పంటలకు ధర లభించేలా ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేలా మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.నాణ్యమైన మొక్కల నర్సరీలను ఏర్పాటుచేసి, రైతులకు సరైన సమయంలో మొక్కల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండించే వివిధ పంటల వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ఆవిష్కరించడమైనది.ఈ కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం రవి,కెవికె మామునూర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న , ఉద్యానవన శాఖ అధికారులు సిహెచ్ రాకేష్ ,జ్యోతి, తరుణ్ ,అరుణ, తిరుపతిలతో పాటు రైతులు దేవేందర్ కుమార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఇక్రిశాట్ ను సందర్శించిన రైతు కమిషన్ బృందం



**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డితోపాటు వ్యవసాయ అధికారులు హరి వెంకట ప్రసాద్, సురేష్ తోకూడిన బృందం ఇక్రిసాట్ను సందర్శించింది. రైతుకమిషన్ బృందానికి ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పతక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, ప్రిన్సిపల్ సైంటిస్టులు డా. హరికిషన్ సుడిని, డా. జానిలా స్వాగతం పలికారు. అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రమైన ఇక్రిశాట్ లో చేపడుతున్న కార్యక్రమాలను రైతు కమిషన్ బృందం అడిగి తెలుసుకుంది. మెట్ట పంటల అభివృద్ధి, విత్తన పరిశోధన, మట్టి ఆరోగ్యం, నీటి వినియోగం అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు, కమిషన్ బృందం మధ్య చాలా అంశాలు చర్చకు వచ్చాయి. రైతు కమిషన్ అభిప్రాయాలను ,ప్రభుత్వ పాలసీలను ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు ప్రతినిధులు విన్నారు. ఇక్రిసాట్లో జరుగుతున్న కార్యక్రమాలు, పరిశోధనలు శాస్త్రవేత్తలు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా విత్తన పరిశోధన, నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం, రైతు సంక్షేమంతో పాటు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి కొనసాగిస్తున్న ప్రాజెక్టులపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ద్వారా రైతులకు ఎలా మద్దతు అందిస్తున్నారన్న అంశాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. 1972లో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ఇక్రిసాట్‌ను ఏర్పాటు చేశారు. దానికోసం 3500 ఎకరాలను అప్పటి ప్రభుత్వం కేటాయించిందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి గుర్తుచేశారు. తాను గతంలో ఎమ్మెల్యే ఉన్న సమయంలో ఒకసారి, మళ్లీ ఇప్పుడు ఇక్రిశాట్ సందర్శించానని, రోజురోజు మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా ఇక్రిశాట్ పరిశోదనలు చేయడం, సాంప్రదాయ పంటలను అభివృద్ధికి ఇక్రిశాట్ సేవలు దోహదపడతాయన్నారు.

## సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**మంచిర్యాల ప్రతినిధి మే 23 (జనంసాక్షి) :** మంచిర్యాల కార్పోరేషన్ పరిధిలోని మంచిర్యాల మార్కెట్ ఏరియాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ , పవర్ సిస్టం, సెంట్రల్ లైటింగ్, రోడ్ల నిర్మాణం కోసం 78 కోట్ల రూపాయలు మంజూరు చేసిన సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అర్చనా టెక్స్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు, వ్యాపారస్థులు మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అందుకు సహకరిస్తూ నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

## 8లక్షల లంచం డిమాండ్

- టౌన్‌ప్లానర్ విఠల్ రావు పట్టివేత

**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు నిర్వహించారు. బిల్డింగ్ అనుమతికి లంచం తీసుకుంటూ అసిస్టెంట్ టౌన్ ప్లానర్ విట్టాల్ రావు పట్టుబడ్డారు. విటల్ రావును ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. విటల్ రావుకు సంబంధించిన మూడు చోట్ల దాడులు కొనసాగుతున్నాయి. రెండు బిల్డింగ్లకు ఎన్వోసీ ఇవ్వడానికి ఎనిమిది లక్షల డిమాండ్ చేసినట్లు- అధికారులు గుర్తించారు.. నాలుగు లక్షలు తీసుకొని మరో నాలుగు లక్షలు డిమాండ్ చేయడంతో వెంకట్ అనే వ్యక్తి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కాగా.. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు తీసుకునే వారిపై ఏసీబీ కఠిన చర్యలు తీసుకుంటుంది. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే వారిపై నిఘా పెట్టి ఆధారాలతో సహా వారిని అరెస్ట్ చేస్తుంది. ఎవరైనా అధికారులు లంచం తీసుకునేటప్పుడు దొరికితే అంతే సంగతులు. వారికి సంబంధించిన డేటా మొత్తం తీసి వారి ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. లంచాలు తీసుకున్న అధికారి ఆదాయం ఎం ఆదాయానికి మించి ఎన్ని ఆస్తులు ఉన్నాయని తెలుసుకొని కేసు నమోదు చేస్తున్నారు. తాజాగా అసిస్టెంట్ టౌన్ ప్లానర్ విట్టాల్ రావు ఆస్తులు ఎక్కడ ఉంటే అక్కడ ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. త్వరలో పూర్తి వివరాలు తెలియనున్నాయి.

## తరలివస్తున్న భక్తులు.. కిక్కిరిసిన ప్రాంగణాలు..

- తొమ్మిదో రోజు భారీగా వచ్చిన భక్తజనం..
- వర్షాలకు రోడ్లన్నీ బురదమయం..
- రాకపోకలకు అంతరాయం..
- అధికారుల పర్యవేక్షణ..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం, (జనంసాక్షి):** తొమ్మిదో రోజైన శుక్రవారం భక్తులు భారీగానే తరలివచ్చారు.. భక్తులతో ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి.. కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయం అయినా భక్తుల రాక తగ్గలేదు.. భక్తుల రాక పెరగడంతో వాహనాలు ట్రాఫిక్ జాం అయ్యాయి.. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు పర్యవేక్షించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. పుష్కర స్నానాలు చేసేందుకు భక్తులు ఉదయం నుండే త్రివేణి సంగమానికి భారీగా తరలివచ్చారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రహదారులు బురదమయమైనప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉదయం సరస్వతి ఘాట్, కాళేశ్వర దేవాలయం, ఆర్టీసీ బస్ స్టాండ్, పూసుపల్లి పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. భక్తుల రాక పెరిగిన నేపథ్యంలో పూసుపల్లిలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటుచేసి, అక్కడి నుండి దేవాలయం వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేసి భక్తులను పంపించారు. వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేలు పర్యటించి, వాహనాలను క్రమబద్ధీకరించారు. ఈ క్రమంలో భక్తులు త్రివేణి సంగమం వద్దకు చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిభావంతో తీర్థయాత్ర కొనసాగించారు. జిల్లా యంత్రాంగం భక్తుల భద్రత, శానిటేషన్, ఆరోగ్య సదుపాయాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. రానున్న మూడు రోజులు భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సరస్వతి ఘాట్, సరస్వతి నవరత్న మాలా హారతి, ఇతర ప్రధాన పుష్కర స్నాన ఘాట్లను పరిశీలించారు. భక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి, ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయి, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. భక్తుల సౌకర్యాల కోసం అందుబాటులో ఉన్న ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పుష్కర స్నానాలను భక్తులు ఆచరిస్తుండగా వారికి ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా కార్యక్రమాలు సాగుతున్నాయా అని అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు రోజులు పుష్కరాలు అత్యంత కీలకమని, భక్తుల రద్దీ రోజు రోజుకు పెరుగుతుండటంతో సదుపాయాల కల్పనలో అధికారులు మరింత నిమగ్నమై ఉండాలని ఆదేశించారు. అలాగే ఘాట్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ, వ్యర్థాలను తక్షణమే తొలగించే విధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## ఎన్‌జిఓ సహకారంతో మొబైల్ హెల్త్ క్యాంపులు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరం సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని టిజిఎస్ఎసిఎస్ ఆదేశానుసారం ములుగు దిశ ఆధ్వర్యంలో ఎన్‌జిఓ సహకారంతో మెబైల్ హెల్త్ క్యాంపులను నిర్వహిస్తుంది. ఈ నెల 15నుండి 26వరకు ఐసిటిసి కౌన్సిలర్ వి. కుమారస్వామి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం మెబైల్ హెల్త్ కాంపులో 515 మందికి నాలుగు రకాల రక్త పరీక్షలను, హెచ్ఐవి, స్పానిలీస్, స్పై పిల్, హెపటైటిస్ బి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధుల గురించి అహగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
24 మే 2025
తెలంగాణ

# బొగ్గు పొరల్లో రగిలిన జ్ఞాపకాలు



## మే 25న ఎంబర్స్ ఆఫ్ కోల్ ఆవిష్కరణ

సింగరేణి లో భూమి నుంచి వెలికి తీసిన ప్రతీ బొగ్గు పెళ్ల వెనుక కన్నీటి కథ ఒకటి దాగి ఉంటుంది. ఇక్కడ జరిగిన అనేక పోరాటాల వెనుక త్యాగాల చరిత్ర ఇమిడి ఉంటుంది. భారత కార్మిక వర్గానికీ పోరాటల్లో ఆదర్శంగా నిలిచిన సింగరేణి కార్మిక వర్గం, పోరాటాల చరిత్ర నిర్మాతలుగా ఎన్నో ఘటనలు నిరూపించాయి.

అలా సింగరేణి గని కార్మికుల పోరాటాల నేపథ్యంలోని జ్ఞాపకాల నుంచి వచ్చిందే గురిజాల రవీందర్ అందించిన బొగ్గు రవ్వలు నవల గత ఏడాది తెలుగులో వచ్చిన ఈ నవలను అగ్లంలో ముద్రించి మే 25న హైదరాబాద్ లో తిరిగి ఆవిష్కరిస్తున్నారు. మునుపెన్నడు లేనంతగా అధిక ప్రాచుర్యం ఈ నవలకు ఇటీవల లభించింది. పలువురు సాహిత్య కారులు బొగ్గు రవ్వలపై సమీక్షలు పలు పత్రిక లలో అందించారు.

సింగరేణి లోఎమర్జెన్సీ తర్వాత 1977నుంచి రాడికల్స్ రంగప్రవేశంతో కార్మిక చైతన్యం,సమస్య లపై పోరాటాలు మరో రూపం దాల్చాయి. కార్మికుల్లో రాడికల్స్ ప్రవేశం, వారి నేత్రుత్వం లో జరిగిన సమ్మె పోరాటాల విజయాలు, వాటి స్పూర్తితోనే పీపుల్స్ వార్ కోల్‌బెల్ట్ కమిటీ ఏర్పాటు తో పాటు సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) అనే కార్మిక సంఘం పుట్టు కొచ్చింది. బెల్లంపల్లి గోలేటి నుంచి మణుగూరు వరకు సంఘం విస్తరించిన తీరు, పార్టీ పై పెరిగిన నిర్భంధం, కార్మిక సంఘ నేతలు కూడ నిర్భంధానికి గురికావడం సీకాస ఆరంభనుంచే అనేక సవాళ్ళను ఎదుర్కోవాల్సి వచ్చింది. కార్మికోధ్యమ చరిత్రగా అవి లికించబడ్డాయి.

అయితే గురిజాల రవీందర్ తనతో పాటు తన కుటుంబ నేపథ్యాన్ని తెలియజెస్తూ జమ్మికుంట నుంచి సింగరేణికి వలస వచ్చి 1978నుంచి రాడికల్స్‌తో ఏర్పడిన సంబంధాలు, సింగరేణిలో ఉద్యోగం రీత్యా కార్మిక సమస్యలపై పని చేయ డం అలా రాడకల్ నుంచి కార్మిక నాయకునిగా ఎదగడం ఆప్రయాణంలో ఎదురైనా అనేక జ్ఞాపకాల గుర్తులే "బొగ్గు రవ్వ "లుగా పుస్తకం తీసుకు రావడం దానిని ఆంగ్లం లోకి ఆణువదించడం మరో స్థాయికి చేరింది. 1977 కు ముందే చున్న మామ (సుధాకర్)తో ఉన్నా పరిచయం తనను రాడికల్స్‌లో ప్రవేశించే టట్లు చేయగా, ఆదిలాబాద్ జిల్లాలో రాడికల్ బీజాలు నాటిన గజ్జల గంగారాం ద్వారా విప్లవ సిద్ధాంతాలు తెలుసుకొని తర్వాత క్రమం లో పీపుల్స్ వార్ కు అనుబంధంగా ఏర్పడిన సికాస, కార్మిక సంఘానికి నాయకుని గా ఎదిగిన తీరును రవీందర్ ఇందులో వివరించాడు.

రహస్య పార్టీ లో ఆజ్ఞతంగా పనిచేయడానికంటే, కార్మిక సంఘం లో లీగల్ నాయకునిగా కొనసాగాలను కున్నప్పటికి నిర్భంధం, కేసులు,అరెస్ట్‌లు జైలు జీవితం తప్పని పరిస్థితి నుంచి ఆ క్రమంలో తన మామ కూతురు సరళ ను వివాహం చేసుకోవడం ఇద్దరూ పార్టీలో పని చేయాలను కున్నప్పటికి అనుకూలించని వాతావరణం ఇలాంటి అనేక అనుభావాలతో ఎదుర్కొన్న విషయాలను కలిపి రాసిందే బొగ్గు రవ్వలు.

1981లో జరిగిన చరిత్రత్మాకమైన 56రోజుల సమ్మె పోరాటం సాధించిన విజయాల నుంచి పీపుల్స్ వార్ కోల్ బెల్ట్ కమిటీ (సిబిసి)తో పాటు సికాస కార్మిక సంఘం ఆవిర్భవించడం దాన్ని లీగల్‌గా నడిపించాలనుకొని 1982లో తొలి మహాసభలు గోదావరిఖనిలో జరిగినప్పుడు కార్మిక సంఘం ప్రధాన కార్య దర్శి గా రవీందర్ ఎన్నిక కావడం 1983లో కొత్త గూడెంలో జరిగిన 2వ మహాసభలలో విమల్ అధ్యక్షుడుగా రవీందర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్ని కయ్యారు. కరీంనగర్ జైలు కెళ్లడం అక్కడ సీనియర్ నాయకుల పరిచయం వారి అనుభవాలను ఇందులో వివరించడం ఆసక్తిని కలిగిస్తుంది.చంద్రా ప్రభాకర్ సీనియర్ నాయకుడు జైలులో తనకు తపాలా పూర్ ఘటన గురించి తెలియ జెస్తు కెవెస్ ఆధ్వర్యంలో పితాంబర రావు ఇంటిపై దాడి చేయగా గుండె పోటు తో పీతంబర రావు చని పోయిన సంగతి నెల రోజుల్లో మళ్ళీ తిరిగి జరిపిన దాడి లో ఆరుగురు చనిపోయిన విషయాలను వెల్లడించడం వంటి కొత్త సంగతులు ఆసక్తి ని కలిగిస్తాయి. చంద్రా ప్రభాకర్‌తో పాటు మల్లొజల వేణు గోపాల్, నారాయణ మరికొంత మందిని కలిసిన సంగతులు జైలులో ఉండగా బయట భార్య పడిన ఇబ్బందులు, జైలులో ఉండగానే సింగరేణి ఉద్యోగనుంచి డిస్మిస్ అయిన ఉత్తర్వులు అందుకోవడం అందుకు జైలు అధికారి సహకారంతో సింగరేణికి సమాధానం పంపే విషయాలు అందులో వివరించారు. విడుదలయ్యాక కూడ పార్టీ ఆదేశాల మేరకు సింగరేణిలో నీ కొత్తగూడెం, మణుగూరు ఏరియాలలో పనిచేయడానికి సిద్దపడడం, 1983లో కరీం నగర్ లో రైతు కూలి సంఘం మహాసభ ల విజయ వంతం కోసం పని చేయడం, మరో వైపు సింగరేణి లో డిస్మిస్‌ను సవాల్ చేస్తూ హై కోర్టులో ప్రముఖ న్యాయ వాధులతో కేసు వేయించడం లాంటి మొత్తం పార్టీ కార్యక్రమం లోతనకు ఎదురైన అంశాల ను రవీందర్ ఇందులో వివరించాడు.

పార్టీ నాయకుల ద్వారానే సరళను వివాహం చేసుకున్న రవీందర్ తర్వాత కాలంలో పెళ్లి చేసుకుని పార్టీలో రహస్యంగా పని చేయడం ఎంత కష్టమో వాళ్ళు పడ్డ ఇబ్బందులే తెలియ జెస్తాయి. అంతే కాక కూతురు పుట్టిన తర్వాత కూడ చిన్న పాపతో పార్టీ ఏర్పాటు చేసే షెల్టర్ లలోఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే విప్లవ పార్టీలో పని చేసే కామ్రేడ్‌లు పెళ్లిలు వద్దని ఒక వేల చేసుకుంటే పిల్లులు కనకుండా ఆపరేషన్‌లు చేసుకోవాలనే కండిషన్లు పార్టీ నాయకత్వం ఇందుకే పెడుతారని అర్థమవుతుంది. గంగారాం ద్వారా విప్లవ సిద్ధాంతలను నేర్చుకుని పూర్తి స్థాయిలో పార్టీలో పని చేయాలనీ నిర్ణయించుకోగ సింగరేణి లో కూడ పెరిగిన నిర్భంధం, పోలీస్ కేసులు పెరగడంతో తనను అండర్ గ్రౌండ్ కు పంపించి పనిచేయించాలని నాయకత్వంను కోరిన రవీందర్ తనతో పాటు భార్య సరళను కుయుజి పంపాలని కోరీ నట్లు. అందుకు నాయకులు రెండుసార్లు గడువు పెట్టగా తర్వాత రాష్ట్ర కార్యదర్శి రఘును మరో సారీ భార్య సరళ 7నెలల పాపతో కలిసి కలుసు కొని అజ్ఞాతం లో కి పంపించే దాని గురుంచి చర్చించి నట్లు అందుకు రఘు ప్రస్తుత పరిస్థితుల లో నిన్ను మాత్రమే పంపిస్తామని, సరళ ను ఇప్పుడు పంపించడం కుదరదని స్పష్టం చేసి నట్లు పేర్కొన్నాడు. అయితే ఇద్దరినీ పంపిస్తే నే పార్టీలో కొనసాగ నున్నట్లు లేకుంటే పార్టీకి దూరం అయి మా మార్గం మేము చుసుకుంటమని కూడ చెప్పి నట్లు రవీందర్ వివరించారు. ఆ తర్వాత సికాస ను వీడి కేసులలో కోర్ట్ నందు లొంగి పోయినట్లు నవలలో వివరించాడు. అయితే ఈ విషయంలో కొన్ని అభ్యన్తరాలు వెల్లడయ్యాయి.

మేము ఇద్దరం వస్తామంటే అనుకూలత లేక పార్టీ అంగీక రించలేదని, రవీందర్ ఇందులో చెప్పారు. ఏమైనప్పటికి 45 సంవత్స రాల కిందటి తన అనుభవాలు, జ్ఞాపకాల గుర్తులు "ఎంబర్స్ ఆఫ్ కోల్" నవల ద్వారా రాడికల్, సికాస కార్య కలాపాలు అందులో తాను నిర్వహించిన పాత్ర ఈ నవలలో రవీందర్ వివరించారు. 1977లో మొదలయి, 1985వరకు తాను విప్లవ పార్టీ లో పనిచేసిన కాలం వరకు మాత్రమే బొగ్గు రవ్వలు లో వివరిస్తూ ఈ పుస్తకం ఉంటుంది.



**ఏబూసి**
సెల్: 9849157969



# ఆహార వ్యవస్థలలో శుచిశుభ్రత, నాణ్యత తప్పనిసరి

నేటి సమాజంలో, వేగవంతమైన జీవన శైలి కారణంగా ప్రజలు తమ రోజువారీ పనులలో నిమగ్నమై, ఆహారం సిద్ధం చేసుకోవడానికి తీరిక లేకుండా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, హోటళ్లు, మెస్‌లు, కర్రీ పాయింట్లు వంటి వ్యవస్థల ద్వారా సులభంగా, కష్టం లేకుండా ఆహార పదార్థాలను పొందే అలవాటు ప్రజల్లో ఏర్పడింది. అయితే, ఈ ఆహార వ్యవస్థలలో శుచిశుభ్రత, నాణ్యత, మరియు ఆహార భద్రత పాటించబడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవలి కాలంలో, పెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు, మరియు ఇతర ఆహార విక్రయ కేంద్రాలపై స్థానిక సంస్థల అధికారులు నిర్వహించిన పరిశీలనలలో, కొన్ని చోట్ల నాణ్యత లేని పదార్థాలతో ఆహారం తయారు చేయబడుతున్నట్లు తేలింది. ఈ సమస్యలు కర్రీ పాయింట్లలో కూడా గమనించబడుతు న్నాయి, ఇవి ప్రస్తుతం విస్తృత స్థాయిలో వ్యాపించాయి. కర్రీ పాయింట్లలో వండే కూరలు, పప్పులు, మరియు ఇతర ఆహార పదార్థాల తయారీ విధానంలో నాణ్యత మరియు శుచిశుభ్రత పాటించబడుతున్నాయా అనే సందేహం ప్రజల్లో కలుగుతోంది. ఈ పాయింట్లలో ఉపయోగించే నూనె, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు వంటి పదార్థాలు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా అనే అనుమానం కూడా ఉంది. అంతేకాకుండా, ఈ కర్రీ పాయింట్లలో ధరల పట్టికలు స్పష్టంగా ప్రదర్శించబడటం లేదు, దీనివల్ల కొనుగోలుదా రులకు సరైన ధరల గురించి సమాచారం అందుబాటు లో ఉండటం లేదు. ఇంకా, ఈ కర్రీ పాయింట్లలో ఎప్పుడూ గిన్నెల నిండా కూరలు, పప్పులు నిల్వగా కనిపి స్తాయి. ఈ ఆహార పదార్థాలు ఎప్పుడు తయారు చేయబ డ్డాయి, ఎంత తాజాగా ఉన్నాయి అనే విషయంపై సందేహాలు తలెత్తుతున్నాయి. నిల్వ చేయబడిన ఆహారం ఎక్కువ కాలం పాటు ఉంచబడితే, దాని నాణ్యత, ఆరోగ్యకరమైన లక్షణాలు దెబ్బతినే అవకాశం ఉంది.

ఈ సమస్యలను పరిష్కరించడానికి, ఆహార భద్రత అధికారులు మరియు స్థానిక సంస్థలు కర్రీ పాయింట్లపై తరచూ పర్యవేక్షణ చేయాలి. ఈ పర్యవేక్షణలో ఆహార పదార్థాల తయారీ విధానం, ఉపయోగించే పదార్థాల నాణ్యత, నిల్వ పద్ధతులు, మరియు శుచిశుభ్రత ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. అలాగే, కర్రీ పాయింట్లలో ధరల పట్టికలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి, తద్వారా ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉంటుంది. ఆహార భద్రత అధికారులు ఈ కర్రీ పాయింట్లలో ఉపయోగించే నూనె, కూరగాయలు, మరియు ఇతర పదార్థాల నాణ్యత ను పరీక్షించేందుకు నిర్దిష్టమైన ప్రమాణాలను రూపొంది ంచి, వాటిని కఠినంగా అమలు చేయాలి.

అదనంగా, కర్రీ పాయింట్ల నిర్వాహకులు తమ వినియోగదారులకు ఆరోగ్యకరమైన, తాజా ఆహారం అందించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలి. తాజా పదార్థాలను ఉపయోగించడం, ఆహారాన్ని సరైన పద్ధతిలో నిల్వ చేయడం, మరియు రోజువారీగా తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే విక్రయించడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రజలకు నాణ్యమైన, శు చిగా ఉన్న ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడటమే కాక, వినియోగదారుల విశ్వాసాన్ని కూడా పొందవచ్చు.

స్థానిక సంస్థలు మరియు ఆహార భద్రత అధికారులు కలిసి, కర్రీ పాయింట్లలో నాణ్యత మరియు శుచిశు భ్రతను నిర్ధారించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం, ఆకస్మిక తనిఖీలు, నాణ్యత పరీక్షలు, మరియు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని త్వరగా పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అలాగే, కర్రీ పాయింట్ల నిర్వాహకులకు శుచిశుభ్రత మరియు ఆహార భద్రతపై శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారిలో అవగాహన పెంచవచ్చు.

కర్రీ పాయింట్లు ప్రజలకు సులభంగా ఆహారం అందించే ముఖ్యమైన వ్యవస్థగా ఉన్నప్పటికీ, వాటిలో నాణ్యత మరియు శుచిశుభ్రతను నిర్ధారించడం అత్యంత ముఖ్యం. స్థానిక సంస్థలు, ఆహార భద్రత అధికారులు, మరియు కర్రీ పాయింట్ నిర్వాహకులు కలిసి పనిచేయడం ద్వారా, ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉండేలా చేయవచ్చు. ఇది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే కాక, ఆహార వ్యవస్థలపై వారి విశ్వాసాన్ని కూడా పెంచుతుంది.

**దండంరాజు రాంచందర్ రావు**
పాత బోయినపల్లి
9849592958

## అన్నదమ్ముల అనుబంధం జన్మ జన్మల బంధం

(మే 24 జాతీయ సోదరుల దినోత్సవం సందర్భంగా)

సోదరుడు దేవుడిచ్చిన
వరం అత్యంత సన్నిహితుడు
జీవితకాల సహచరుడు
ఎప్పుడు అండగావుండే
వాడు
తెంచుకున్న తెగని బంధం
సోదర బంధం
చికాకు నిరాశ నిస్పృహ
నిర్వేదం ఆందోళన
భయం దూరం చేసి
నేను ఉన్నానని
అభయం ఇచ్చే
అభిమాన సేనాని
భరోసా భద్రతకు
పెద్ద దిక్కు
బాధలను పంచుకొని
బాధ్యతలు పెంచుకొనే
రక్షణా కవచం

సోదరుడు అంటే
నమ్మకం ప్రేమ
ఆప్యాయత అనురాగం
ఆదరణ దయ కరుణ
బలం బలగం
కష్ట సమయాల్లో
శక్తికి మూలం
శరీరానికిజి
చేతులు కాళ్ళు
కలిసి వుంటాయి
అలాగే సోదరీ
సోదరులుజి
సన్నిహితంగా
ఉంటారు
సోదర భందం విడిపోని
విడదీయరాని భంధం
రక్త సంబంధం
తల్లిదండ్రుల ప్రేమను
పంచుకొని ఆప్యాయత
అనురాగాలు పంచుకుని
తాతయ్య నానమ్మల
ముద్దు ముచ్చట్లతో
పెరిగి పెద్దల
దీవెనలతో ఎదిగి
కుటంభ వారసత్వానికి
అంబాసిడర్లుగానిలిచి
సమాజానికి
ఆదర్శంగా నిలువాలి
అమ్మ నాన్నల
ఆలానా లాలన
పాలనలో పెరిగి
బాల్యంలో ఒకరికి ఒకరు
తోడుగా నీడగా
ఆట పాటలతో అల్లరి
చేస్టలతో అమాయ కత్వంతో
కొట్లాటల్లో పాలు
పంచుకున్న
అన్నదమ్ముల అనుబంధం
జన్మ జన్మల బంధం
జీవితాన మరువలేనిది,
మరపురానిది అన్నదమ్ముల
బంధం
రామలక్ష్మణుల అనుబంధం
లాగా జీవితాంతం
ఒకరికి ఒకరుగా
తోడుగా నీడగా
వుండాలి
రామలక్ష్మణులనుజి
స్ఫూర్తిగాతీసుకోవాలిజి
రామ లక్ష్మణుల హ
సందేశం
అన్నదమ్ముల
బాట కావాలి
రామలక్ష్మణుల జీవితం
అన్నదమ్ముల జీవిత
కార్యాచరణ కావాలి
సౌభ్రాతృత్వమే
సంపద కావాలి
సంఘర్షణ వీడాలి
సహనం సంఘీభావం
అవగాహన బంధాలు
అనుబంధాలు
ఆత్మీయత ఆర్థత
అంకురించాలి
అన్నదమ్ముల దినం
అసూయ అహం
అజ్ఞానం చీకటిని
పారదోలిజి
ఆప్యాయత అనురాగాల
అనుబంధాల ఆనందానికి
వెలుగు దివ్వె కావాలి



**నేదునూరి కనకయ్య**
రాష్ట్రఅధ్యక్షులు, తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు, కరీంనగర్
9440245771

## ఆ రోజులే బాగున్నాయి..!!

పచ్చని ప్రకృతి పులకిస్తుంటే
సెలయేరు పరవళ్ళు తొక్కుతూ వెళ్ళేది
చేను సెలకల్లో మునిగిపోయి పని చేస్తే
పొడిచిన పొద్దు మునగడం తెలిసేది కాదు
పశువులతో చెలిమి చేస్తూ
మట్టితో కలిసి ఆటలాడుకుంటుంటే
అన్నం పొద్దు కూడా గుర్తుకొచ్చేది కాదు
బావిలో నీరు చెలమలో నీరు
వడబోసుకుని గుటకలు మింగుతుంటే
ఔషధంతో పని పడేది కాదు
రాగి సంగటి ముద్ద కుదుర్లోకి వస్తుంటే
లోపలి పేగులు పోటీ పడి మింగేవి
పిప్పరమెంటు నోట్లో కమ్మగా కరిగిపోయేది
రస గోలీల రసం తేనామృతంలా వుండేది
గోలీ సోడా గుటగుటా మింగుతుంటే
కడుపులో ఉబ్బరం ఉరుకులు పెట్టేది
ఆ రోజులే బాగున్నాయి మరి
ఉత్తరం కవరు ముంగిట్లో వాలిపోగానే
క్షేమ సమాచారం కోసం ఆత్రంగా విప్పేవాళ్ళం
నాన్న ఇచ్చిన పది పైసలు చూడగానే
సంతోషం ఎగిరి గంతేసి పప్పులు కొనేటోళ్ళం
సంతకు వెళ్ళిన నాయిన రాక కోసం
బస్టాండ్ కాడ పడిగాపులు కాసేటోళ్ళం
కోతి కొమ్మచ్చి తొక్కుడు బిళ్ళ
గోలీలాట దాగుడుమూతలాట
ఆడి ఆడి అలసిపోయి మూలకొరిగేటోళ్ళం
సందె కాడికి ఇంట్లో చేరి
కొత్త సినిమా వేసారనే అనౌన్స్ వినగానే
రాత్రి ఆటకై చీకట్లను చీల్చుకెళ్ళేటోళ్ళం
లాంతరు కింద కూర్చుని
పుస్తకంలో అక్షరాల్ని ఏరుకునేటోళ్ళం
ఇంకు పెన్ను విదిలిస్తూనే
పేరాలు పేరాలు నింపేటోళ్ళం
బలపంతో అ ఆ లను దిద్దుకుంటూ
సరస్వతి ఒడిలో వాలిపోయేటోళ్ళం
జడ కుచ్చులతో తలను సింగారించి
అచ్చ తెనుగు ఆడబిడ్డలా కానొచ్చేటోళ్ళం
ఎర్రబస్సు కిటికీ పక్కన కూర్చుని
పరిసరాల్ని చూస్తూ ప్రయాణం చేసేటోళ్ళం
మిత్రత్వం పలకరింపుల కోసం
మైలు దూరమైనా అడుగుల్ని కదిపేటోళ్ళం
పండగ పబ్బాలకు నూతన వస్త్ర ధారణకై
దర్జీ దగ్గరకు పలుమార్లు తిరిగేటోళ్ళం
గాయానికి నున్నటి మట్టి పూసుకుని
లేడి పిల్లలా ఎగిరి గంతులేసేటోళ్ళం
పొలం పనుల్లో పగలంతా అలిసిపోయి
చుక్కలు లెక్కెడుతూ నిద్రలోకి జారుకునేటోళ్ళం
ఆ రోజులే బాగున్నాయి సుమీ
అస్తమానం చరవాణిలో మునిగిపోతూ
మస్తిష్కానికి మంకు పుట్టించేటోళ్ళం కాదు
ఆన్ లైన్ గేమ్ లతో మమేకమౌతూ
ఏకాకిగా జీవితం గడిపేటోళ్ళం కాదు
బెట్టింగులు రేటింగులతో ముడిపడిపోతూ
మాయాజాల వలలో ఇరుక్కునేటోళ్ళం కాదు
బంధాల్ని బాంధవ్యాల్ని ఒంటరిని చేసి
నూతన సాంకేతిక కంచెలో వుండేటోళ్ళం కాదు
ఆరోజులే దివ్యంగా వున్నాయి
ఆరోగ్యంగా ఆనందంగా వున్నాయి


**- నరెద్దుల రాజారెడ్డి**
సెల్ : 9666016636

# మోదీ విదేశీ యాత్రలు, విదేశాంగ విధానం

2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నరేంద్ర మోదీ భారతదేశాన్ని ప్రపంచ వేదికపై ప్రముఖంగా నిలపడానికి అనేక విదేశీ యాత్రలు చేశారు. 2025 నాటికి, ఆయన 73 దేశాలకు విదేశీ పర్యటనలు చేశారు.ఒక్క అమెరికానే 10సార్లకు పైగా సందర్శించారు.మొత్తంగా 151 సార్లు అనేక దేశాలు తిరిగి వచ్చారు. జపాన్, ఫ్రాన్స్, యూఏఈ వంటి దేశాలతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్ వంటి పొరుగు దేశాలను సైతం సందర్శించారు. ఈ యాత్రలు భారతదేశ ఆర్థిక, రక్షణ సంబంధాలను బలోపేతం చేయడంలో, అంతంత మాత్రంగానే లాభం చేకూర్చిందని విదేశాంగ నిపుణులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతి ప్రముఖ పట్టణాలలో వ్యాపార వేత్తలతో, రాజకీయ ప్రముఖు లతో మీటింగులకు, హోర్డింగులు, విందులు దేశ ,విదేశాల్లో అనవసర ఆర్భాటపు ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా ఖర్చు పెట్టారు.సాధించిన ఫలితాలు తక్కువ, విశేష ప్రచారం కోసం ప్రజాధనం విచ్చలవిడిగా ఖర్చు పెట్టారు.

మనం ఆశించిన స్థాయిలో విదేశీ పరిశ్రమలు గానీ, పెట్టుబడులుగానీ రాలేదు .ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కలేదు.మొత్తంగా పెట్టిన ఖర్చులకు ,వనకూడిన ప్రయోజనాలకు బేరీజు వేసుకుంటే సమకూరిన లాభం చాలా చాలా పరిమితం. ఆర్భాటపు హంగామా గోదీ మీడియా హైపులు అపరిమితం.గతంలో ఎన్నడూ లేనంత దుబారా ఖర్చులు పెరిగాయి. ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పింది. ప్రపంచం అంతా తిరిగి దొరికిన చోటల్లా అప్పులు చేసారు. వ్యక్తి గత ప్రచారానికి శ్రీకారం చుట్టారు.తెచ్చిన రుణాలకు వడ్డీతో సహా వాయిదాల ప్రకారం చెల్లిం చటానికి తిరిగి అప్పులు చేసే పరిస్థితి ఏర్పడింది.భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 2014 వరకు గత 65 ఏళ్ళలో అందరు ప్రధాన మంత్రులు చేసిన అప్పుల కంటే మిన్నగా కేవలం 10ఏళ్ళలో 100 లక్షల కోట్లు అప్పు చేశారు.

అయితే, ఈ యాత్రల కోసం ఎంత ఖర్చు చేసినా , ఎన్ని దేశాలు తిరిగినా ప్రజలు ప్రశ్నించ లేదు.ఆశించిన ఫలితాలు రాకున్నా మీడియా ప్రచారం, సోషల్ మీడియా ప్రాపగాండా లో "విశ్వ గురువు" అంటూ అనవసరపు, బూటకపూ ఇమేజీని క్రియేట్ చేశారు. ప్రజలు ఆయనపై ఆరాధనా భావంతో ఉన్నారు. ఆయన రూపొందించిన పథకాలు ఏవీ ఆచరణలో ఆశించిన ఫలితాలు రాకున్నా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడకున్నా..




మరింతగా దిగజారింది.రూపాయి విలువ అమెరికా డాలర్ తో పోలిస్తే దారుణంగా పడిపోయింది. పెట్రోల్,డీజిల్, ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. అయినా ప్రజలు మౌనంగా ఉండేలా ఆయన చుట్టూ ఉన్న యంత్రాంగం, పార్టీ కార్యకర్తలు , మోదీ మీడియా రక్షణ కవచంలా, అభేధ్య దుర్గాన్ని నిర్మించారు.హిందూ మతోద్ధార కుడిగా గోదీ మీడియా ప్రాపగాండా పనిచేసింది. మోదీ ఇమేజ్‌ను నిర్మించడంలో మీడియా, సామాజిక మాధ్యమాల పాత్ర గురించి విమర్శనాత్మ కంగా పరిశోధించాల్సిన అవసరం ఉంది. ఈ వ్యాసం మోదీ విదేశాంగ విధానంలోని లోపాలను, దాని ప్రభావాన్ని సూక్ష్మంగా, సంక్షిప్తంగా విశ్లేషిస్తుంది.

మోదీ విదేశీ పర్యటనల వల్ల కొన్ని మంచి ఫలితాలు పరిమితంగా వచ్చాయి.ముఖ్యంగా 2015లో ఫ్రాన్స్‌తో రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం, జపాన్‌తో ఆసియా-ఆఫ్రికా గ్రోత్ కారిడార్ వంటివి ఈ యాత్రల ఫలితాలు. అయితే, ఈ యాత్రల ఖర్చు వివాదాస్పదంగా మారింది. %శ% పోస్టుల ప్రకారం, 129 యాత్రలకు రూ. 2,000-2,500 కోట్లు ఖర్చయ్యాయని అంచనా, అయితే అధికారిక లెక్కల ప్రకారం 2022-24 మధ్య 38 యాత్రలకు రూ. 258 కోట్లు ఖర్చయ్యాయి. ఈ ఖర్చుల వివరాలు పారదర్శకంగా లేకపోవడం, దేశీయ సమస్యలైన నిరుద్యోగం, గ్రామీణ ఉపాధి కరువు,ఇతర ఆర్థిక ఇబ్బందుల మధ్య ఈ ఖర్చులు సమర్థనీయమా! అనే ప్రశ్నలు లేవనెత్తాయి.

2025 ఏప్రిల్ 22న పహల్‌గామ్ ఉగ్రదాడితో మొదలైన భారత్-పాకిస్తాన్ సంఘర్షణ (పరిమిత యుద్ధం) మోదీ దౌత్య శక్తిని పరీక్షించింది. "ఆపరేషన్ సిందూర్" ద్వారా భారత్ ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ సందర్భంలో ఇజ్రాయెల్ మాత్రమే భారత్‌కు స్పష్టమైన మద్దతు ఇచ్చింది. అమెరికా శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించి తానే ఇరు దేశాలను బెదిరించి రాజీ కుదిరించినట్లు గా, పదేపదే మోదీ చేప్పుకున్నారు. ఈ ప్రకటన నిజమేనని పాకిస్తాన్ చెప్పుకుంది. మోదీ జోక్యం పై భారత్ ప్రధాన మంత్రి మోదీ నేటి వరకు అధికారికంగా మోదీ జోక్యం లేదని ఖండించలేదు.4 తరువాత విదేశాంగ మంత్రి మెల్లగా దౌత్య భాష లో సన్నాయి నొక్కులు నొక్కాడు. పైగా ఈ యుద్ధ విషయంలో రష్యా, ఐరోపా దేశాలు తటస్థంగా ఉన్నాయి. జర్మనీ సానుభూతి తెలిపినప్పటికీ ఉపశమనాన్ని ప్రోత్సహించింది. ఈ సంక్షోభంలో మన దేశానికి అంతర్జాతీయ మద్దతు పరిమితంగా ఉండటం... పాకిస్తాన్ కు చైనా,టర్కీ బాహాటంగా మద్దతు పలికాయి. అమెరికా ఐఎంఎఫ్ ద్వారా తక్షణ ఆర్థిక సహాయం ఒక బిలియన్ డాలర్లు అడ్వాన్స్ గా ఒక ఉగ్రవాద పాకిస్తాన్ దేశానికి ఇప్పించింది. మోదీ విశ్వ ప్రయత్నం చేసినా ఐఎంఎఫ్ రుణాన్ని ఆపలేక పోవటం మోదీ దౌత్య పరంగా వైఫల్యం చెందడంగా భావించాలి. మొత్తంగా మీదీ దౌత్య విజయాలపై అనేక ప్రశ్నలు లేవనెత్తింది. 2025 భారత్-పాకిస్తాన్ యుద్ధం సమయంలో మనకు అంతర్జాతీయ మద్దతు లభించలేదనే చెప్పాలి.

మోదీ విదేశాంగ విధానంలో అనేక లోపాలు బాహాటంగా కనిపిస్తాయి. మొదట, వ్యక్తిగత దౌత్యంపై అతిగా ఆధారపడటం. 2015లో పాకిస్తాన్‌తో చర్చలు ఫలితం ఇవ్వలేదు, చైనాతో గల్వాన్ సంఘటన తర్వాత సంబంధాలు క్షీణించాయి. రెండవది, ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు బలహీనపడటం. పాకిస్తాన్‌ను ఒంటరిగా చేయడంపై దృష్టి సారించడంతో నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాలు చైనాతో సన్నిహిత మయ్యాయి. సార్క్ (%సాూాూ=జ%)ని పటిష్ఠం చేయడంలో విఫలమవడం మరో లోపం. మూడవది, అంతర్జాతీయ సంబంధాలలో అస్థిరత. అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధాలు కాస్త బలపడినప్పటికీ, రష్యాతో సంబంధాలు బలహీన పడ్డాయి. నాల్గవది, పాకిస్తాన్ తో పాక్షిక సంక్షోభ యుద్ధ సమయంలో అంతర్జాతీయ మద్దతు సేకరించడంలో విఫలం కావడం గమనార్హం.

"గోదీ మీడియా" మరియు "వాట్సాప్ యూనివర్సిటీ" అనే పదాలు మోదీ ఇమేజ్‌ను అతిశయోక్తులతో మానవాతీత శక్తిగా మోదీని ఆకాశానికి ఎత్తుతూ ఫాల్స్ ఇమేజ్ ను చిత్రీకరించాయి. ఈ మాధ్యమాలు ఎంతగా ప్రచారం చేశియా అంటే. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మోదీ ఆపగలడనీ, అమెరికా, కెనడాలో విద్యార్థుల సమస్యలను పరిష్కరంచ గలడని ... బీజేపీ,గోదీ మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది, ఈ ప్రచారాన్ని తర్వాత మెల్లగా అధికారికంగా ఖండించబడింది. ఈ అతిశయోక్తులు దేశీయంగా మోదీకి మద్దతును పెంచినప్పటికీ, అంతర్జాతీయంగా భారత్‌కు విశ్వసనీయతను తగ్గిస్తాయి. 2023లో "ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వే" ప్రకారం, మోదీ విదేశాంగ విధానంపై 37 శాతం మంది మాత్రమే మోదీ పై తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి సందర్భంలో ప్రచారం, ముఖ్యంగా 2014కు ముందు భారత్ చాలా బలహీనంగా ఉందనే తప్పుడు ప్రచారం చేసింది.

చివరిగా భారత్ నిజమైన ప్రపంచ శక్తిగా ఎదగాలంటే, మోదీ విదేశాంగ విధానం ఆడంబరం నుంచి ఫలితాల వైపు మళ్ళాలి. దేశీయ అవసరాలతో పాటు అంతర్జాతీయ లక్ష్యాలను సమతుల్యం చేయడం ద్వారా మోదీ భారత్‌కు, తనకూ మరింత గౌరవం తెచ్చుకోవచ్చు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# నగరంలో పలు హాస్టళ్లను తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు

- నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు
- 30 హాస్టళ్లకు నోటీసులు జారీ, 5 హాస్టళ్ల కిచెన్‌ల సీజ్
- రూ. 2.5 లక్షల జరిమానా



**హైదరాబాద్ సిటీ, మే 23 (జనంసాక్షి) :** జిహెచ్ఎంసి పరిధిలో నిబంధనలు పాటించని హాస్టళ్ల పై ఫుడ్ సేఫ్టీ తో పాటుగా ఇతర శాఖలతో ఏర్పడిన టాస్క్ ఫోర్స్ బృందాలు శుక్రవారం అమీర్‌పేట, అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్ మొదలైన ప్రాంతాల్లో పలు హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ మహిళలు, పురుషులు, విద్యార్థుల అవసరాలను తీర్చడానికి అనేక ప్రైవేట్ హాస్టళ్లు ఆహార భద్రత, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, అగ్ని ప్రమాద నివారణ మొదలైన నిబంధనలను ఉల్లంఘిస్తూ హాస్టళ్లను నిర్వహిస్తున్నారు.హాస్టళ్ల యాజమాన్యం సెల్లార్లను, పార్కింగ్ ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం, నియమ నిబంధనలను ఉల్లంఘించి పెద్ద హెూర్డింగ్‌లను ప్రదర్శించడం, అపరిశుభ్రంగా తయారు చేస్తున్న నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేయడం, చిన్న గదుల్లో విద్యార్థును పెట్టడం, సరిపోను సరైన మరుగుదొడ్లు వంటి వారి ప్రాథమిక అవసరాలను విస్మరించారు. అంతేకాకుండా వీధుల్లో వ్యర్థాలను పారవేయడం వంటి చర్యలకు పాల్పడుతోంది.నిర్వాహకుతో పాటుగా, భవన యజమానులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినప్పటికీ, కొన్ని యాజమాన్యాలు ఇప్పటికీ అపరిశుభ్రమైన పరిస్థితులు నిర్వహించడంలో బాధ్యతారహితంగా ఉన్నాయి. ఇది ప్రజలకు ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అటువంటి ఉల్లంఘనలను అరికట్టడానికి, జీహెచ్ఎంసీ అంతటా చట్టాలను ఉల్లంఘించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న హాస్టళ్లపై (ఉదాహరణకు అమీర్‌పేట, ఖైరతాబాద్ జోన్, అశోక్ నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించడానికి జీహెచ్ఎంసీ అధికారులతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు.ఈ బృందాలు అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాలలో సుమారు 58 హాస్టళ్లను తనిఖీ చేసి, 30 హాస్టళ్లకు నోటీసులు జారీచేసి, 5 హాస్టల్ కిచెన్‌లను మూసివేయబడ్డాయి. జీహెచ్ఎంసీ 1955 యాక్ట్ నిబంధనల ప్రకారం రూ.2,45,500 జరిమానా విధించారు.

# సీఎం రాకతో నిమ్జ్ భూ నిర్వాసితుల ముందస్తు అరెస్ట్



**న్యాల్‌కల్, మే 23 (జనం సాక్షి) :** జహీరాబాద్ లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన, విగ్రహావిష్కరణ, తదితర కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటన నేపథ్యంలో సభలో ఇలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్ కల్, ఝరాసంఘం మండలాల్లో జాతీయ ఉపాధి మండలి (నిమ్జ్) భూనిర్వాసితులు గత నాలుగైదు సంవత్సరాలుగా పరిశ్రమల ఏర్పాటుకు పట్టా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు సీఎం సభలో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు స్థానిక జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు పర్యవేక్షణలో.. ఎస్సై చెల్లా రాజశేఖర్, పోలీసుల బృందం దృష్టి సారి ఇచ్చారు. శుక్రవారం తెల్లవారు జామున్నె మండలంలోని మామిడిగి, రేజింతల్ గ్రామాలకు చేరుకొని భూ నిర్వాసితులతో నేరుగా చర్చించారు. ఐదుగురు భూ నిర్వాసితులు ముఖ్యమంత్రికి నేరుగా వినతి పత్రాన్ని అందజేసే విధంగా చొరవ తీసుకుంటానని సిఐ రైతులతో చర్చించారు. గ్రామానికి చెందిన పదుల సంఖ్యలో భూ నిర్వాసితులు గ్రామంలోని ప్రధాన కూడలి వద్దకు చేరుకుని పోలీసుల ముందు వాపోయారు. మూడు రకాలు పంటలు పండించే సారవంతమైన పట్టా భూములను ఇట్టి పరిస్థితుల్లో పరిశ్రమలకు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు రైతులను ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. మామిడిగి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు రాజిరెడ్డి, సంజీవరెడ్డి, నాగన్న, కిష్టారెడ్డిలను ముందస్తు అరెస్టు చేశారు. రేజింతల్ గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ అసంతృప్తిని వ్యక్తం చేశారు. మండలంలోని మల్గి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రాజీవ్ వికాస్ పథకాన్ని అందించాలి

- ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, మే 23 (జనంసాక్షి) : అర్హులైన ప్రతి ఒక్కరికి రాజీవ్ వికాస్ పథకాన్ని అందించాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీడీవోలతో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అర్హులైన ప్రతి ఒక్కరికి రాజీవ్ వికాస్ పథకాన్ని అందించాలని తెలిపారు, ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద మంజూరైన వారు 400 స్క్వేర్ ఫీట్ నుండి 600 స్క్వేర్ ఫీట్ వరకు ఇల్లు కట్టుకోవాలని, రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని, జూన్ 2 న లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్పల్లి ఎంపీడీవో వెంకయ్య ,చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు, మొయినాబాద్ ఎంపీటీవో సంధ్య, నవాబ్ పేట్ ఎంపీడీవో అనురాధ మరియు షాబాద్ ఎంపీడీవో అపర్ణ పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలి

- అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్



**బొంరాస్‌పేట, మే 23 (జనం సాక్షి) :** బొంరాస్ పేట,మెట్లకుంట గ్రామాలలో ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ తనిఖీ చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,లారీలలో వెంటనే మిల్లుకు ధాన్యం తరలించాలన్నారు.ఆయన వెంట తహసిల్దార్ పద్మావతి,రెవెన్యూ ఇన్స్పెక్టర్ శిరీష కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పూర్ణహుతితో ముగిసిన విష్ణు శివాలయం బ్రహ్మోత్సవాలు

- అత్యంత వైభవంగా మూడు రోజుల పాటు స్వామి వార్ల కు ప్రత్యేక సేవలు
- అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసుకున్నాం
- ఆలయ కమిటీ చైర్మన్ ఆడెపు ఉమా మహేశ్వరీ



**శామీర్‌పేట్, మే 23 (జనం సాక్షి) :** ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయం బ్రహ్మోత్సవాలు పూర్ణహుతి తో శుక్రవారం ముగిశాయి. మూడు రోజుల పాటు ఆలయంలో బ్రహ్మోత్సవాలు కన్నులపండుగలా సాగాయి.చివరి రోజు సుప్రభాత సేవతో మొదలుకొని వాయిద్య గోష్టి, నిత్య అర్చన, మూలమంత్ర హవనం, సుదర్శన హెూమం, రుద్ర హవనం, బలిహరణం, మహాదాశీర్వచనం, ఋత్విక్ సన్మానం, తీర్థప్రసాదం వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించి 39వ బ్రహ్మోత్సవాలను మహాపూర్ణహుతితో ముగించారు. మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల్లో పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. వేదపండితులు మంత్రోచ్చరణాల మధ్య స్వామివారి ఆశీర్వాచనం చేశారు.అందరి సహ కారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసు కున్నామని ఆలయ కమిటీ చైర్మన్ ఆడెపు ఉమా మహేశ్వరీ అన్నారు.ఈ బ్రహ్మోత్సవాల కార్యక్రమం లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన శ్రీ వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ప్రతి భక్తుడికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించగలిగామని తెలిపారు. ప్రధానంగా బ్రహ్మోత్సవాలకు విజయవంతం అయ్యేందుకు సహకరించిన పారిశుధ్య కార్మికులకు, పోలీస్ సిబ్బందికి,ప్రింట్ అండ్ ఎల క్ట్రానిక్ మీడియా, దాతలకు ఆలయ చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి

- ప్రిన్సిపాల్ కార్యదర్శి ఐఏఎస్ యోగితా రానా



**రాజేంద్రనగర్, మే 23 (జనం సాక్షి) :** విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ కార్యదర్శి ఐఏఎస్ యోగితా రానా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అత్తాపూర్ లోని ప్రైవేట్ పాఠశాలలో శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్ఏఎస్ ప్రకారం లో తెలంగాణ 36వ స్థానంలో ఉన్నా, దాదాపు 60 శాతం పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లోకి వెళ్తున్నారు. రాను రాను మన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని విద్యార్థులలో తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాల్సిన బాధ్యత మన మీద ఉందని అన్నారు.ఉత్తమ విద్యార్థులు క్వాలిఫికేషన్ కలిగిన ఉపాధ్యాయులలు కేవలం ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నారన్న విషయం గ్రామస్తులకు తెలియజేయాలని, విద్యార్థులు చేరిక, నిలకడ నిరంతరం పెరిగేలా ప్రణాళికలు రచించుకోవాలని అకాడమీతో పరస్పర ఒప్పందం ద్వారా ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ విధానంలో బోధనకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి డైరెక్టర్ రమేష్, డిఈఓ సూసిందర్ రావు కోర్సు డైరెక్టర్ శంకర్ రాథోడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మోడల్ హౌస్ పరిశీలన



**పాపన్నపేట, మే 23 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని మెదక్ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాణిక్యం పేర్కొన్నారు.పాపన్నపేట తహసీల్దార్ ప్రక్కన నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈసందర్బంగా పీడీ మాట్లాడారు.47 గజాలు (400 ఫీట్ల)లో ఈఇల్లు నిర్మించబడుతుందన్నారు.పాపన్నపేట లో బేస్ మెంట్ వరకు నిర్మాణం జరిగింది.కాగా త్వరితగతన స్లాబ్ వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు.ఈసందర్బంగా డిప్యూటీ ఇంజనీర్ యాదగిరి ఉన్నారు.

# కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ




**కుత్బుల్లాపూర్, మే 23 (జనం సాక్షి) :** కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోనీ సూరారం సాయిబాబా నగర్ లో గల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి జిహెచ్ఎంసి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది యూపీఏ ప్రభుత్వమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అనుకూలంగా చట్టాలను చేసిన ఏకైక ప్రభుత్వం యూపీఏ ప్రభుత్వమన్నారు. భారతీయ జనతా పార్టీ అన్ని విభాగాలను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి ఐఎన్టీయూసీ అధ్యక్షులుగా ఎన్నికైన చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి మమ్మద్ అహ్మద్, ఓల్డ్ సిటీ ఇంచార్జ్ మీర్జా సౌకర్ బేగ్, కార్వాన్ నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ జావిద్ ఖాన్, లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన కమిటీ పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేయాలి



**కుత్బుల్లాపూర్, మే 23 (జనం సాక్షి) :** నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సిపిఐ పార్టీని నియోజక వర్గంలో మరింత బలోపేతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్ అన్నారు. శుక్రవారం సిపిఐ కుత్బుల్లాపూర్ మండల నాలుగో మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎండి యూసుఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యదర్శిగా ఎన్నికైన స్వామి, కార్యదర్శులుగా ఎన్నికైన హరినాథ్ రావు, కోశాధికారిగా రాములు ఎన్నికైన సభ్యులకు ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం యూసుఫ్ మాట్లాడుతూ రాబోవు రోజులలో పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యల కోసం పని చేస్తే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి రెండు, నిర్మాణం మాత్రం ఐదు

- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



**బోడుప్పల్, మే 23 (జనంసాక్షి) :** టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం,కిందిస్థాయి సిబ్బంది చేతివాటంతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. కొందరు తమ భవనాల నిర్మాణం కోసం మున్సిపాలిటీ నుంచి రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారు.మరికొందరు ఏకంగా మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందకుండానే నిర్మాణాలు చేపట్టడం చూస్తుంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అంటున్నారు స్థానికులు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఎనిమిదవ డివిజన్ పరిదిలోని అమృత కాలనీలో ఇద్దరు వ్యక్తులు 133 గజాల చొప్పున రెండు ప్లాట్లకు వేరువేరుగా మున్సిపాలిటీ నుంచి టీఎస్ బీపాస్ కింద రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని 266 గజాలను కలిపి ఒకే దగ్గర బిల్డింగ్ నిర్మాణం చేస్తూ ఏకంగా 5 అంతస్తులు నిర్మిస్తున్నారు.ఇటీవల పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిదిలో అక్రమంగా సెల్లార్లు,అదనపు అంతస్తుల నిర్మాణాల సంఖ్య పెరిగిపోతుందనీ స్థానికులు వాపోతున్నారు.కార్పొరేషన్ లోని ఎనిమిదవ డివిజన్ భారత్ శ్రీలంక మాదిరిగా పీర్జాదిగూడ మున్సిపాలిటీకి అలాగే ఉండడంతో అధికారుల చూపు ఆ డివిజన్ పై చాల తక్కువ అనే చెప్పవచ్చు.అక్కడ పనిచేస్తున్న వార్డు ఆఫీసర్ నిత్యం పనిలో ఉంటాడు కాబట్టి ఇలాంటి అక్రమ నిర్మాణాలను గుర్తించి సంబంధిత అధికారులకు చెప్పకపోవడం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తుంది.ఇకనైన అక్కడ జరుగుతున్న నిర్మాణాలపై ఉన్నత అధికారులు దృష్టిసారించాలి. వీటివల్ల భవిష్యత్తులో మౌలిక వసతులు కల్పన సైతం మునిసిపాలిటీకి ఇబ్బందికరంగా మారే పరిస్థితులు ఉన్నా సిబ్బంది అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# టీజేఎఫ్ రజతోత్సవాలు జయప్రదం చేయండి

- రాష్ట్ర టియూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్



మల్కాజిగిరి,మే 23(జనంసాక్షి) : ఈనెల 31నటి జె ఎఫ్ నిర్వహించే రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని టియు డబ్ల్యూ జే రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ పునిచ్చారు. శుక్రవారం నేరెడ్ మెట్ చౌరస్తా లోని తేజ ఇన్ఫ్రా డెవలప్మెంట్ కార్యాలయంలో టీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రజితోత్సవ వేడుకల గోడపత్రిక ను జిల్లా బాద్యులు అమర్, మల్కాజిగిరి సర్కిల్ అధ్యక్షులు జార్జ్ విల్సన్, ప్రధాన కార్యదర్శి గిరి గౌడ్,సీనియర్ జర్నలిస్ట్ మురళి యాదవ్ లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందని ముత్తయ్య గౌడ్ తెలిపారు. వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించింది అన్నారు. మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ, సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత జర్నలిస్ట్ ఫోరందని అల్లం నారాయణ అన్నారు. ఉద్యమం చల్లబడ్డప్పు అల్లా టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించి ఉద్యమాన్ని ముందుకు నడిపింది అల్లం నారాయణ గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో విషయాలను సమాజానికి మరోసారి తెలియజెప్పడానికి హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో ఈ నెల 31న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ చేసిన ఉద్యమం మిగతా ఉద్యమాలకు ఒక దిక్సూచి లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమం లో మల్కాజ్గిరి టియుడబ్ల్యూజే నాయకులు వెంకటరమణ నాయుడు, అక్కల రాజేందర్ గౌడ్, దూశెట్టి పాండు గౌడ్, మనోజ్ గౌడ్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# నడిగడ్డలో సాగు, తాగునీరు కొరతను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ రైతాంగ సమితి డిమాండ్



**గద్వాల నడిగడ్డ, మే 23 (జనం సాక్షి) :** నడిగడ్డ లో సాగునీరు, తాగునీరు కొరతను అరికట్టుటకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ సమితి డిమాండ్ చేస్తున్నదాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక నాయకులు ఇక్బాల్ పాషా మాట్లాడుతూ గతంలో గద్వాలలో కృష్ణా జలాల పునర్విభజన కమిటీని ఏర్పాటు చేయాలని ఆనాడు సభలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ జయశంకర్ ,ప్రొఫెసర్ కోదండరాం ,రాఘవాచారి ఆధ్వర్యంలో నడిగడ్డ ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో జూరాల నీరు అందడం లేదనీ, అందుకే నెట్టెంపాడు గట్టు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని దూరదృష్టితో వారు కోరడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ జూరాల నిర్మాణ సామర్థ్యం 11 టీఎంసీలు కానీ జూరాల ప్రారంభం నుండి నేటి వరకు 11 టిఎంసి నీళ్లు నిలిపిన పాపాన పోలేదనీ, అది కేవలం 11 నుండి 9 టి ఎం సి లకు కుదించారనీ, ఆ తర్వాత తొమ్మిది నుండి ఆరు టీఎంసీల వరకు మాత్రమే నీరు నిలువ చేశారనీ, నేడు కేవలం నాలుగు టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండడం వల్ల జూరాల ఆయకట్టు కింద ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదనీ, యాసంగిలో రైతులకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయనీ, జూరాల డ్యాంనేడు కేవలం మిషన్ భగీరథ నీటి సరఫరకు లేదా కుడికాలువ కింద ఉన్న రైతులకు మాత్రమేఅందుతుందనీ, నడిగడ్డకు సరైన నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనీ, అలాగే కర్ణాటక రాష్ట్రంలోని ఆర్డీఎస్ ద్వారా 15.9 టీఎంసీలు రావలసిన నీరు నేడు కేవలం నాలుగు టీఎంసీలు మాత్రమే అందడం వల్ల ఆర్డీఎస్ రైతులు చాలా నష్టపోతున్నారు. ఫలితంగా చివరి ఆరి ఆయకట్టు రైతులు కూలీలుగా వలస జీవులుగా మారవలసిన పరిస్థితి ఏర్పడిందనీ, రైతులు ప్రజలు ప్రజాస్వామ్యవాదులు చివరి ఆయకట్టుకు నీరు అందడానికై పోరాటం చేయుటకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎండి సుభాన్ మాట్లాడుతూ జూరాల మరియు గద్వాల జిల్లాలో ఉన్న రిజర్వాయర్ల ద్వారా కేవలం 12 టిఎంసిల నీరు మాత్రమే రైతులకు అందుతుందనీ, ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క లక్ష 36,000 ఎకరాలకు పారవలసిన నీరు పారడం లేదనీ, దీనికి కారణం జూరాల డ్యాంలో పూడిక వల్ల మూడున్నర టీఎంసీల బురద చేరినట్లు నీటిపారుదల శాఖ వారు తెలిపారనీ, నేడు జూరాల డాం గేట్ల మరమ్మతు చేయకపోవడం వల్ల వరద నీరు వృధాగా కిందికి వెళుతుందనీ, జూరాల డాం గేట్ల మరమ్మత్తు చేయకపోవడం వలన అధికారుల నిర్లక్ష్యం వల్ల రాజకీయ నాయకుల యొక్క దురదృష్టం లేకపోవడం వల్ల ప్రస్తుతం జూరాల కింది రైతులకు వీరి విధానం శాపంగా మారిందనీ,నీటి సామర్థ్యం పెంచాలంటే డ్యామ్ ఎత్తే పెంచాలనీ, కర్ణాటక ప్రాంత భూములు మునుగుతాయనీ,అక్కడ భూసేకరణ సాధ్యం కాదనీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు రాబట్టి మళ్లీ 11 టిఎంసిలు నిలువ చేయుటకు బురద తొలగించుటకుకృషి చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, కె ఎన్ పి ఎస్ నాయకులు చంద్రశేఖర్, తెలంగాణ రైతాంగ సమితి జిల్లా అధ్యక్షులు ఖాజా, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితునికి అండగా నిలిచిన తోటి స్నేహితులు



**వెల్దండ, మే 23 (జనంసాక్షి) :** స్నేహితుల కేవలం సుఖాలలోనే కాదు కష్టాలలో ఉన్న తోడుగా ఉంటామని నిరూపించారు. స్నేహితుడికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచిన తోటి స్నేహితులు వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం ఎక్కి కింద పడడంతో కుడి చేయి నీ పూర్తిగా వైద్యులు తొలగించారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు తమతోపాటు కలిసి చదువుకున్న వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో 2010- 2011 ఎస్ఎస్సి బ్యాచ్ చెందిన కొమ్ము శేఖర్ ప్రమాదవశాత్తు నుండి కింద పడడంతో కుడి చేయి పూర్తిగా తొలగించడంతో ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు మిత్రుడిని కొమ్ము శేఖర్ ను పరామర్శించి తమ ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. స్నేహితులు చేయూత చేసి 20000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో స్నేహితుడికి అండగా ఉంటామన్నారు మిత్రు లందరూ ఈ కార్యక్రమంలో తగుల్ల కొండల్ యాదవ్, సాయిబాబా యాదవ్, చంద్రకాంత్ గౌడ్, సిహెచ్ మహేందర్, పరమేష్ గౌడ్, మల్లేష్, ప్రవీణ్, ధర్మ రాజు, శివ, రాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహ భావాన్ని పెంచుతాయి

- ముగిసిన వంగ అనంతరెడ్డి స్మారక క్రికెట్ పోటీలు
- విన్నర్ ఉరుకొండ పేట, రన్నర్ ఉరుకొండ
- బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**ఉర్కొండ, మే 23 (జనం సాక్షి) :** యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తూ స్నేహభావాన్ని పెంచుతాయని క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి తెలియజేశారు. ఉర్కొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వంగ సంతోష్ రెడ్డి తన తండ్రి కీర్తిశేషులు వంగ అనంతరెడ్డి జ్ఞాపకార్థం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. గత నాలుగు రోజులుగా జరిగిన క్రికెట్ టోర్నమెంటులో మండలంలోని పలు గ్రామాల జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి గెలుచుకున్న ఉరుకొండపేట జట్టుకు వంగ సంతోష్ రెడ్డి సమకూర్చిన 20,116 రూపాయలు, రెండో బహుమతి గెలుచుకున్న ఊరుకొండ జట్టుకు మండల టౌన్ ప్రెసిడెంట్ ఆరిఫ్ సమకూర్చిన 10,116 రూపాయలు నగదు బహుమతితో పాటు షీల్డ్ ను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## భార్యకు సాయంగా వచ్చిన బాలికపై లైంగిక దాడి

- పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** గర్భవతి అయిన భార్యకు సాయంగా ఉండేందుకు వచ్చిన బాలికపై కన్నేశాడో ప్రబుద్ధుడు. ప్రేమిస్తున్నానని ఆమెకు మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా.. ఇంటి నుంచి కూడా తీసుకెళ్లిపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన కార్తీక్ (34) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య గర్భవతిగా ఉన్నప్పుడు సాయం చేసేందుకు బంజారాహిల్స్‌కు చెందిన దూరపు బంధువైన బాలిక (17) వచ్చింది. ఆ సమయంలో ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి బాలికను కార్తీక్ లోబరచుకున్నాడు. గత కొన్ని నెలలుగా బాలికపై పలుమార్లు లైంగికంగా దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం బంజారాహిల్స్‌లోని బాలిక నివాసం నుంచి ఆమెను తీసుకొని వెళ్లాడు. ఈ వ్యవహారంపై బాలిక తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బంధువుల ఇంటికి బాలికను కార్తీక్ తీసుకెళ్లినట్లుగా బంజారాహిల్స్ పోలీసులు గుర్తించి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. బాలిక ఇచ్చిన వాంగ్మూలం మేరకు కార్తీక్ మీద పోక్సో కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# అర్థమయ్యే విధంగా బోధన ఉండాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**పాపన్నపేట, మే 23 (జనంసాక్షి) :** నూతన పరిస్థితులకు తగట్టు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు.శుక్రవారం పాపన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు.పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కటి మెలకువలతో విద్యాబోధన చేసి ప్రతిభావంతులని చేయాలన్నారు. నూతన బోధన పద్ధతులు..వృత్తి పరమైన ఈ శిక్షణ బోధన నైపుణ్యాన్ని స్థిరంగా పెంచేందుకు దోహదపడుతుందని, ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా విద్యాధికారి



రాధాకిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి,రిసోర్స్ పర్సన్స్,తదితరులు ఉన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



**నంగునూర్, మే 23 (జనం సాక్షి) :** నంగునూరు మండల కేంద్రంలో పిఏసిఎస్ నంగునూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సెంటర్ ను శుక్రవారం రోజు ఎమ్మార్వో సరిత , ఆర్ ఐ లింగం సందర్శించి భారీ వర్షం నేపథ్యంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా పిఎసిఎస్ నిర్వాహకులు ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంట వెంటనే మిల్లులకు తరలించాలని, రైతులను ఇబ్బందికి గురి చేయవద్దని , కొనుగోలు అయిన వెంటనే ట్యాబ్ పేమెంట్ పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లింగం, పిఎసిఎస్ నిర్వాహకులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం కావాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 23 (జనం సాక్షి) :** దేశ రక్షణ ప్రథమ కర్తవ్యంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని బిజెపి సీనియర్ నాయకులు నాగురావ్ నామాజీ అన్నారు.మనం సైతం దేశం కోసం సైనికులకు వందనం అనే ప్రత్యేక కార్యక్రమంతో నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం తిరంగా ర్యాలీని నిర్వహించారు.మెయిన్ చౌక్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు జాతీయ జెండాలు చేతబట్టి భారత్ మాతాకీ జై..వందేమాతరం అంటూ పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. పహాల్గం ఉగ్రదాడిని ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ రక్షణ ప్రథమ కర్తవ్యం ఇండియన్ ఆర్మీకి స్వేచ్ఛ హక్కులు కల్పించారని..భారతదేశం వైపు కన్నెత్తి చూడాలంటేనే ఇతర దేశాలకు హడలెత్తించేలా చేశారన్నారు. పహాల్గాం ఉగ్రవాదుల దాడుల్లో అమాయక యాత్రికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికైనా పిఓకే భారత్ కే చెందుతుందన్నారు.జిల్లా బిజెపి అధ్యక్షులు సత్య యాదవ్, రతంగ పాండు రెడ్డి, శ్రీనివాసులు, పి వినోద్, నందు నామాజీ, రఘురామయ్య గౌడ్, సత్య రఘుపాల్, లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్, మిర్చి వెంకటయ్య, డీలర్ అశోక్, చెన్నప్ప యాదవ్, వడ్ల శ్రావణ్ కుమార్, చిన్న రఘు, సులిగెం సురేష్, ఆంజనేయులు (ఆర్మీ) తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం



**ఊర్కొండ, మే 23 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఒక వరమని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అండగా ఉండి, ప్రతి పేదవాడికి వైద్యం అందించడానికి ఎంతో కృషి చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం రోజు ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన దారా బంగారయ్య కు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కృషి వలన మంజూరైన 33000/- రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్లపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుడుముల శ్రీకాంత్ రెడ్డి , మాజీ సర్పంచ్ దార జంగయ్య , దేవాలయ కమిటీ డైరెక్టర్ దార బంగారయ్య నాయకులు రాఘవేందర్ గౌడ్ , ఆంజనేయులు , రమేష్ ,విష్ణు, ప్రశాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు ఉన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని సన్మానించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్



**రాయికోడు, మే 23 (జనం సాక్షి) :** మండల పరిధిలోని నాగ్వార్ గ్రామానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రముఖ న్యాయవాది జి. అంజయ్య గురువారం జహీరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన అంజయ్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి సహకారంతో రాయికోడు మండల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేయాలని ముఖ్యమంత్రి అంజయ్యకు సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు తదితరులున్నారు.

## హైదర్‌గూడలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని మహిళల ధర్నా



**తూప్రాన్, మే 23 (జనం సాక్షి) :** తూప్రాన్ మున్సిపల్ పరిధి 12వ వార్డు హైదర్ గూడ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరుతూ హైదర్గూడా మహిళలు ఆందోళన చేపట్టారు. హైదర్గూడా లో మురికి కాలువలు అధ్వాన్నంగా ఉన్నాయని దీనితో తమకు అనేక రోగాలు వస్తున్నాయి అంటూ ఆందోళన చెందారు. వచ్చే వర్షాకాలం సీజన్లో ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండడానికి హైదర్గూడా గ్రామానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వెంటనే నిర్మించాలని కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో డ్రైనేజి కోసం కొలతలు చేసి నిధులు మంజూరు అయినా మున్సిపల్ అధికారులు డ్రైనేజీ నిర్మించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన చెందారు. హైదర్‌గూడ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మించాలని డిమాండ్ చేస్తూ కాలనీలో ఆందోళన చేశారు.

# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ జిల్లా బ్యూరో, మే 23 (జనం సాక్షి) :** నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపేందుకు టాస్క్ ఫోర్స్ బృందాల షురూ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రజావాణి సమా వేస హాల్ నందు పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఖరీఫ్ సీజన్ నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టాస్క్ ఫోర్స్ జాయింట్ సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ ప్రారంభానికి ముందు క్షేత్రస్థాయిలో టాస్కోఫర్స్ బృందాలను ఏర్పాటు చేసి విత్తన షాపులపై నిరంతర తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలను అడ్డుకట్ట వేసి నాణ్యమైన విత్తనాలతో రైతులకు అందించి సమృద్ధిగా పంటలు పండించుకునేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పోలీస్ వ్యవసాయ శాఖ సమన్వయంగా విత్తన షాపులను తనిఖీ చేసినప్పుడు సర్టిఫికెట్, కంపెనీ లైసెన్స్, విత్తనాల నాణ్యత వీటన్నిటిని నియమ నిబంధనలను పరిశీలించాలన్నారు. ఏ ఒక్కటి సరిగా లేకపోయినా సంబంధిత పోలీస్ యంత్రాంగం వివిధ సెక్షన్ల ద్వారా కేసులు నమోదు చేయాలన్నారు.రైతులు సీజన్ ప్రారంభం అయినప్పుడు నుంచి వరి విత్తనాలు కొనుగోలుకై ఎక్కువ మొగ్గుచూపుతారని ప్రభుత్వం ద్వారా మంజూరైన సబ్సిడీ విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలని రైతులు దళారులను నమ్మి నకిలీ విత్తనాలను కొని మోసపోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్ వ్యవసాయ శాఖల దేనిని వివరించారు. ముఖ్యంగా పత్తి విత్తనాలు నకిలీలు వస్తాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం నకిలీ విత్తనాలను అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ శాఖ ద్వారా సమన్వయంతో పని చేస్తామని అన్నారు. గతంలో నమోదైన కేసుల వివరాలను కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్. నగేష్ జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, పోలీస్ యంత్రాంగం తరపున సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# భక్తులకు సత్వర దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలి

- దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎస్ వెంకటరావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం, (జనంసాక్షి):** దేవాదాయ సిబ్బంది, ఆలయంలో పనిచేసే పోలీసులు, వాలంటీర్లు భక్తులకు సత్వర దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎస్ వెంకటరావు చెప్పారు. శుక్రవారం కాళేశ్వరం దేవస్థానం ఆవరణలో ఆయన సిబ్బందితో మాట్లాడుతూ పుష్కరాల చివరి మూడు రోజులు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రద్దీ నియంత్రణ, సర్వ దర్శనం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రాబోయే మూడు రోజుల్లో ప్రతి రోజు 3 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, రద్దీ రోజులలో మీ విధులు చాలా కీలకమని తెలిపారు. దేవాదాయ, పోలీస్, వాలంటీర్లు భక్తుల రద్దీ ఉన్నపుడు సమన్వయంగా వ్యవహరించి, భక్తులకు సహకరించాలని తెలిపారు. దర్శనం అవగానే భక్తులు త్వరగా బయటకు పంపేలా చూడాలని, ఆగిపోవడం వల్ల రద్దీ పెరుగుతుందని తెలిపారు. భక్తులు దేవాలయంలో వేచి ఉండకుండా సత్వర దర్శనం చేపించి, బయటకు వెళ్లడానికి సౌలభ్యత కల్పించాలని సూచించారు. భక్తుల మధ్య ఎడం ఉండేలా చూడాలని కొద్దిగా ఎడం పాటించడం వల్ల త్వర త్వరగా వెళ్లడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రద్దీ నియంత్రణ చేయకపోవడం వల్ల ఇబ్బందులు వస్తాయని, అలాంటివి రాకుండా చర్యలు తీసుకోవాలని డెమో నిర్వహించారు. భక్తులు క్యూ పాటించుట, దర్శనం తదుపరి భక్తులను బయటికి పంపుట చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి రోజు ఎక్కువ మంది భక్తులు వస్తారని, మన బాధ్యత ఎక్కువ మందికి దర్శనం కల్పించడమేనని అన్నారు. పుష్కరాల్లో విధులు నిర్వహించే అవకాశం మనకు కలిగిందని, భక్తులు తోపు లాట, తొక్కిసలాట లేకుండా సజావుగా దర్శనం అయ్యేలా క్యూ లైన్ మేనేజ్మెంట్ చేయాలని ఆయన కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రసన్న కుమార్, దేవాలయ ఈఓ మహేష్, దేవాలయ సిబ్బంది, పోలీస్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా పరిగణించి కొనుగోలు చేయండి

- వరంగల్ జిల్లా కలెక్టర్ ను ఆదేశించిన సివిల్ సప్లై కమిషనర్..
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభ్యర్థన మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో ఉత్తర్వులు



**నర్సంపేట, మే 23(జనంసాక్షి):** నర్సంపేట నియోజకవర్గంలో గత నాలుగైదు రోజులుగా కురిసిన వర్షానికి 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వినతి మేరకు రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేట డివిజన్లో గత రెండు రోజుల క్రితం కృష్ణ వర్షానికి రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దొంతి విజ్ఞప్తి మేరకు వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తర్వులు జారీ చేయాలని సివిల్ సప్లై కమిషనర్ కు ఆదేశించారు. వరంగల్ జిల్లాతో పాటు నర్సంపేట అన్నదాతల ధాన్యాన్ని, వరంగల్ జిల్లాలో తడిసిన 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కి మంత్రి అధికారిక ఆదేశాలు జారీ చేశారు.

## కలెక్టరేట్‌కు ప్రత్యేక బస్సు సర్వీసు



**నిర్మల్ రూరల్, మే23 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టరేట్‌కు ప్రజలకు, అధికారులకు సౌకర్యంగా ఉండే విధంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభించింది. ప్రతి రోజు ఉదయం10 గంటలకు, సాయంత్రం5 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు ఈ సర్వీసు నడపనున్నట్టు అధికారులు తెలిపారు.కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, మహాలక్ష్మీ గుడి పరిసర ప్రాంత పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,ఇతర ప్రజలకు ఈ సర్వీసు ఉపయుక్తంగా మారనుంది. ఈ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## భక్తుల సేవలో పోలీసులు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం, (జనంసాక్షి):** కాళేశ్వరంలో పోలీసులు భక్తులకు విశేష సేవలు అందిస్తున్నారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా తొమ్మిదో రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శుక్రవారం సరస్వతీ ఘాట్ వద్ద నడవలేని స్థితిలో ఇబ్బంది పడుతున్న వృద్ధురాలును నది తీరం నుంచి ప్లాస్టిక్ కుర్చీ సహాయంతో మోస్తూ పుష్కర ఘాట్ మెట్లు ఎక్కించి శభాష్ అనిపించుకున్నారు పోలీసులు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మే 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతు సంక్షేమంలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి, భీమారం, అర్కపల్లి, అంకుసాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సదానందంతో కలిసి సందర్శించి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియ, ఇందిరమ్మ ఇండ్లు అంశాలను పరిశీలించారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులకు మాత్రమే వర్తింపచేయాలని, అనర్హులకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. పథకం అమలులో అవకతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, వివిధ రకాల ధ్రువపత్రాల జారీ కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు .



## మొక్కలు నాటి పర్యవేక్షించేలా ఎస్‌హెచ్‌జీలకు బాధ్యతలు

- అమృత్‌మిత్ర 2.0 లో భాగంగా నగర పరిధి లో మూడు చెరువుల్లో అమలు

**వరంగల్ ఎంజీఎం, మే 23(జనంసాక్షి):** మొక్కలు నాటి పర్యవేక్షించేలా మహిళా సంఘాలకు(ఎస్‌హెచ్‌జీ) బాధ్యతలు అప్పగించనున్నట్లు వర్దన్న పేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు.శుక్రవారం వర్ధన్నపేట నియోజక వర్గ పరిధి లోని బట్టుపల్లి కోట చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమం లో వర్ధన్నపేట ఎమ్మెల్యే నగర మేయర్ కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా మేయర్ ఎమ్మెల్యే లు మాట్లాడుతూ అమృత్ మిత్ర 2.0 లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నగరంలోని మూడు చెరువులను మొక్కలు నాటి సంరక్షించే విధం గా ఎంపిక చేసిన నేపథ్యం లో "విమెన్ ఫర్ ట్రీస్"(చెట్ల కొరకు మహిళలు)లో భాగం గా చెరువును సందర్శించడం జరిగిందని నగరం లో చిన్న వడ్డేపల్లి చెరువు, రంగ సముద్రం చెరువు,బట్టు పల్లి కోట చెరువు లను ఎంపిక చేశారని ఒక్కో చెరువు పరిధి లో వెయ్యి మొక్కల చొప్పున మొత్తం 3 వేల మొక్కలను స్వయం సహాయక బృంద మహిళలు నాటి సంరక్షించాల్సి ఉంటుందని ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 న మొక్కలను నాటి సంవత్సర కాలం పాటు సంరక్షిస్తారని ఇందుకోసం ఎంపిక చేసిన మూడు ఎస్ హెచ్ జీ బృందాలకు కేంద్ర ప్రభుత్వం నెల వారిగా ఆర్థిక సహకారం అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి, టి ఎం సి రమేష్, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రియాంక, ఎస్ హెచ్ జీ మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, మే23 (జనంసాక్షి) :** జిల్లాలో బాల్యవివాహాలకు పూర్తి స్థాయిలో నియంత్రించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్యవివాహాల నిర్మూలన, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం,మాదక ద్రవ్యాల నిర్మూలన,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం,ఇసుక అక్రమ రవాణా, మున్సిపల్ అంశాలు,రహదారి భద్రత, రైతులకు సకాలంలో ఎరువులు,విత్తనాలు పంపిణి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. గత రెండు సంవత్సరాలలో జిల్లాలో 29 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు.బాల్య వివాహాలు జరుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించినవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తరచూ గ్రామాలను సందర్శిస్తూ మళ్ళీ వివాహం జరపకుండా చూడాలన్నారు. సంబంధిత బాలబాలికలకు మెరుగైన విద్యను అందించాలన్నారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేస్తూ, కేంద్రాలలో పనిచేస్తున్న వారి అర్హత పత్రాలను వైద్య శాఖ అధికారులు సరిచూడాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఆర్ఎంపి లు ప్రథమ చికిత్స తప్ప,ఏ ఇతర చికిత్సలను చేయకుండా నియంత్రించాలని ఆదేశించారు.నిర్మల్ జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి,నాటు సారా ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను గుర్తించి, కేసులు నమోదు చేయాలన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి ప్రమాదాలు నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కేసుల విచారణ వేగవంతంగా ఉండాలన్నారు.నకిలీ వ్యవసాయ విత్తనాల అమ్మకానికి అడ్డుకట్ట వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించాలని, రెవెన్యూ,పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించడానికి సంక్షేమ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని అన్నారు. అనంతరం గంజా,నిషేధిత మత్తుపదార్థాల నిషేధంపై అధికారులతో కలిసి పోస్టర్లను కలెక్టర్,ఎస్పీ లు ఆవిష్కరించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్,రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి, సంక్షేమ, వైద్యారోగ్య,పోలీసు, అబ్కారీ,ఆర్ అండ్ బి, మున్సిపల్,రెవెన్యూ, వ్యవసాయ,విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూటాన్ వేదికపై మెరిసిన ముల్కనూర్ కీర్తి

- ధనశ్రీకి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు
- భరతనాట్యంలో విజయకేతనం



**భీమదేవరపల్లి, మే 23(జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన రామారపు రాజు, సంధ్యారాణి దంపతుల కుమార్తె ధనశ్రీ తన నాట్య ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు కీర్తిపతాకం ఊపింది. ఇటీవల భూటాన్ రాజధాని తింపు నగరంలోని ప్రసిద్ధ బౌద్ధ ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక మహోత్సవంలో ఆమె కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ అద్భుత నాట్య ప్రదర్శనకు గుర్తింపుగా ఆలయ ప్రధాన అర్చకులు ఆమెకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు" ప్రదానం చేశారు. ఈ ఘనత ధనశ్రీ కళా జీవితంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. హనుమకొండ మయూరి నాట్య కళాక్షేత్రంలో కుండే అరుణ రాజ్ కుమార్ సారథ్యంలో శిక్షణ పొందుతున్న ధనశ్రీ, చిన్ననాటి నుంచే నాట్య కళపై ప్రత్యేక అభిరుచి పెంచుకుంది. ఇప్పటివరకు పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి అనేక అవార్డులు అందుకుంది. ధనశ్రీ నృత్య ప్రదర్శన పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## బీఆర్ఎస్, బీజేపీ బంధాన్ని కవిత బయటపెట్టారు

- తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్..




**భీమదేవరపల్లి, మే 23(జనం సాక్షి) :** బీజేపీ కి మీకు ఏం ఒప్పందం అని సొంత కూతురు కవితనే కేసీఆర్ ను అడుగు తుందని ఎద్దేవా చేశారు. పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేస్తూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పీటీసీ ఇతర ఏ ఎన్నికల్లో భీమదేవరపల్లి మండలంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలిని మంత్రి పోన్నం ప్రభాకర్ అన్నారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హజరైన మంత్రి ప్రభాకర్,ఈ సమావేశంలో పాల్గొన్న హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,పీసీసీ పరిశీలకులు మక్సూన్ ,మండల కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు. గ్రామ,మండల,బ్లాక్,అనుబంధ సంఘాలకు దరఖాస్తులు స్వీకరించిన పీసీసీ పరిశీలకులు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ మండల గ్రామ,బ్లాక్ స్థాయి లకు యువత పార్టీని పటిష్ఠము చేయడానికి భీమదేవరపల్లి లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టును నిర్మిస్తుంది... ప్రాజెక్టులు కూలగొట్టదు ఇది కాంగ్రెస్ పార్టీ చరిత్ర కేటీఆర్ వాఖ్యలను తీసుకొని విచారణకు ఆదేశాలని ముఖ్యమంత్రిని కోరుతున్నాను, కేటీఆర్ వాఖ్యలు ఉపసంహరించు కోవాలని అన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎన్నుకోవాలని, ప్రతి కమిటీ నుండి 20 మంది ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిట్టెంపెల్లి ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు జక్కుల అనిల్, కొత్తకొండ దేవస్థానం చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా,మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, పిడిశెట్టి కనకయ్య, చిదురాల స్వరూప, గజ్జల రమేష్, పోగుల శ్రీకాంత్, గజ్జల సురేష్, గుడి కందుల రాజు,బొల్లంపల్లి రాజు, నగరబోయిన నాగరాజు, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అప్పు అడిగినందుకే హత్య

- కేసును చేదించిన గూడూరు పోలీసులు



**మహబూబాబాద్ ప్రతినిధి మే 23 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పంతుల్యా తండా గుండెంగ గ్రామానికి చెందిన తేజవత్ నీలా తన భర్త కనిపించడం లేదని బుధవారం గూడూరు పోలీస్ స్టేషన్లో పిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు తో పాటు కొంతమంది అనుమానితుల మీద కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గూడూరు పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి గూడూరు సీఐ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గురువారం గూడూరు పోలీస్ స్టేషన్ లో తేజావత్ వీరేందర్ తండ్రి అమ్మ వచ్చి తేజావత్ బద్రు అనే వ్యక్తిని చంపింది మేమే అని నేరాన్ని ఒప్పుకొని పోలీస్ స్టేషన్లో గూడూరు సిఐ ముందు లొంగిపోవడం జరిగింది అతని ఒప్పుకోలు పై నేర విచారణ జరిపి మృతదేహాన్ని చంపి పడేసిన బావి నుండి బయటికి తీసి పంచినామా నిర్వహించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పజేయడం జరిగిందని నిందితుడు వీరేందర్ తన అవసర నిమిత్తం మృతుడు బద్రు వద్ద యాభై వేల రూపాయలు అప్పు ఉండడంతో ఆ డబ్బులు ఇవ్వమని వీరేందర్ ను పదేపదే అడగడమే కాకుండా తన చెల్లి పెళ్లి కోసం అమ్ముకున్న భూమిలో ఒక గుంటన్నర దున్నుకొని చెల్లి పెళ్లికి అడ్డుపడుతున్నాడనే ఉద్దేశంతో బద్రుపై పగ పెంచుకొని తన మిత్రుడు తేజావత్ సురేష్ తో చెప్పగా సురేష్ కూడా గతంలో తన భూమి విషయంలో తనకు బద్రు తీవ్రంగా ఇబ్బంది పెట్టినారని వారిద్దరూ కలిసి బద్రును చంపాలని పథకం పన్నినారని సురేష్ పథకం ప్రకారం తేజావత్ కిషన్ మరియు బాదావత్ ఈర్యతో కలిసి ఈనెల ఇరవై తారీకు మంగళవారం సాయంత్రం ఎనిమిది గంటల సమయంలో గుండెంగా గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ కల్వర్టు మీద కిషన్ ఈర్యలు కలిసి మందు పార్టీ చేసుకుందామని బద్రును పిలిచి మద్యం తాగించి వారు అనుకున్న పథకం ప్రకారం తేజావత్ కిషన్ సురేష్ కి ఇదే మంచి సమయం ఇప్పుడే చంపుదామని సురేష్ వీరేందర్ కు చెప్పి ఇప్పుడు అంత రెడీగా ఉంది నువ్వు వెళ్లి పని ముగించుకుని రా మిగతాదంతా నేను కిషన్ చూసుకుంటామని చెప్పగా వీరేందర్ కెనాల్ పై కూర్చొని మద్యం తాగుతున్న బద్రుని వెనక నుండి తాను తెచ్చుకున్న టవల్ తో మెడ చుట్టూ గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి వెంటనే కిషన్ కాళ్లు చేతులు పట్టుకుని ఉండగా ఈర్య అటు ఇటు ఎవరూ రాకుండా చూస్తూ బద్రుని చంపడం జరిగింది కిషన్ వీరేందర్ ఇద్దరు కలిసి నక్కలగుట్ట బోడు పక్కలగల నిరుపయోగంగా ఉన్న బావిలో పడేసి వారి ద్విచక్ర వాహనాన్ని టెంపుల్ దగ్గర వేరే బావిలో పడేసి వెళ్లిపోవడం జరిగిందని తెలిపారు నిందితులను గూడూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు ఈ కేసు విషయంలో స్థానిక ఎస్సైలు గిరిదర్ రెడ్డి ట్రైన్ ఎస్సై కోటేశ్వరరావు కొత్తగూడ ఎస్సై కుశాల్ కుమార్ లతో కలిసి కేసును చేదించినట్లు గూడూరు సిఐ సూర్యప్రకాష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బిచ్చ నాయక్ హెడ్ కానిస్టేబుల్ ఎర్రయ్య కానిస్టేబుల్స్ అమ్మనాయక్ ప్రణీత్ రాజేష్ సుమంత్ కుమార్ సుమలత పాల్గొన్నారు.


## వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయండి

- మున్సిపల్ కమిషనర్లు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

**వరంగల్ ఎంజీఎం, మే 23(జనంసాక్షి):** వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని సిడిఎంఏ డా. టి కే శ్రీదేవి అన్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్త మున్సిపల్ కమిషనర్లు అధికారులతో వంద రోజుల ప్రణాళిక అమలు తీరుపై హైదరాబాదు నుండి ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ లో సిడిఎంఏ పాల్గొని సమర్థవంతంగా అమలు పరచుటకు తన సూచనలు చేశారు.నగరం తరపు నుండి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి డి ఎంఏ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అమలు చేయ నున్న వంద రకాల సేవలు ప్రజలకు చేరువ చేయ డానికి మున్సిపల్ కార్పొరేషన్లలో ఎవరినైనా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లయితే వారితో సూచించిన కార్యక్రమాలపై విస్తృత ప్రచారాన్ని కల్పించాలని, స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా తడి పొడి చెత్తను వేరుగా అందించేలా చూడడం అమృత్ మిత్ర పథకంలో భాగంగా మెప్మా సిబ్బంది పార్కు లతో, జంక్షన్ ను గుర్తించడం భువన్ ద్వారా నమోదు చేసిన ప్రాపర్టీస్ ను తనిఖీ చేయడం ఎకో ఫ్రెండ్లీ సేవలు అందించడం వాల్ పెయింటింగ్స్ సౌండ్ స్పీక ర్లు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభు త్వ పథకా లకు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

## భూపాలపల్లిలో దొంగల హల్‌చల్..

- తాళం వేసి ఉన్న ఇండ్లనే టార్గెట్ చేసిన కేటుగాళ్లు..
- రెండు ఇండ్లలో చోరీ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాలతో దోపిడీ దొంగలు హల్ చల్ చేస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇండ్లనే టార్గెట్ చేస్తూ, పోలీసులకే సవాళ్లు విసురుతున్నారు కేటుగాళ్లు. జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్, ఎస్పీ నివాసాలు ఉండే ప్రాంతం వెనుక ఉన్న సింగరేణి ఎంసి క్వాటర్స్ లో శుక్రవారం రెండు ఇండ్లలో తాళాలు పగలగొట్టి విలువైన ఆభరణాలు, వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు చేరుకుని దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించి, దర్యాప్తు ప్రారంభించారు. గతంలోనూ స్థానికంగా అనేక దొంగతనాలు జరిగాయి. వారం వ్యవధిలో జిల్లా కేంద్రంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలను బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసిన దోపిడీ దొంగలు స్థానిక ప్రజలకు వణుకు పుట్టిస్తూ పోలీసులకు సవాల్ గా మారారు.

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 24 మే 2025

# టీఎస్‌సీఎస్ ఫెర్నాండెజ్ హాస్పిటల్ కీలక ఒప్పందం

● తలసేమియా/సికిల్ సెల్ క్యారియర్ స్థితిని గుర్తించేందుకు ప్రినేటల్ నిర్ధారణలో ముందడుగు

**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని తలసేమియా %డ% సికిల్ సెల్ సొసైటీకి చెందిన కమలా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధుల నివారణకు ముందడుగు వేసింది. తలసేమియా లేదా సికిల్ సెల్ క్యారియర్‌లుగా గుర్తించబడిన దంపతులకు ప్రినేటల్ దయాగ్నోసిస్ పరీక్షలను ప్రారంభించింది. ఈ ముందడుగు సమాజంలో తలసేమియా మేజర్ మరియు సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న పిల్లల జననాన్ని తగ్గించే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర నివారణ కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ కార్యక్రమం ద్వారా జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధుల నివారణకు పునాది పడుతుంది.

"నివారణ చికిత్స కంటే ఉత్తమం" అనే గొప్ప తత్వంతో, తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ తమ లక్ష్య సాధనలో కీలక ముందడుగు వేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన "ప్రినేటల్ దయాగ్నోస్టిక్ సెంటర్" మరియు సెంటర్ ఫర్ ఫింగర్ ప్రింటింగ్ అండ్ దయాగ్నోస్టిక్స్ కలిసి పనిచేయడం ద్వారా, 2035 నాటికి



తలసేమియా లేని జననాలను సాధించడమే అంతిమ లక్ష్యం. ఈ సదుపాయాలు, తలసేమియా నివారణకు శాస్త్రీయంగా మరింత పటిష్టమైన పునాది వేస్తాయి. చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్ మరియు సెక్రటరీ డాక్టర్ సుమన్ జైన్ మద్దతుతో, వైద్య అధికారి డాక్టర్ కె. సరోజ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ జి. పద్మ ఈ చొరవను చేపడుతున్నారు. తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ తన నిరంతర యాంటీనాటల్ స్క్రీనింగ్ కార్యక్రమం ద్వారా గర్భం దాల్చిన తొలినాళ్లలోనే క్యారియర్ దంపతులను గుర్తిస్తుంది. ఒకవేళ తల్లిదండ్రులు ఇద్దరూ క్యారియర్‌లుగా ఉన్నట్లయితే, ప్రతి గర్భధారణలో పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి వచ్చే అవకాశం 25% ఉంటుంది. అలాంటి సందర్భాలలో, హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ ఫౌండేషన్‌తో కలిసి గర్భం దాల్చిన మొదటి త్రైమాసికంలో ప్రినేటల్ దయాగ్నోస్టిక్ టెస్టింగ్ (గర్భంలో ఉండగానే వ్యాధి నిర్ధారణ పరీక్ష) సదుపాయాన్ని అందిస్తుంది."ప్రతి కుటుంబానికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య సంరక్షణ, సేవలను అందించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని ఆమె స్పష్టం చేశారు. "తలసేమియా మరియు సికిల్ సెల్ వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి మేము చేస్తున్న ప్రయత్నంలో ఈ దయాగ్నోస్టిక్ కేంద్రం ఒక మైలురాయి" అని టీఎస్‌సీఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ అన్నారు. "సైన్స్ మరియు సామాజిక నిబద్ధతను ఏకం చేయడం ద్వారా, తలసేమియా రహిత తరాన్ని సాధించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. ఫెర్నాండెజ్ హాస్పిటల్... తలసేమియా మరియు సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న వారందరికీ అండగా నిలుస్తుంది. వారి ధైర్యాన్ని గౌరవిస్తూ, మెరుగైన సంరక్షణ కోసం కృషి చేస్తూ, వ్యాధి నివారణకు సంబంధించిన పరిశోధనలకు మద్దతు ఇస్తుంది.

## మంత్రి శ్రీధర్ బాబు చొరవతో ఓసిపి-2కు తారు రోడ్డు

● కోటి 70 లక్షలు మంజూరు



**మంథని, మే 23 (జనంసాక్షి) :** బురద రోడ్డుతో కొన్ని సంవత్సరాల నుండి ఆర్ జి త్రీ పరిధిలోని ఓసిపి-2 తారు రోడ్డు నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవతో కోటి 70 లక్షలు మంజూరు అయ్యాయి. బురద రోడ్డుతో ఓసిపి టు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని మేనేజర్, జనరల్ మేనేజర్ నుండి మొదలుకొని సీ అండ్ ఎండి వరకు ఓసిపి 2 రోడ్డు కొరకు ఆర్ జి త్రీ ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి వినతి పత్రాలు అందజేశారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ద్వారా సింగరేణి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో మంత్రి శ్రీధర్ బాబు చొరవతో తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పాటు టెండర్ ప్రక్రియ సైతం పూర్తయిందని రవీందర్ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నిధులతో పెద్దపల్లి - మంథని పిడబ్ల్యుడి రోడ్డు నుండి మైసమ్మ టెంపుల్ వరకు, మేనేజర్ ఆఫీస్ నుండి సైట్ ఆఫీస్ వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మస్టర్ పడడానికి మాన్వే కి వెళ్లాలంటే సింగరేణి కార్మికులు చాలా ఇబ్బంది పడేవారు ఉద్యోగుల కార్లు, బైకులు బురదతో పాడైపోయేవి ఇక నుండి అలాంటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఈ తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు కి, సహకరించిన ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, నర్సింహా రెడ్డి లకు కోట రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉపనయనం కార్యక్రమంలో పాల్గొన్న బీసీ జాతీయ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి



**వెల్దండ, మే 23 (జనంసాక్షి) :** గుండాల గ్రామంలో రావిచెడు సురేష్ శర్మ కుమారుడు యొక్క ఉపనయనం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అంతేకాకుండా శేఖర్ రెడ్డి, జంగయ్య యాదవ్, మోహన్ రెడ్డి , గుండాల గ్రామ బూత్ అధ్యక్షులు బుజరాజు మల్లేష్, మరియు రామకృష్ణ, శ్రీను మాధవులు ,సాయిలు, సురేష్, ఆంజనేయులు, వీరేష్ శర్మ ,శివశర్మ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**భూదాన్ పోచంపల్లి, మే 23 (జనం సాక్షి) :** రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం రోజున భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలో జూలూరు, ముక్తాపూర్, జిబ్లక్ పల్లి, దంతూర్, శివారెడ్డి గూడెం గ్రామాలలోని పిఏసిఎస్, ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. లారీల కొరత లేకుండా మిల్లులకు తరలించిన ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేసి కొనుగోలు కేంద్రాలకు లారీలను వెంటనే తరలించాలని మిల్లుల యాజమాన్యులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ అకాల వర్షాల సూచన ఉన్నందున సంబంధిత అధికారులందరూ కొనుగోలు కేంద్రాలలోనే ఉంటూ ధాన్యం కొనుగోలు మరింత వెంగవంతం చేస్తున్నారని అన్నారు. హమాలీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేయాలన్నారు. రైతులు ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని కష్టపడి పండించిన ధాన్యానికి చివరి గింజ వరకు మద్దతు ధర అందిస్తామని రైతులకు భరోసానిచ్చారు. కొనుగోలు కేంద్రాలలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ , జూలూరు పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జాలి మిషన్ పనిచేయకపోవడం వలన కలెక్టర్ సంబంధిత అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సాయంత్రం వరకు జాలి మిషన్ పని చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు . ధాన్యం తేమశాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని కాంటా వేసి వెంటనే లోడింగ్ చేసి తక్షణమే మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తి అయిన కేంద్రాలలో ఉన్న హమాలీలను అత్యధికంగా ధాన్యం పండించిన కొనుగోలు సెంటర్లలో ఏర్పాటు చేసి తక్షణమే ధాన్యాన్ని తరలించాలన్నారు. రైతులకు ఎక్కడ కూడా ఇబ్బంది రానివ్వద్దని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అకాల వర్షాలు ఉన్నందున్న ధాన్యం తడవకుండా సరిపడ టార్పాలిన్లు కేంద్రాలలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంబంధిత అధికారులందరూ నిమగ్నమై కొనుగోలు కేంద్రాల్లో, మిల్లుల వద్ద, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేస్తున్నారన్నారు.



లారీలు కొరత లేకుండా లారీల సంఖ్య పెంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువ కాంటాలు ఏర్పాటు చేసి ధాన్యం తడవకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా రైతుల ఖాతాల్లో 48 గంటల్లోనే డబ్బులు జమ అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం సివిల్ సప్లై హరికృష్ణ, ఇన్చార్జి డిఎస్ఓ రోజా రాణి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్.ఐ వెంకట్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## 30 రోజులలోగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి

**గంభీరావుపేట, మే 23 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు 30 రోజులు లోగా ప్రారంభించీ వచ్చే దసరా దీపావళి పండుగలు నూతన గృహములలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. బుధవారం కలెక్టర్ గంభీరావుపేట మండలం లో రెండో విడత క్రింద 507 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు దత్తసాయి ఫంక్షన్ హాల్లో కేకే మహేందర్ రెడ్డి తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, గంభీరావుపేట మండలంలో రెండో విడత కింద 507 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని,400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2లక్షల రూపాయలు,ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ



అవుతాయని కలెక్టర్ తెలిపారు.

### పైరవీలు అవసరం లేదు

ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయవలసిందిగా స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని తెలిపారు. మండలంలో ఉన్న గ్రామాలకు ఇసుక రీచ్ లను అలాట్ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ సెక్రెటరీ నుండి తాసిల్దారి గారికి సమాచారం అందిస్తే వారే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారని, ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా విడుదల ఎంపిక చేస్తామని తెలిపారు. 30 రోజుల లోగా నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించాలని లేని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ సొంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి హన్మంతు, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ విజయ, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో రాజేందర్, తాసిల్దార్ మారుతి రెడ్డి , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో వైద్య రంగంలో ప్రక్షాళన జరగాలి



**సూర్యాపేట ప్రతినిధి, మే 23 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో వైద్య రంగంలో ప్రక్షాళన జరగాలని, నకిలీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సూర్యాపేట వైద్య రంగానికి ఏ రోగం వచ్చింది అనే అంశంపై జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు,ఐఎంఏ సభ్యులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు,ప్రజా సంఘాలు పాల్గొని మాట్లాడారు.ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్ లో తనిఖీలు నిర్వహించడంతో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయని అన్నారు.అర్హతలు, అనుమతులు లేని డాక్టర్లతో నిర్వహిస్తున్న ఆస్పత్రులను, స్కానింగ్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీజ్ చేయడం ప్రజల చైతన్యం ఫలితమేనని అభిప్రాయపడ్డారు.ఇప్పటి వరకు అనుమతులు లేకుండా,రిజిస్ట్రేషన్ లేకుండా పలు ఆస్పత్రులను ధనార్జనయే ధ్యేయంగా నిర్వహిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడారని,ఇక వారి ఆటలు సాగవని తెలిపారు. జర్నలిస్టులు,ప్రజా సంఘాలు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, ఐఎంఏ పోరాటం, నకిలీల ఉదంతం బాగోతాలను బహిర్గతం కావడం, బదిలీ వేటు పడటం హర్షణీయమని చెప్పారు.పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహిస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పేద ప్రజలకు అన్యాయం జరగకుండా ప్రజా చైతన్యం దిశగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇదే విధానాన్ని కొనసాగించాలని పలువురు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక సూర్యాపేట ప్రతినిధులు కుంట్ల ధర్మార్జున్,తండు నాగరాజు, గట్ల రమాశంకర్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రాజీవ్, ఐఎంఏ అధ్యక్షులు ఆనంద్ దాండ్గే, కార్యదర్శి రమేష్ నాయక్, సీనియర్ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, డాక్టర్ శిరీష, జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఐతబోయిన రాంబాబు,బంటు కృష్ణ, రాపర్తి మహేష్, తల్లాడచందన్, ఉయ్యాల నరసయ్య, మల్లికార్జున్, దుర్గం బాలు, తండు వెంకటేష్ గౌడ్, రెడ్డి బిక్షం రూథర్, మామిడి శంకర్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్, సూర్యాపేట పూర్వ మిత్ర మండలి అధ్యక్షులు బయ్య మల్లికార్జున్, సిపిఎం న్యూడెమోక్రసీ జిల్లా అధ్యక్షులు మండారి డేవిడ్ కుమార్, డిటిఎఫ్ జిల్లా నాయకులు రేపాక లింగయ్య, ప్రజా సంఘాల నాయకులు నవిలే ఉపేందర్, ముద్ద బిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి

● ఫైర్ శాఖ డి.జి నాగిరెడ్డి

**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వార్ హాల్ అగ్ని ప్రమాదాల నివారణకు ఆయా శాఖలు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి




కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్, టౌన్ ప్లానింగ్, హైడ్రా, ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో పురాతన భవనాల లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు శాఖాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై నాగిరెడ్డి వివరణ కోరారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ... శిథిలావస్థలో భవనాలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ... ఫైర్ యాక్సిడెంట్ జరిగిన సందర్భంలో ఫైర్, పోలీస్ శాఖ మాత్రమే సమాచారం వెళుతున్నదని, అట్టి సమాచారం రెవెన్యూ సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాలని జిల్లా యంత్రాంగం తరపున అంబులెన్స్, ఆసుపత్రిలో చికిత్స అందించడం బెడ్స్ ,, డాక్టర్లను సిద్ధం చేయడం లాంటి చర్యలు సకాలంలో తీసుకునే వెసులుబాటు ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తప్పని సరిగా స్మోక్ డిటెక్టర్ తో పాటు అల్లారం కూడా ఉండాలని ఇది నగర వాసులు గమనించాలని కోరారు.

## బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాలను సాధించాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మే 23 (జనంసాక్షి) :** బ్యాంకర్లు వారికి ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.కలెక్టరేట్ లో డిసిసి, డీఎల్ఆర్సీ బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చింతల బాపూజీ కన్వీనర్ గా వ్యవహరించారు.ఈ సందర్భంగా 4వ త్రైమాసికంలో సాధించిన లక్ష్యాలను వివరించారు.వ్యవసాయ రుణాలలో గడిచిన 2024-25 సంవత్సరంలో బ్యాంకుల లక్ష్యం రూ.2242.48 కోట్లు కాగా రూ.4305.51 కోట్లు లక్ష్యం చేరుకున్నామని, శాతం పరంగా 146.32 వృద్ధి సాధించామని అన్నారు. మొత్తం వ్యవసాయ రుణాలలో గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో బ్యాంక్ వార్షిక బడ్జెట్ రూ.5625.92 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే రూ.6693.16 కోట్లు లక్ష్యాన్ని చేదించామని, శాతం పరంగా 118.97 వృద్ధి సాధించామని తెలిపారు.దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలలో గడచిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు వార్షిక బడ్జెట్ రూ.2683.44 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే రూ.2387.65 కోట్లు లక్ష్యాన్ని సాధించామని, శాతం పరంగా 88.97 వృద్ధి సాధించామని అన్నారు.ప్రాధాన్యత రంగాలలో గడిచిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.7570.66 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే,రూ.7955.47 కోట్లు లక్ష్యాన్ని సాధించామని, శాతం పరంగా 105.08 వృద్ధి సాధించామని పేర్కొన్నారు. గడిచిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వార్షిక ప్రణాళిక బడ్జెట్




రూ.8994.16 కోట్లు బ్యాంకు లక్ష్యంగా కాగా రూ.10425.41 కోట్లు లక్ష్యాన్ని సాధించామని, శాతం పరంగా 115.91 వృద్ధి సాధించామని అన్నారు. పిఎం రుణాలలో బ్యాంక్ వారికి 21354 అప్లికేషన్లు వచ్చాయని, వీటిలో 19389 అప్లికేషనులకు రుణాలు మంజూరు చేశామని తెలిపారు.అనంతరం 2025-26 వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్బీఐ ఏజీఎం గోమతి, నాబార్డ్ డిడిఎం రవీంద్ర నాయక్, ఎస్బీఐ ఏజిఎం అనిల్ కుమార్, వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా అనుబంధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు

**సూర్యాపేట ప్రతినిధి, మే 23 (జనంసాక్షి) :** నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దని జిల్లా ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు.వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులు సిద్ధమవుతున్నారని, అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలని, సంబంధిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా జరగకుండా చూడాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నిర్మూలనకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఆరుగాలం కష్టపడే రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై ఉందన్నారు. విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని అన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని, పిడీ యాక్ట్ తప్పదని, షీట్స్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా ఆంధ్రా ప్రాంతానికి ముఖ్య సరిహద్దుగా ఉందని, నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు తనిఖీలు, రైతులకు, డీలర్స్ కు అవగాహన కల్పించాలని అన్నారు.సరిహద్దులలో పటిష్టమైన నిఘాతో నకిలీ విత్తనాలు నివారించాలని పేర్కొన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలని, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు.రైతులు అత్యంత అప్రమత్తంగా




ఉండాలని, నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలని అన్నారు. లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిదని అన్నారు.ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.




# లాభపడిన సెన్సెక్స్

## 769 పాయింట్లు లాభపడ్డ సూచీలు •24,800 ఎగువకు నిఫ్టీ



**జనంసాక్షి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. నిన్న భారీ నష్టాలు చవిచూసిన మార్కెట్ సూచీలు.. నేడు అదే స్థాయిలో మళ్లీ పుంజుకున్నాయి.అమెరికా బాండ్ల రాబడులు కొంత మేర తగ్గుముఖం పట్టడం సూచీలకు కలిసొచ్చింది. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్, బ్యాంకిం గ్ స్టాక్స్ రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 సూచీలు సైతం మోస్తరుగా లాభప డ్డాయి. ఈక్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 900 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 24,800 ఎగువన కు ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 80,897.00 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,951.99) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ.. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,905.17 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 769.09 పాయింట్ల లాభంతో 81,721.08 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 243.45 పాయింట్ల లాభంతో 24,853.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 72 పైసలు బలపడి 85.23గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా మినహా మిగిలిన స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,327 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## ఈశాన్య రాష్ట్రాల్లో వేదాంత గ్రూప్

# భారీ పెట్టుబడి

**జనంసాక్షి:**'వేదాంత గ్రూప్' ఈశాన్య రాష్ట్రాల్లో గ్యాస్, ఖనిజాలు, చమురు శుద్ధి సౌకర్యాలు, విద్యుత్, ఆప్టికల్ ఫైబర్, సిస్టం ఇంటిగ్రేషన్, పునరుత్పాదక ఇంధనం, ప్రసార రంగాలు, డేటా సెంటర్లలో రూ.30,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఈ రోజు(శుక్రవారం) ప్రకటించింది. ఈ పెట్టుబడితో వేదాంత గ్రూప్..అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, త్రిపుర, మేఘాలయ, మిజోరాం అంతటా విస్తరించిబీ చమురు, గ్యాస్, కీలకమైన ఖనిజాలు, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలపై దృష్టి సారిస్తుంది. ఈ పెట్టుబడుల వల్ల ఆయా ప్రాంతాల్లో 1 లక్ష ఉద్యోగాల కల్పనతో పాటు ఆర్థిక వృద్ధి జరుగుతుందని, సామాజిక పరిస్థితులు కూడా మెరుగుపడతాయని సంస్థ తెలిపింది. ఈశాన్య ప్రాంతంలో హైడ్రోకార్బన్లకు సంబంధించి..వేదాంత అతిపెద్ద అన్వేషణ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది.చమురు, గ్యాస్ నుంచి కీలకమైన ఖనిజాల వరకు అత్యంత అద్భుతమైన సహజ వనరులు, ప్రతిభావంతులైన మానవ వనరుల అసాధారణమైన సమూహాన్ని కలిగి ఉన్న ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి సంస్థ పూర్తిగా కట్టుబడి ఉందని వేదాంత గ్రూప్ చైర్మన్ 'అనిల్ అగర్వాల్' అన్నారు. వేదాంత, దాని అనుబంధ సంస్థలు అస్సాం నుంచి మేఘాలయకు 1,000 మెగావాట్ల విద్యుత్తును సరఫరా చేయడానికి అనుమతించే 300 సర్క్యూట్ కే.ఎం. ట్రాన్స్మిషన్ సిస్టం నెట్‌వర్క్‌లో కూడా పెట్టుబడులు పెట్టాయి. ఈ ప్రాజెక్ట్ మేఘాలయ, అస్సాంలో విద్యుత్ సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరుస్తుంది.

## జియోగేమ్ క్లౌడ్ యాక్సెస్‌తో 5 గేమింగ్ ప్రీపెయిడ్ ప్లాన్లు

**జనంసాక్షి:**ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో గేమింగ్ సెంట్రిక్ రీఛార్జి ప్లాన్లను కొత్తగా తీసుకొచ్చింది. ప్రీ పెయిడ్ సబ్‌స్క్రైబర్ల కోసం 5 కొత్త ప్లాన్లను పరిచయం చేసింది.వీటి సాయంతో ఉచితంగా జియోగేమ్ క్లౌడ్ యాక్సెస్ చేయొచ్చు. ఇది రిలయన్స్ జియో క్లౌడ్ గేమింగ్ సర్వీస్. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా గేమర్స్ అధిక-నాణ్యత గేమ్స్‌ను డౌన్‌లోడ్ చేయకుండా నేరుగా ఆడొచ్చు. పీసీ, జియో ఎస్‌టీబీ, స్మార్ట్‌ఫోన్‌లలో ప్రీమియం గేమ్‌లు ఆడుకోవచ్చు. రూ.48 ప్లాన్: 10 ఎంబీ హై-స్పీడ్ ఇంటర్నెట్ డేటా లభిస్తుంది. ఈ ప్లాన్ వ్యాలిడిటీ 3 రోజులు. మూడు రోజుల పాటూ జియోగేమ్ క్లౌడ్ కాంప్లిమెంటరీ సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది.రూ.98 ప్లాన్: 10ఎంబీ హై-స్పీడ్ ఇంటర్నెట్ డేటాతో తీసుకొచ్చిన మరో ప్లాన్ ఇది. 7 రోజుల వ్యాలిడిటీ.వారం రోజుల పాటూ జియోగేమ్ క్లౌడ్ కాంప్లిమెంటరీ సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది.రూ.298 ప్లాన్: ఎక్కువ కాలం పాటు జియోగేమ్ క్లౌడ్ కాంప్లిమెంటరీ సబ్‌స్క్రిప్షన్ కావాలనుకొనే వారి కోసం ఈ ప్లాన్ ఉపయోగపడుఉతంది. 3జీబీ డేటా, 28 రోజుల వ్యాలిడిటీతో తీసుకొచ్చారు. అయితే ఇవి కేవలం గేమిండ్ యాడ్ ఆన్ ప్లాన్లు మాత్రమే. అంటే వాయిస్ కాల్స్ లేదా ఎస్సెమ్మెస్ వంటి ప్రయోజనాలు ఉండవు. రూ.495 ప్లాన్: 28 రోజుల వ్యాలిడితో వచ్చిన మరో ప్లాన్ ఇది. దీని రీఛార్జితో రోజుకు 1.5జీబీ ం 5జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. 28 రోజుల పాటూ జియోగేమ్స్ క్లౌడ్ సదుపాయం, జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, 28 రోజుల పాటు ఫ్యాన్ కోడ్ సబ్‌స్క్రిప్షన్, జియో టీవీ, జియోఏఐ క్లౌడ్ వంటి అదనపు ప్రయోజనాలు అందిస్తోంది.రూ.545 ప్లాన్: 28 రోజుల వ్యాలిడిటీతో జియో గేమింగ్ ప్లాన్ తీసుకొచ్చారు. రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. అదనంగా 5జీబీ డేటా ఇస్తున్నారు. జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, 28 రోజుల ఫ్యాన్‌కోడ్, జియో క్లౌడ్, జియోటీవీ, జియో ఏఐక్లౌడ్ సేవలు పొందొచ్చు.



## కియా కరెన్స్ క్లావిస్ విడుదల..

ధర రూ.11.50 లక్షల నుంచి ప్రారంభం

**జనంసాక్షి:**దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్.. కరెన్స్ క్లావిస్‌ను శుక్రవారం విడుదల చేసింది.దీని ప్రారంభ ధరను రూ.11.50 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. అధునాతన ఫీచర్లు, కొత్త హంగులు, మెరుగైన భద్రతా ఫీచర్లను జోడించింది. కంపెనీ అధికారిక వెబ్‌సైట్, డీలర్‌షిప్‌ల వద్ద మే 9 నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. కియా కరెన్స్ క్లావిస్ మూడు రకాల ఇంజిన్ ఆప్షన్లతో వస్తోంది. 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్ 113 హెచ్‌పీ పవర్‌ను, 143.8 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 157 హెచ్‌పీ పవర్‌ను, 253 ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తుంది. 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ 113 హెచ్‌పీ పవర్‌ను 250 ఎన్ఎం టార్క్‌ను ఇస్తుంది.ఎక్స్‌టీరియర్ పరంగా చూస్తే కియా కరెన్స్ క్లావిస్ పూర్తి కొత్త డిజైన్‌తో వస్తోంది. ముందు వైపు పాడ్ ఎల్ఈడీ హెడ్‌లైట్స్, వీ షేప్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్, బ్లాక్డ్ ఆఫ్ గ్రిల్‌తో డిజైన్ చేశారు. పనోరమిక్ సన్‌రూఫ్, స్పోర్టీ 17 అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో మరింత ఆకట్టుకునే లుక్‌తో దీన్ని తీసుకొచ్చారు. క్రోమ్ డోర్ హ్యాండిల్స్, సిల్వర్ రూఫ్ రెయిల్స్‌తో వస్తోంది. వెనకభాగంలో కరెన్స్‌ను ఫాలో అయినప్పటికీ.. ఎల్ఈడీ లైట్ స్ట్రిప్‌కు ఫ్రెష్ లుక్ ఇచ్చారు.ఇక ఇంటీరియర్ విషయా నికొస్తే.. క్లావిస్‌లో సెల్టోస్ తరహాలో 22.62 అంగుళాల డ్యూయల్ స్క్రీన్ సెటప్ ఉంది. 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్, 10.25 అంగుళాల టచ్ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే ఉన్నాయి. వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, రీడిజైన్డ్ ఏసీ వెంట్స్, ఆటో కంట్రోల్స్, ఫోర్-వే పవర్ అడ్జస్టబుల్ సీట్లు, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లే, 8 స్పీకర్ బోస్ సౌండ్ సిస్టమ్ ఇందులో ఉన్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.00 | ₹ 5.02 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 89,400 (22 క్యారెట్లు) | ₹ 97,530 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,11,000



## రూ.8 వేల్లోపు లావా నుంచి 5జీ ఫోన్..


ఫీచర్లు ఇవే

**జనంసాక్షి:**దేశీయ మొబైల్ తయారీ కంపెనీ లావా బడ్జెట్ ధరలో మరో కొత్త మొబైల్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. లావా షార్క్ 5జీ పేరిట దీన్ని తీసుకొచ్చింది.ఆకర్షణీయమైన లుక్‌తో మార్కెట్లోకి విడుదల చేసింది. కేవలం ఒక్క వేరియంట్‌లోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. 4జీబీ ం64జీబీ వేరియంట్ ధర రూ.7,999గా కంపెనీ నిర్ణయించింది. 6.75 అంగుళాల హెచ్‌డీం ఎల్‌సీడీ డిస్‌ప్లే, రిఫ్రెష్ రేటుతో వస్తోంది. ఆండ్రాయిడ్ 15 ఆధారంగా పనిచేస్తుంది. ఇక కెమెరా విషయానికొస్తే.. ఇందులో 13 ఎంపీ డ్యూయల్ కెమెరా అమర్చారు. సెల్ఫీ, వీడియో కాల్స్ కోసం ముందువైపు 5 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇక కెమెరా విషయానికొస్తే.. ఇందులో 13 ఎంపీ డ్యూయల్ కెమెరా అమర్చారు. సెల్ఫీ, వీడియో కాల్స్ కోసం ముందువైపు 5 ఎంపీ కెమెరా ఇచ్చారు.5000ఎంఏహెచ్ బ్యాటరీతో తీసుకొచ్చిన ఈ మొబైల్ 18వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. విక్రయాలు ప్రారంభమయ్యాయని.. లావా ఇ-స్టోర్‌తో పాటు కంపెనీ రిటైల్ దుకాణాల ద్వారా వీటిని కొనుగోలు చేయొచ్చని కంపెనీ తెలిపింది.

# భారత్ దెబ్బకు పాక్ అబ్బా

## చైనా ఉపగ్రహ సాయం కోసం సాయం దాయాది ఆరాటం!


ఆపరేషన్ సిందూర్ వేళ భారత్ చేతిలో ఘోరంగా దెబ్బతిన్న పాకిస్థాన్ ఇప్పుడు తమ పెద్దన్న చైనాను ఆశ్రయించింది. డ్రాగన్‌కు చెందిన బైడూ ఉపగ్రహ వ్యవస్థను మరింత వాడుకొనేలా ఒప్పందం చేసుకొన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఇరుదేశాల మధ్య మే 16వ తేదీన వ్యూహాత్మక సమావేశం జరిగింది. భారత్ దెబ్బకు పాక్ వాడుతున్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కుదేలైన వేళ ఈ సమావేశం జరగడం గమనార్హం.భారత కార్యకలాపాలు గమనించడం, ఆ సమాచారాన్ని ఇరుదేశాలు పంచుకోవడం వంటి అంశాలపై ఇరుదేశాల మిలిటరీలు చర్చలు జరిపాయి. దీంతోపాటు పాక్ 5జీ కమ్యూనికేషన్ వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకొని.. రియల్‌టైమ్ సమన్వయం, నిఘా సామర్థ్యాలను పెంచుకొనే అంశం కూడా చర్చకు వచ్చింది. వాస్తవానికి ఆపరేషన్ సిందూర్ వేళ కూడా చైనా సమగ్రంగా శాటిలైట్ కవరేజీని పాకిస్థాన్‌కు అందజేసింది. డ్రాగన్ మిలిటరీ, పరికరాల రూపంలో సాయం అందించినా.. భారత్ చేతిలో మాత్రం పాక్ సైన్యం చావు దెబ్బతింది. దానికి చెందిన ఎనిమిదికి పైగా మిలిటరీ బేస్‌లు భారత్ దాడులకు కుదేలయ్యాయి. ఇక భారత దళాలు చాలావరకు స్వదేశీ ఆయుధ వ్యవస్థలతోనే చైనా తయారీ పరికరాలను నిర్వీర్యం చేశాయి. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్-400 వ్యవస్థను న్యూదిల్లీ వినియోగించింది. భారత్ భారీస్థాయిలో ఉపగ్రహాలను కూడా ఆపరేషన్ సిందూర్ కోసం మోహరించింది. వీటిల్లో ఇస్రో వాడుతున్న ఉపగ్రహాలతోపాటు.. అంతర్జాతీయ మద్దతు కూడా తీసుకొంది. భారత్ వద్ద 9-11 మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఇస్రో వీటి నుంచి నిరంతర డేటాను దళాలకు చేరవేసింది. దీంతోపాటు ఓ కమర్షియల్ గ్లోబల్ ఆపరేటర్ నుంచి చిత్రాలను సేకరించింది. ఇస్రో సొంతంగా వాడే కార్టోశాట్ సిరీస్‌లోని వాటిని కూడా రంగంలోకి దించింది. వీటి ఆధారంగా మన దళాలు పక్కా ప్లానింగ్ చేసి.. పాక్ సైనిక స్థావరాలను దెబ్బతీశాయి. అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ సేవలు కూడా భారత్ వాడుకొంది. ఇవి అయితే.. రోజుకు ఒకసారి అయినా డౌన్‌లోడ్స్ చేసుకోవచ్చు. ఇక మన దేశానికి చెందిన ఉపగ్రహాలు పీరియాడిక్ డేటాను



14 రోజులకు ఒకసారి తీసుకొనే అవకాశం ఉంది.భారత్ కార్టోశాట్ శ్రేణి ఉపగ్రహాలను తొలిసారి 2005లో ప్రయోగించింది. వీటిద్వారా హైరిజల్యూషన్ ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చు. మన ఇంటెలిజెన్స్‌లో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆ తర్వాత కార్టోశాట్ 2సీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చాము. ఇవి ఆపరేషన్లకు సంబంధించిన కీలక సమాచారం ఇస్తున్నాయి. ఇవి 0.65 మీటర్ల రిజల్యూషన్ ఇవ్వగలవు. వీటిల్లో ఏరియాస్ ఆఫ్ ఇంట్రెస్ (ఏఓఐ)లను మాత్రం అత్యధిక రిజల్యూషన్‌తో పొందవచ్చు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్‌లో వీటిని వాడారు. భారత మిలిటరీ కోసం నిరంతరం 10 ఉపగ్రహాలు పనిచేస్తున్నాయని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. భారత్ వచ్చే ఐదేళ్లలో 100 నుంచి 150 ఉపగ్రహాలు ప్రయోగించాలని భావిస్తోంది.

## 'సిందూర్' విజయం నాయకత్వ పటిమకు నిదర్శనం

మోదీపై అంబానీ ప్రశంసలు



**జనంసాక్షి:**ప్రధాని నరేంద్రమోదీపై రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ప్రశంసలు కురించారు. ఆయన నాయకత్వ పటిమను కొనియాడుతూ.. సెల్యూట్ చేస్తున్నా అని అన్నారు. అలాగే భద్రతాబలగాల ధైర్యసాహసాలను అభినందించారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం ఈ రెండు లక్షణాలకు గొప్ప నిదర్శనమని వ్యాఖ్యానించారు. దిల్లీలో జరుగుతోన్న రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోదీ కూడా పాల్గొన్నారు దేశ రాజధానిలోని భారత మండపంలో రెండురోజుల పాటు జరిగే రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సును మోదీ ప్రారంభించారు. ఈశాన్యప్రాంతంలో పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో మోదీ మాట్లాడుతూ.. భిన్నత్వంతో కూడిన మన దేశంలో ఈశాన్యప్రాంతం మరింత వైవిధ్యభరితమైందని అన్నారు. ఈశాన్య భారతం ఒక పవర్‌హౌస్ అని, మనకు అష్టలక్ష్మి వంటిదని అభివర్ణించారు.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న 'ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. దాయాది దాడుల యత్నాలనూ సమర్థంగా తిప్పికొట్టింది. దీనిపై ఇటీవల అంబానీ స్పందించారు. ఉగ్రవాదంపై భారత్ ఐకమత్యం, స్థిరత్వం, దృఢ సంకల్పంతో పోరాడుతోందన్నారు. సాయుధ దళాల శౌర్యపరాక్రమాలపై గర్వపడుతున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు."ప్రధాని మోదీ నాయకత్వంలో భారత బలగాలు సరిహద్దు అవతలి ఉగ్ర కార్యకలాపాలపై కచ్చితత్వంతో ప్రతిస్పందించాయి. ఉగ్రవాదం విషయంలో భారత్ ఎప్పుడూ మౌనంగా ఉండదని.. దేశం, పౌరులు, సైన్యంపై దాడిని సహించబోదని మోదీ నాయకత్వం నిరూపించింది. శాంతికి విఘాతం కలిగించే ప్రతి ముప్పును దీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేసింది" అని అంబానీ ఆ ప్రకటనలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

## అక్కడ హైహీల్స్‌కు అనుమతి అవసరం



కొన్ని ప్రాంతాల్లో అమలుచేసే నిబంధనలు విస్మయానికి గురిచేస్తుంటాయి. అలాంటిదే.. 'కమెల్ బై ది సీ' నగరంలో అమలుచేస్తోన్న ఓ నిబంధన.అదేంటంటే ఆ నగరంలో రెండు అంగుళాల కంటే ఎత్తయిన హై హీల్స్ ధరించడం నిషేధం. ఒకవేళ ధరించాలని భావిస్తే స్థానిక ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. దానికి ఓ కారణముంది. యూఎస్ఏలోని కాలిఫోర్నియాలో ఉన్న చిన్న నగరం కమెల్ బై ది సీ. ఇక్కడి బీచ్, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు పర్యాటకుల్ని బాగా ఆకట్టుకుంటాయి. అయితే, ఈ నగరంలో సైప్రెస్, పైన్ చెట్లు ఎక్కువ. ఇవి భారీగా పెరగడంతో.. వాటి వేర్లు కూడా నగరమంతా వ్యాపించాయి. రోడ్లకు ఇరువైపులా పాదచారుల కోసం వేసిన పేవ్‌మెంట్లు.. వేర్ల పెరుగుదల కారణంగా దెబ్బతింటున్నాయి. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితం ఉండట్లేదు. దీంతో పేవ్‌మెంట్లు విరిగిపోయి నడవడానికి కాస్త ఇబ్బందికర పరిస్థితి నెలకొంటోంది. అలాంటిచోట్ల హైహీల్స్ వేసుకొని నడిస్తే కిందపడిపోయే ప్రమాదముంది. అందుకే, 1963లోనే అప్పటి నగర అటార్నీ హైహీల్స్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ వాటిని ధరించాలనుకుంటే ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్న నిబంధన విధించారు. అనుమతి తీసుకున్నా.. హైహీల్స్‌తో నడిచి పడిపోతే దానికి ప్రభుత్వం ఎలాంటి బాధ్యత వహించదు. బాధితులు ప్రభుత్వాన్ని నిందించలేరు. కోర్టులో దావా వేయలేరు. ఈ సుందరమైన నగరాన్ని చూడటానికి వచ్చే చాలామంది పర్యాటకులు.. హైహీల్స్ ధరించకపోయినా.. స్థానిక ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి అనుమతి ధ్రువీకరణ పత్రాన్ని పొందుతుంటారు. ప్రభుత్వం ముద్రించిన ధ్రువపత్రంపై దరఖాస్తుదారుల పేరు, అధికారి సంతకం ఉంటుంది. వాటిని పర్యాటకులు మధుర జ్ఞాపకంగా దాచుకుంటున్నారు.





## ఆస్ట్రేలియాలో భారీగా వరదలు

### నలుగురు గల్లంతు..!

ఆస్ట్రేలియాలోని న్యూసౌత్ వేల్స్‌లో భారీగా వరదలు వచ్చాయి. వీటిల్లో దాదాపు 50 వేల మందికి పైగా చిక్కుకుపోయారు. దీనిని ప్రకృతి విపత్తుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది.ఈ స్థాయిలో వర్షాలను ఇటీవల కాలంలో చూడలేదని స్థానికులు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా సిడ్నీ, న్యూకాస్టలె తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. ఇక న్యూసౌత్ వేల్స్ దక్షిణ ప్రాంతంలో కూడా భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనెస్ పర్యటించారు. తాము మరింత తీవ్రమైన వాతావరణ పరిస్థితులను చూస్తున్నామని చెప్పారు. బాధితులు ఒంటరి వారు కాదని.. వారి వెంటే తాము ఉన్నట్లు వెల్లడించారు. అత్యవసర సహాయ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ వరదల సందర్భంగా ఆ రాష్ట్ర అత్యవసర సేవల సంస్థ 24 గంటల్లో 535 మందిని కాపాడింది.భారీ వర్షాల కారణంగా వేల ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పునరావాస కేంద్రాలను తెరిచారు. ఈ వరదలకు టారే అనే పట్టణం తీవ్రంగా ప్రభావితమైంది.

## ఆర్‌బీఐ గుడ్‌న్యూస్

బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 616వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పెద్ద మొత్తంలో మిగులు నిధులను బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, రిస్క్ ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. కంటిజెంట్ రిస్క్ బఫర్ లెవల్‌ను కూడా 6.5 శాతం నుంచి 7.50 శాతానికి పెంచింది.ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, విదేశీ మారకపు ద్ర వ్యం లావా దేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుం చి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది.

## యూదులపై విద్వేసానికి యువ జంట బలి

త్వరలో నిశ్చితార్థం.. అంతలోనే మృత్యువాత
కాల్పుల్లో ఇద్దరు ఇజ్రాయెలీ దౌత్యవేత్తల మృతి
వాషింగ్టన్‌లో దుశ్చర్య

**వాషింగ్టన్:** గాజాపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరమవుతున్న వేళ...అమెరికాలో దారుణం జరిగింది. ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి చెందిన ఇద్దరు దౌత్యవేత్తలు హత్యకు గురయ్యారు. వాషింగ్టన్‌లో యూదు మ్యూజియంలో బుధవారం జరిగిన యువ దౌత్యవేత్తల కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్న యారోన్ లిషిన్‌స్కీ, సారా మిల్‌గ్రిమ్‌పై చాలా దగ్గర నుంచి దుండగుడు కాల్పులు జరిపాడు. దీంతో వారు అక్కడే తుదిశ్వాస విడిచారు. అనంతరం దుండగుడు మ్యూజియంలోనికి వెళ్లగా అక్కడ భద్రతా అధికారులు అతడిని నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ సమయంలో అతడు 'ఫ్రీ ఫ్రీ పాలస్తీనా' అంటూ నినాదాలు చేశాడని అధికారులు తెలిపారు. నిందితుడిని షికాగోకు చెందిన 30 ఏళ్ల ఎలియాస్ రోడ్రిగ్జ్‌గా గుర్తించారు. మృతుల కుటుంబాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. యూదులపై విద్వేషంతోనే ఈ హత్య జరిగిందని అన్నారు. ద్వేషానికి, అతివాదానికి అమెరికాలో స్థానం లేదని తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కాల్పుల్లో మృతి చెందిన యువ జంట యారోన్ లిషిన్‌స్కీ, సారా మిల్‌గ్రిమ్ త్వరలో నిశ్చితార్థం చేసుకోవాలని అనుకున్నారని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం తెలిపింది. లిషిన్‌స్కీ తన స్నేహితురాలి కోసం ఉంగరం కూడా కొన్నారని.. నిశ్చితార్థం జెరూసలేంలో చేసుకోవాలని యువజంట భావించిందని ఇజ్రాయెల్ రాయబారి యహియల్ లైటర్ తెలిపారు. వారిది అందమైన జంట అని పేర్కొన్నారు. ఈ ఘటనను భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా ఖండించారు. దోషులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలని పేర్కొన్నారు.



### మరో రికార్డు సృష్టించే దిశగా
# సూర్యకుమార్ యాదవ్

ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ ఐపీఎల్ 2025 సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్నాడు. మే 21న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను అసాధారణ బ్యాటింగ్‌తో అర్ధ సెంచరీ సాధించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచిన సూర్యకుమార్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ యొక్క 15 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టే అవకాశం కలిగి ఉన్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ముంబై ఇండియన్స్ తరఫున ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇప్పటివరకు సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. 2010 ఐపీఎల్ సీజన్‌లో సచిన్ 618 పరుగులతో అద్భుత ఫామ్‌ను కనబరిచి, ఐదు అర్ధ సెంచరీలు సాధించాడు. 47.53 సగటు, 132.61 స్ట్రైక్ రేట్‌తో అతను ఆ పరుగులు రాబట్టాడు. ఈ రికార్డు గత కొన్ని సంవత్సరాలుగా అలాగే కొనసాగుతోంది, ఎవరూ దానిని అధిగమించలేకపోయారు.

2023 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ ఈ రికార్డుకు చాలా దగ్గరగా వచ్చాడు. 16 మ్యాచ్‌లలో 605 పరుగులు చేసినప్పటికీ, సచిన్ యొక్క 618 పరుగుల రికార్డును అందుకోలేకపోయాడు. అయితే, 2025 సీజన్‌లో సూర్యకుమార్ మరోసారి అద్భుత ఫామ్‌లో కనిపిస్తున్నాడు. ఇప్పటివరకు 13 మ్యాచ్‌లలో 583 పరుగులు చేసిన అతను, 72.87 సగటు, 170కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్‌లో రాణిస్తున్నాడు. సచిన్ రికార్డును అధిగమించడానికి సూర్యకుమార్‌కు ఇంకా 36 పరుగులు మాత్రమే అవసరం. లీగ్ దశలో ముంబై ఇండియన్స్‌కు ఒక మ్యాచ్ మిగిలి ఉంది, ఇందులో సూర్యకుమార్ 600 పరుగుల మార్కును దాటే అవకాశం ఉంది. అదనంగా, ప్లేఆఫ్ మ్యాచ్‌లలో కూడా ఈ రికార్డును తన పేరిట నమోదు చేసుకునే సువర్ణావకాశం అతనికి లభించనుంది. సూర్యకుమార్ యాదవ్ సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టగలడా అనేది క్రీడాభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**ప్లే-ఆఫ్ ఫార్మాట్:** లీగ్ దశలో మొదటి రెండు స్థానాలు సాధించిన జట్లు క్వాలిఫయర్ 1లో తలపడతాయి. విజేత జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. 3వ, 4వ స్థానాల జట్లు ఎలిమినేటర్‌లో ఆడతాయి, ఓటమి జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. క్వాలిఫయర్ 1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో తలపడి, గెలిచిన జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

**ఐపీఎల్‌లో అత్యధిక ప్లే-ఆఫ్‌లు:** చెన్నై సూపర్ కింగ్స్ (12 సార్లు, 5 టైటిళ్లు), ముంబై ఇండియన్స్ (10 సార్లు, 5 టైటిళ్లు) అత్యధిక ప్లే-ఆఫ్‌లు సాధించిన జట్లుగా నిలిచాయి.



# గిల్ కెప్టెన్‌గా?
## ఇంగ్లండ్ పర్యటనకు భారత టెస్ట్ జట్టు
### బుమ్రా మూడు టెస్టులకే..!

ఇంగ్లండ్‌లో జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నేడు (మే 24, 2025) భారత జట్టును ప్రకటించనుంది. ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆడిన ఆటగాళ్లలో చాలా మంది ఈ పర్యటనకు ఎంపిక కానున్నారు. అయితే, స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో భారత్-ఏ జట్టులోని కొందరు యువ ఆటగాళ్లకు సీనియర్ టీమ్‌లో అవకాశం దక్కనుంది.

**బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలు:**
భారత పేస్ దళాన్ని జస్‌ప్రీత్ బుమ్రా నడిపించనున్నప్పటికీ, అతను ఫిట్‌నెస్ సమస్యల కారణంగా ఐదు టెస్టులూ ఆడలేనని బీసీసీఐకి తెలిపినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. గరిష్ఠంగా మూడు టెస్టులు మాత్రమే ఆడగలనని, తన శరీరం ఐదు టెస్టుల భారాన్ని తట్టుకోలేదని బుమ్రా సెలెక్టర్లకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టులు ఆడిన బుమ్రా, ఆఖరి టెస్ట్‌లో వెన్ను గాయంతో సుదీర్ఘ కాలం జట్టుకు దూరమయ్యాడు. ఐపీఎల్ 2025తోనే అతను రీ-ఎంట్రీ ఇచ్చాడు. ఈ నేపథ్యంలో బుమ్రాను లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించినట్లు వార్తలు వచ్చాయి.

కెప్టెన్సీ రేసులో గిల్, పంత్: రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో టెస్ట్ కెప్టెన్సీకి శుభ్‌మన్ గిల్ బలమైన అభ్యర్థిగా ఉన్నాడు. గిల్ గతంలో టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత జింబాబ్వే పర్యటనలో టీ20 ఫార్మాట్‌లో భారత జట్టును నడిపించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో రోహిత్‌కు డిప్యూటీగా వ్యవహరించాడు. అయితే, టెస్ట్ ఫార్మాట్‌లో గిల్ ఇంకా లీడర్‌షిప్ గ్రూప్‌లో భాగం కాలేదు. ఒకవేళ గిల్ కెప్టెన్‌గా ఎంపికైతే, రిషభ్ పంత్‌కు వైస్-కెప్టెన్సీ దక్కే అవకాశం ఉంది. 2018 నుంచి టెస్ట్‌ల్లో రెగ్యులర్‌గా ఆడుతున్న పంత్, ఐపీఎల్ 2025లో నీరస ప్రదర్శన కనబర్చినప్పటికీ, టెస్ట్ క్రికెట్‌లో స్థిరమైన ఆటగాడిగా ఉన్నాడు.

**జట్టు ఎంపికలో మార్పులు:**
కోహ్లీ, రోహిత్ లేని ఈ సిరీస్‌లో యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా కొనసాగనుండగా, రోహిత్ స్థానంలో సాయి సుదర్శన్ ఓపెనింగ్‌కు బరిలో ఉన్నాడు. నంబర్ 4 స్థానంలో కరుణ్ నాయర్ లేదా శ్రేయస్ అయ్యర్‌లలో ఒకరు ఎంపికయ్యే అవకాశం ఉంది. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, నీతీష్ కుమార్ రెడ్డి వంటి ఆల్‌రౌండర్లు జట్టులో ఉండే అవకాశం ఉంది. మహ్మద్ షమీ ఫిట్‌నెస్ సమస్యలతో జట్టులో చోటు సందిగ్ధంగా ఉంది, కానీ అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి యువ పేసర్లు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు.

ఈ సిరీస్ 2025-27 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌కు శ్రీకారం చుడుతుంది. కొత్త కెప్టెన్, యువ ఆటగాళ్లతో భారత జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా ఉంది.

**సిరీస్ షెడ్యూల్:**
1వ టెస్ట్: జూన్ 20-24, హెడింగ్లీ, లీడ్స్
2వ టెస్ట్: జులై 2-6, ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్
3వ టెస్ట్: జులై 10-14, లార్డ్స్, లండన్
4వ టెస్ట్: జులై 23-27, ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్
5వ టెస్ట్: జులై 31-ఆగస్టు 4, ది ఓవల్, లండన్

## టాప్-2 కోసం నాలుగు జట్ల పోటీ
### భారీ ప్రైజ్‌మనీ ఎవరిది?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 లీగ్ దశ ముగింపు సమీపిస్తుండగా, టాప్-2 స్థానాల కోసం జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. టాప్-2లో నిలిచే జట్లకు ఫైనల్‌కు చేరేందుకు రెండు అవకాశాలు లభిస్తాయి, కాబట్టి ఈ స్థానాల కోసం జట్లు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. ప్రస్తుతం క్వాలిఫయర్‌కు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ అర్హత సాధించాయి. ఈ నాలుగు జట్లలో టాప్-2లో ఎవరు నిలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

భారీ ప్రైజ్‌మనీ: ఐపీఎల్ 2025 ప్లే-ఆఫ్ దశకు చేరుకుంది. జూన్ 3, 2025న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌లో విజేత జట్టు సుమారు 20 కోట్ల రూపాయలు, రన్నర్-అప్ జట్టు 13 కోట్ల రూపాయల ప్రైజ్‌మనీ పొందనుంది. గత ఏడాది (2024) కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) విజేతగా 20 కోట్లు, సన్‌రైజర్స్ హైదరాబాద్ రన్నర్-అప్‌గా 13 కోట్లు సొంతం చేసుకున్నాయి. ఈ సీజన్‌లోనూ ఇదే ప్రైజ్‌మనీ కొనసాగునుందని ఐపీఎల్ నిర్వాహకులు స్పష్టం చేశారు.

## గిల్ షాట్‌కు ఆకాష్ సింగ్‌కు తీవ్ర గాయం

ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్‌లో భయానక ఘటన జరిగింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కొట్టిన బలమైన షాట్, లక్నో బౌలర్ ఆకాష్ సింగ్ చేతికి తగిలి తీవ్ర గాయమై, రక్తం చిందింది. ఆకాష్ మైదానం వీడగా, అవేష్ ఖాన్ అతని ఓవర్ పూర్తి చేశాడు. లక్నో 235/2 స్కోరును కాపాడే ప్రయత్నంలో ఆకాష్ గాయం ఎదురుదెబ్బగా నిలిచింది. అయినప్పటికీ, ఆకాష్ తిరిగి మైదానంలోకి వచ్చి, జోస్ బట్లర్‌ను అవుట్ చేసి తన సత్తా చాటాడు. లక్నో బ్యాటింగ్‌లో మిచెల్ మార్ష్ (117, 64 బంతులు), నికోలస్ పూరన్ (56లి, 27 బంతులు) రాణించారు. గుజరాత్‌లో బట్లర్, షారుఖ్ ఖాన్ (57, 29 బంతులు) పోరాడినప్పటికీ, విల్ ఓ'రూర్కే (3/27) బౌలింగ్‌తో 202/9తో పరిమితమై, 33 పరుగుల తేడాతో ఓడింది. ఈ ఓటమితో గుజరాత్ టాప్-2 అవకాశాలకు దెబ్బ తగిలింది. ఆకాష్ గాయంతోనూ పోరాటం క్రీడాస్ఫూర్తిని చాటింది.

# జాప్యం చేస్తే.. ధర్నాలే

### మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

**పాపన్నపేట, మే 23 (జనంసాక్షి):** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం చేస్తే భారాస తరపున రైతులకు మద్దతుగా ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని మెదక్ మాజీ ఎమ్మెల్యే,భారాస జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు.శుక్రవారం నాగ్సన్ పల్లి ఐకేపీ సొసైటీ పరిధి లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలసి ఆమె పరిశీలించారు.ధాన్యాన్ని కొనుగోలు చేయడంలోను,లారీలు పంపించడం లోను,రైస్ మిల్ వద్ద ధాన్యాన్ని దించుకోవడంలోనూ జాప్యం జరుగుతుందని ఆమె ఆరోపించారు.తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాలని లేదా ట్రాక్టర్ ల ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో చరవాణిలో మాట్లాడారు.అకాల వర్షాలకు తగ్గట్టుగా జిల్లా అధికారులు సదుపాయాలు కల్పించకపోవడం ద్వారా ధాన్యం పూర్తిగా తడిసిందన్నారు.తడిసిన మొలకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించడానికి జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు గానీ కొనుగోలు కేంద్రాలకు రాలేరని ఆరోపించారు.కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యం గురించి జిల్లాలో పట్టించుకునే నాథుడే లేరన్నారు.ఈసందర్బంగా పాపన్నపేట మండల భారాస అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి,మెదక్ జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు తాడేపు సోములు,ఏడుపాయల దేవస్థాన మాజీ చైర్మన్లు,విష్ణువర్ధన్ రెడ్డి,బాలాగౌడ్,పాపన్నపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.





## సూర్యాపేట డిఎంహెచ్ఓ డాక్టర్ కోట చలం బదిలీ

### ఇంచార్జ్ డీఎంహెచ్ఓగా డాక్టర్ చంద్రశేఖర్

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** సూర్యాపేట డిఎంహెచ్ఓ డాక్టర్ కోట చలంను ప్రభుత్వం బదిలీ చేసింది.ఆయన స్థానంలో ఇంచార్జ్ డిఎంహెచ్ఓగా ఎల్బీ నగర్ డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్ర శేఖర్ కు భాద్యతలు అప్పగిస్తూ, డాక్టర్ కోట చలంను హైదరాబాద్ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.జిల్లాలో ఎలాంటి అనుమతులు, అర్హతలు లేకుండా హాస్పిటల్స్ నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చలగాట మాడుతున్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల బాగోతలు వరుసగా బయటపడ్డాయి.ఇటీవల సూర్యాపేటలో ఇద్దరు మహిళలు వైద్యం వికటించి మృతి చెందారు.ప్రైవేట్ ఆసుపత్రులను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

## గవర్నర్‌ను కలిసిన అంబేద్కర్ వర్శిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి

### విశ్వవిద్యాలయ 26వ స్నాతకోత్సవానికి ఆహ్వానం



**హైదరాబాద్, మే 23, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను శుక్రవారం అంబేద్కర్ విశ్వవిద్యాలయ అధికారులు రాజ్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అభివృద్ధి పనులు, విశ్వవిద్యాలయ కార్యక్రమాలను వివరించారు. ఆగస్టు / సెప్టెంబర్ నెలలో జరగనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి అనుమతి కోరుతూ కార్యక్రమానికి హాజరవ్వాల్సిందిగా అధికారులు గవర్నర్‌ని ఆహ్వానించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎల్. విజయ కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ. భోజు శ్రీనివాస్, ప్రజా సంబంధాల అధికారి డా. పి.వేణు గోపాల్ రెడ్డి ఉన్నారు.

# పంజాబ్ కింగ్స్‌లో గందరగోళం

### ఛండీగఢ్ కోర్టులో పిటిషన్ దాఖలు




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పంజాబ్ కింగ్స్ టీమ్‌కు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తున్నాడు. అతడి కెప్టెన్సీలో పంజాబ్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. 11 ఏళ్ల తర్వాత పంజాబ్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈసారి టాప్-2లోనూ నిలిచే ఛాన్స్ ఉంది. ఇంతలో ఆ జట్టులో గందరగోళం ఏర్పడింది. పంజాబ్ కింగ్స్ సహ యజమాని ప్రీతి, ఆ జట్టు డైరెక్టర్లు మోహిత్ బుర్మాన్, నెస్ వాడియాపై ఛండీగఢ్ కోర్టులో పిటిషన్ వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ఇద్దరూ సమావేశం నిర్వహించార ంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. మోహిత్ బుర్మాన్, నెస్ వాడియా ఈ ఇద్దరూ నిబంధనలకు విరుద్ధంగా గత నెల సమావేశం నిర్వహించి, మునీశ్ ఖన్నాను కొత్త డైరెక్టర్‌గా ఎన్నుకున్నారని, ఆ నియామకాన్ని నిలిపివేయాలని ప్రీతి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా అమలు చేయకుండా చూడాలని పేర్కొన్నారు. కంపెనీ చట్టం 2013 ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఈ సమావేశం నిర్వహించారని ప్రీతి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే మోహిత్ బుర్మాన్, నెస్ వాడియా, ప్రీతి ఈ ముగ్గురు డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లుగా ఉన్నారు. పంజాబ్ కింగ్స్ జట్టు ఈ కంపెనీకి చెందినదే. గతనెల 21న నిర్వహించిన సమావేశంలో ప్రీతితోపాటు మరో డైరెక్టర్ కరణ్ పాల్ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే కొత్త డైరెక్టర్‌గా మునీశ్ ఖన్నాను నియమించడాన్ని ప్రీతి వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే ఓనర్ల మధ్య వివాదం ముదిరింది. తాను ఈ మీటింగ్‌కు హాజరైనప్పటికీ ఇది చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేశారని, ఈ నియామకాన్ని నిలిపివేయాలని ప్రీతి కోర్టును కోరారు. కాగా, బోర్డులో వివాదాలు చెలరేగినప్పటికీ పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లకు డైరెక్టర్ ప్రీతి జింటా హాజరయ్యారు. జట్టుకు మద్దతుగా నిలుస్తూ ప్లేయర్లను ప్రోత్సహిస్తున్నారు. ఇక ఈ సీజన్‌లో ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన పంజాబ్, మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. మే 24న జైపూర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో, మే 26న ముంబయి ఇండియన్స్‌తో ఆడనుంది.

# కారుణ్యం ఎరుగని "హాసిని"!

- ఖమ్మం కార్పొరేషన్‌లో ఉద్యోగుల పాలిట శాపం
- ఎంప్లాయ్స్‌ని తన చుట్టూ తిప్పుకుంటూ అల్లాడిస్తున్న దైన్యం
- అర్హత లేకున్నా అందలం ఎలా ఎక్కిందో అంతు చిక్కని వైనం
- మరి ఆమె కొలువు ఎవరి ఎస్టాబ్లిష్ మెంట్ కోసమో.?

**ఖమ్మం మే 23, జనం సాక్షి :**
నామంలో "హాసం" లేకపోయినా పెదవులపై చిరు నవ్వును అందరూ కోరుకుంటారు. మరి పేరులో "హాసం" ఉన్నా తోటి వారిపై కనీస కనికరం, కారుణ్యం లేకపోతే అలాంటి వారిని ఏ భాషలో, ఏ రీతిలో దునుమాడాలి.? ఖమ్మం కార్పొరేషన్ లో ఓ అధికారిణి అక్కడి ఉద్యోగుల పాలిట శాపంగా మారిన వైనం ఇప్పుడు ఆ కాంపౌండ్ లో హాట్ టాపిక్ గా మారింది. అర్హత లేకపోయినా అందలం మీద కూర్చుని కర్ర పెత్తనం చేస్తున్న ఆమె తీరుపై కమిషనర్ సైతం గుర్రుగానే ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయినా హాసం ఎరుగని "హాసిని" కార్పొరేషన్ ఉద్యోగులపై తనదైన రీతిలో దాష్టీకాన్ని చూపిస్తోంది.

సుమారు నాలుగు లక్షలపైబడిన జనాభా కలిగిన ఖమ్మం కార్పొరేషన్ లో రెండు వందల మంది ఉద్యోగులు ప్రజలకు నిత్యం సేవలందిస్తున్నారు. ఉద్యోగులు జనానికి సేవాలందిస్తున్నా వారికి మాత్రం తాము కొలువై ఉన్న చోట సేవలందకపోవడమే శోచనీయం. ఉద్యోగుల సర్వీస్ మేటర్స్, కోర్టు కేసులు, ఎరియర్స్ తో పాటు ఇతరత్రా లావాదేవీలను కార్పొరేషన్ కార్యాలయంలోని ఎస్టాబ్లిష్ మెంట్ సెక్షన్ అధికారి చూసుకుంటారు. కేవలం ఉద్యోగుల సేవల కోసమే ఈ సెక్షన్ పని చేయాల్సి ఉంటుంది. అలాంటిది ఆ సెక్షన్ లో పని అంటేనే ఉద్యోగులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్న తీరు కనిపిస్తుంది. ఎందుకో ఈపాటికే అర్థమై ఉంటుంది. ఈ సెక్షన్ కార్యనిర్వహణ అధికారి ఉద్యోగులకు సర్వీస్ ఇచ్చే విషయంలో వ్యవహరిస్తున్న తీరే ఇందుకు ప్రధాన కారణం. వాస్తవానికి సూపరింటెండెంట్ హోదా కలిగిన అధికారి ఈ కుర్చీలో కూర్చోవాల్సి ఉండగా కనీసం సీనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారినైనా నియమించకపోవడం దారుణం. కాగా ఈ సీటులో కూర్చున్న జూనియర్ అసిస్టెంట్ హోదా కలిగిన అధికారిణి అన్నీ తానై హల్ చల్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగుల వ్యవహారాలను ఏమాత్రం పట్టించుకోకుండా వారిపై పెత్తనం చేస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. కనీసం సీనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారినైనా ఈ కుర్చీలో కూర్చోబెట్టాలని కమిషనర్ తపన పడుతున్నప్పటికీ ఆ కార్యం నెరవేరడం లేదు. అందుకు కారణం కూడా లేకపోలేదు. ఒక మంచి అధికారిని ప్రపోస్ చేయాలని కమిషనర్ ఆదేశిస్తున్నా ఆ ఆదేశాలు పేపర్ పైకి ఎక్కకపోవడానికి ఆ సీటులో కూర్చున్న లేడీ బాసే కారణమని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ పరిణామంతో ఉద్యోగుల ఇక్కట్లు అన్నీఇన్నీకావన్న చర్చ మొదలైంది. ఫలితంగా హాసం ఎరుగని ఆ "హాసిని" కార్పొరేషన్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్న చర్చ కార్పొరేషన్ కాంపౌండ్ లో వినిపిస్తోంది.

ఇదిగో మచ్చుకో ఉదాహరణ..
ఖమ్మం కార్పొరేషన్ లో చైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మి 2023 మార్చి నెలలో మరణించింది. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆమె ఉద్యోగం ఆమె కుమారుడికి కారుణ్య నియామకం కింద కేటాయించాల్సి ఉంది. భాగ్యలక్ష్మి మరణానంతరం మరణ ధృవీకరణను పొందుపరుస్తూ ఆమె కుమారుడు కార్పొరేషన్ ఎస్టాబ్లిష్ మెంట్ విభాగంలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అతనికి నేటికి కూడా ఉద్యోగం రాలేదు. ఇందుకు ఆ సెక్షన్ అధికారిణి నిర్వాకమే కారణమన్న వాదన బలంగా వినిపిస్తోంది. సర్కారు నియమ, నిబంధనల ప్రకారం కారుణ్య నియామకం పొందుతున్న వ్యక్తికి 45 సంవత్సరాల వయసు మీరకుండా ఉండాలి. అయితే అతను దరఖాస్తు చేసుకున్న సమయానికి అతని వయసు నిర్ణీత వయసుకు ఆరు నెలలు తక్కువగా ఉంది. అంటే వాస్తవానికి అతను ఉద్యోగానికి నూటికి నూరుపాళ్లు అర్హుడే అవుతాడు. అయితే సదరు ఉద్యోగార్థుడి ఫైల్ కు సవాలక్ష కొర్రీలు పెట్టి ఒక సంవత్సర కాలం వృధా చేసిన సదరు మంద"హాసిని" చివరికి ఉద్యోగం రాకుండా చేసింది. కార్యాలయం చుట్టూ కాళ్ళు అరిగేలా తిప్పుకున్న ఆమె ఏడాది సమయం వృధా చేసి ఉన్నతాధికారులకు ఫైల్ పంపింది. దీంతో ఆ సమయానికి అతని వయసు 45 ఏళ్ళు నిండటంతో అనర్హుల జాబితాలోకి పడిపోయాడు. ఈ నిర్లక్షపు కార్యానికి సదరు మేడమ్ గారే పుణ్యం కట్టుకోవడం గమనార్హం. ఇలా ఎందరో, ఇంకెందరో ఉద్యోగులు అనేక రకాలుగా నష్టపోవడం విస్మయం కలిగించే విషయం. ఇలాంటి పరిణామాలతో ఉద్యోగులు విసిగివేసారిపోతున్నట్లు స్పష్టమవుతోంది. ఇక కమిషనర్ సారే ఆమె నిర్వాకాన్ని గుర్తించి ఆ సెక్షన్ కు మరో మంచి అధికారిని నియమించాలని ఉద్యోగులు మొర పెట్టుకుంటున్నారు.




### జూన్ 2న మద్యం, మాంసం
# దుకాణాలు మూసివేయాలి

- అమరవీరుల చిహ్నం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినం
- రాష్ట్ర నేపథ్యంపై ప్రతి స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి
- ప్రజాదర్బార్‌లో రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్‌కు 'స్కై' ఫౌండేషన్ వినతి

**హైదరాబాద్, మే 23, జనం సాక్షి :**
ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఆరు దశాబ్దాలకుపైగా అలుపెరగని పోరు జరిగిందని, ఈ ఉద్యమంలో ఎంతోమంది ప్రాణత్యాగాలకు సిద్ధపడితేనే రాష్ట్రం సిద్ధించిందని స్కై ఫౌండేషన్ పేర్కొంది. అందువల్ల అమరవీరుల త్యాగాలతో నిర్మితమైన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినం రోజు జూన్ 2న మద్యం, మాంసం దుకాణాలు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. నాడు దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు సర్వం త్యజించారని, వారి జ్ఞాపకార్థంగా ఆగస్ట్ 15న, జనవరి 26న మద్యం, మాంసం దుకాణాలు మూసివేస్తున్నట్టు ఆనవాయితీని ఈ సందర్భంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో జూన్ 2న కూడా మద్యం, మాంసం షాపులను బంద్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజాదర్బార్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ వై సంజీవ కుమార్ మాట్లాడుతూ.. ఈ చర్యలు తీసుకుంటే అమరులకు ఘన నివాళులు అర్పించినట్టవుతుందని అన్నారు. రాష్ట్ర చరిత్ర, ఉద్యమాలు, సాకారమైన సందర్భాలను ప్రతి తరానికీ తెలియజేసేవిధంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి, దేశం, రాష్ట్రం గురించి ప్రతి అంశం పట్ల వారికి అవగాహన పెంపొందించాలని, అందుకు జూన్ 2న ప్రతి పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులతో పాటు తెలంగాణ కోసం కొట్లాడిన అమరుల గురించి కూడా ఈతరం పిల్లలకు తెలియాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఇది ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలని విన్నవించారు. ఇప్పటికే 11 సంవత్సరాలు పూర్తయినా అమరుల త్యాగాలను ప్రతిబింబించేలా కచ్చితమైన చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వం వెంటనే స్పందించి ఆరోజు మద్యం, మాంసం దుకాణాలు బంద్ చేయించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంచి ఆలోచనను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినందుకు స్కై ఫౌండేషన్‌ను చిన్నారెడ్డి అభినందించారు.





# నిలువ నీడ కరువై... ప్రయాణం భారమై

## నిరీక్షణగా.. ప్రగతిరథం ప్రయాణికులు

- భారమైన బస్టాండ్లు
- బస్టాండ్ లేక...దుకాణ మెట్లే దిక్కు
- అయ్యా ఆగండి.. బస్సు వస్తే వెళ్ళిపోతాం..అంటున్న ప్రయాణికులు

**కొత్తగూడ మే 23 జనంసాక్షి:** నిరంతరం రద్దీగా ఉండే మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం. ఈ మండల కేంద్రానికి సరైన బస్టాండ్ లేక ఏండ్ల తరబడి ప్రయాణకులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది. నాలుగు దిక్కుల నాలుగు జిల్లా కేంద్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న కొత్తగూడ నిరంతరం రద్దీగా ఉండడం జరుగుతుంది. తూర్పున గంగారం, ఇల్లందు, ఖమ్మం వెళ్లే ప్రయాణికులు ఉత్తరాన మండల గ్రామలతో పాటు పస్రా, ములుగు జిల్లాకు దక్షణం గూడూరు, మహబూబాబాద్ జిల్లా కు పడమర వైపు నర్సంపేట, వరంగల్ జిల్లా కు వెళ్లే విధంగా రవాణా వ్యవస్థ ఉన్నప్పటికీ సరైన బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో ప్రయాణికులు అలసి సేదా తీరాలని ఉన్నప్పటికీ బస్టాండ్ లేకపోవడంతో దుకాణం మెట్లపై సేద తీరడంతో దుకాణం యజమానులు షాపుల ముందు కూర్చోవడం ఏంటని మాకు గిరాకీ రావడంలేదని కోప దృక్తులు అవ్వడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది.



ప్రయాణికులను ఎన్ని అన్న అలాగే కూర్చొని బస్సు వస్తుంది అయ్యా.! వెళ్ళిపోతాం! అంటూ మహిళలు, వృద్ధులు నిలువ నీడ కోసం ఇబ్బందులు పడుతున్నారు.మండే ఎండ, వాన లో ప్రయాణం చేస్తున్న తరుణంలో అలసిపోయిన వృద్దులు చిన్నపిల్లలు దుకాణం మెట్లపై నిద్రిస్తున్నారు.షాపులకు ఇబ్బంది కలుగుతుందని షాప్ యజమానులు అంటున్నారని ప్రయాణికులు అంటున్నారు. బస్టాండ్ లేకపోవడంతో దుకాణాల ముందు బస్సులు ఆగడం వల్ల బస్సు ఎక్కడ వెళ్లిపోతాయని దుకాణంల ముందు నుండి వెళ్ళమన్న గాని అక్కడే కూర్చుని ఉంటున్నారు. అలసిపోయి నిరంతరం ప్రయాణం చేసి వచ్చి కూర్చుందాం... అనుకున్న కనీసం కూర్చునే పరిస్థితి లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర బాధను వ్యక్తపారుస్తున్నారు.

### ప్రభుత్వం స్పందించి వెంటనే బస్టాండ్ ఏర్పాటు చేయాలి



**బోడ నవీన్ నాయక్ బీజేపీ గిరిజన మోర్చా వనభందు సెల్ రాష్ట్ర కన్వీనర్**

నాలుగు దిక్కుల నాలుగు దుకాణం ముందు స్టాప్‌లు ఉన్నాయని దుకాణం అరుగులపై కూర్చోవడంతో దుకాణం యజమానులు పూర్తిగా అసహనం వ్యక్తం చేస్తూ ఉండడంతో చాలా ఇబ్బందిని మహిళలు భరిస్తున్నారు. వృద్దులు, చిన్న పిల్లలు అలసి దుకాణం మెట్లపై నిద్ర పోవడంతో దుకాణం ముందు లేవాలని ప్రయాణికులు బాధను తెలియ పరిచారు.ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఏర్పాటు చేయడం ద్వారా దుకాణం యాజమాన్యం కు ప్రయాణం చేసే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు.

### మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు:



**తుడుం దెబ్బ మండల అధ్యక్షులు పూనెం సందీప్**

మండల కేంద్రంలో సరైన బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు.పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడం బస్సు మిస్ కావడంతో చాలామంది షాపల ముందే రాత్రి సైతం నిద్రపోతున్నారని గుర్తు చేశారు. మహిళలు, వృద్ధుల సౌకర్యార్థం ఈ ప్రాంత ప్రజల కోసం ప్రభుత్వం స్పందించి బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు.

# ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో కేశంపేట యువతి మృతి





**షాద్ నగర్ (జనంసాక్షి) :** ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం వేముల్ నర్వ గ్రామానికి చెందిన యువతి మృతి చెందడం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం ఉన్నత చదువులకు హైదరాబాద్ వెళ్లిన యువతి అక్కడి నుంచే అన్నల ఉద్యమబాట పట్టిందని, గత పన్నెండేళ్లుగా అజ్ఞాతంలోనే ఉందని పేర్కొన్నారు. ఛత్తీస్ ఘడ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో కన్నుమూసింది. గ్రామంలోని వన్నాడ సాయిలుగౌడ్ మొదటి భార్య రాధమ్మకు ముగ్గురు అడపిల్లలు విజయలక్ష్మి మూడో సంతానం. విజయలక్ష్మి కేశంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం అక్కడే ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. డిగ్రీ మహబూబ్ నగర్ లోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ కళాశాలలో చదివింది. అనంతరం నిజాం కళాశాలలో ఎల్ఎల్ బి చేస్తున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ఉద్యమబాట పట్టినట్లు తెలిసింది. అప్పటి నుంచి కుటుంబ బంధాలను తెంచుకుందని, ఉద్యమంలోకి వెళ్లిన తర్వాత విజయ లక్ష్మితో ఎప్పుడూ మాట్లాడలేదని, గ్రామంలోకి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. చదువుకుంటున్న సమయంలో గ్రామంలో చిన్నపిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెప్పినట్టు గ్రామస్తులు తెలిపారు.

# రైస్ మిల్లుల వద్ద సకాలంలో ధాన్యం దించుకోవాలి

- నిర్దేశిత గడువు లోగా సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి
- పూసాల గ్రామంలోని మిథీలా రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సుల్తానాబాద్,మే 23(జనంసాక్షి) : రైస్ మిల్లుల వద్ద ధాన్యం సకాలంలో దించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామంలోని లోని మిథీలా ఇండస్ట్రీ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నామని, మిల్లుల్లో వద్ద ధాన్యం వేచి ఉండకుండా వెంటనే దించుకోవాలని, ఎక్కడ ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు.ప్రభుత్వం అందించిన ధాన్యానికి సంబంధించి సీ.ఎం.ఆర్. రైస్ ను నిర్దేశిత గడువు లోగా సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డి.టి.సి.ఎస్.లు మహేష్, రవీందర్ పాల్గొన్నారు.



# విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

- నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి
- కల్తీ విత్తనాలను విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తాం
- ఫెర్టిలైజర్ షాపులను నిరంతరం తనిఖీ చేయాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

**పాలకుర్తి, మే 23 (జనంసాక్షి) :** వానకాలాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఎరువుల దుకాణాల డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో గల సుధా ఫెర్టిలైజర్ షాప్ తో పాటు ఆగ్రోస్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డులో రైతుల వివరాలు నమోదు చేయడంతో నేరుగా రైతులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. పత్తి ప్యాకెట్లు ఎంతకు విక్రయించారని, డీలర్లు బలవంతం చేశారా అని రైతుల ద్వారా ఆరా తీశారు. పత్తి విత్తన ప్యాకెట్లను సుధా ఫెర్టిలైజర్ షాపులో, ఆగ్రోస్ షాపులో కొనుగోలు చేశామని రైతులు కలెక్టర్కు ఫోన్లో వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఎరువుల డీలర్ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి తప్ప నకిలీ విత్తనాలు అందించి మోసం చేయరాదని సూచించారు. ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పత్తి విత్తనాలతో పాటు విత్తన ధాన్యం అమ్మకాల వివరాలు రషీద్ బుక్కులో నమోదు చేయాలని డీలర్లను ఆదేశించారు.విత్తనాల క్రయవిక్రయాల రికార్డులు, కంపెనీల పత్రాలు, విత్తన ప్యాకెట్లపై లేబుల్స్, వ్యాపార లైసెన్స్, కొనుగోళ్ల రిజిస్టర్ లను, స్టాక్ నిల్వలతో కూడిన ధరల పట్టిక బోర్డును పరిశీలించారు.రైతులు అధీకృత విత్తన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత విధిగా రైతు సంతకంతో కూడిన రసీదును రైతులకు ఇవ్వాలన్నారు. బీటీ త్రీ విత్తనాలకు ఎక్కడ ఆమోదం లేదని, బీటీ త్రీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీటీ త్రీ ప్రభుత్వం ద్వారా ఆమోదం పొందలేదని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నాగేశ్వర చారి, ఏవో శరత్చంద్ర, ఎంపీడీవో రాములు, ఆర్ ఐ రాకేష్ లతోపాటు డీలర్లు భూపాల్ రావు, రాపర్తి ఆంజనేయులు, ఏఈవోలు పాల్గొన్నారు.

# సహకార సంఘాల సీఈఓలను బదిలీ చేయవద్దు

- రైతులకు అందుబాటులో ఉండి మంచి విధులు నిర్వహిస్తున్నారు.
- రైతు సంక్షేమం కోసం ఏద్కెనా చేస్తా
- సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- సుల్తానాబాద్ నూతన కేడిసిసిబి నూతన బ్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ రమణారావు





**సుల్తానాబాద్, మే 23 (జనంసాక్షి):** రైతుల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న సహకార సంఘాల సీఈఓలను ఎట్టి పరిస్థితుల్లో బదిలీ చేయవద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, జాతీయ సహకార సంఘాల అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావుకు సూచించారు. శుక్రవారం సుల్తానాబాద్‌లోని ప్రాథమిక పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో 2.5 కోట్ల రూపాయలతో నిర్మితమైన కేడీసీసీబీ నూతన బ్యాంకు భవనాన్ని ఎమ్మెల్యే విజయ రమణారావు, కొండూరి రవీందర్‌రావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. గతంలో సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందులతో ఉనికి కోల్పోయే స్థితిలో ఉన్నప్పుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీటి బలోపేతం కోసం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాల్లో 'కటింగ్'ల పేరుతో రైతులను మోసం చేసే పద్ధతిని నిర్మూలించి, పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నామని ఆయన తెలిపారు. సహకార సంఘాల సీఈఓలు రైతులకు అండగా నిలిచి, కటింగ్‌లు లేకుండా సేవలందిస్తున్నారని, వారిని బదిలీ చేయకుండా చర్యలు తీసుకోవాలని కొండూరి రవీందర్‌రావును కోరారు.
అలాగే, కొంతమంది ప్రైవేట్ సీడ్ వ్యాపారులు రైతులతో ఒప్పందాలు చేసుకొని మద్దతు ధరలు అందించకుండా మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ప్రకటించడం ద్వారా పెద్దపల్లి నియోజకవర్గానికి 60 కోట్ల రూపాయల బోనస్ అందించిన ఘనత సాధించిందని స్పష్టం చేశారు. సహకార సంఘాలు రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందేందుకు పార్టీలకతీతంగా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగిల్ విండో వ్యవస్థ ద్వారా సహకార సంఘాల అధ్యక్షులను తొలగించే అధికారం ఉన్నప్పటికీ, చిత్తశుద్ధితో అటువంటి చర్యలు తీసుకోలేదని, బీఆర్‌ఎస్ నాయకులు అధ్యక్షులుగా ఉన్నప్పటికీ వారిని కొనసాగించామని విజయ రమణారావు వెల్లడించారు.
సుల్తానాబాద్ కేడీసీసీబీ బ్యాంకు నిర్మాణంలో సింగిల్ విండో చైర్మన్, కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులను శ్రీగిరి శ్రీనివాస్ శాలువా, మెమెంటోలతో సత్కరించారు.
ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశరావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మోహన్ రెడ్డి, సహకార సంఘాల జిల్లా అధికారి శ్రీమాల, కేడీసీసీబీ ఉపాధ్యక్షుడు పింగిలి రమేష్, సీఈఓ సత్యనారాయణ రావు, సింగిల్ విండో చైర్మన్లు జూపల్లి సందీప్‌రావు, దేవరనేని మోహన్‌రావు, కోట వీణ, గడ్డం మహిపాల్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ నియాజ్, డీజీఎం బ్రహ్మానందరావు, ఏజీఎం మహేష్, సూపర్వైజర్ సాగర్ రెడ్డి, సహకార సంఘాల సీఈఓలు బూరుగు సంతోష్, రమేష్, బొంగోని శంకరయ్య గౌడ్, సతీష్, నబి యోద్దీన్, కాంగ్రెస్ సీనియర్ నేతలు దన్నాయక్ దామోదర్ రావు, ధనాయక్ శ్రీనివాస రావు, చిలుక సతీష్, వేగోళం అబ్బయ్య గౌడ్, సాయిరి మహేందర్, అమీరిశెట్టి రాజలింగం, తిరుపతి, పన్నాల రామన్న, కోట శ్రీనివాస్, తొర్రి కొండ ప్రభాకర్, ఉస్థేంగణేష్, న్యతరి దేవేందర్, భూషణ వేణి రాజా గౌడ్, సహకార సంఘ సిబ్బంది రాజు, శ్యామ్ పాల్గొన్నారు.

## వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

### రైతులు ఆందోళన చెందొద్దు : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని మోరంచపల్లి, లక్ష్మారెడ్డిపల్లి, కర్కపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ కొంతమంది రైతులు లారీలు సమయానికి రాక కళ్లాల్లోనే వరి ధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సివిల్ సప్లై అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా సివిల్ సప్లై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లై అధికారులైన డీఎస్వో శ్రీనాథ్, సివిల్ సప్లై డీ ఎమ్ రాములు, డీసీవో వాల్యానాయక్ లతో రైతుల ఇబ్బందులపై మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షాలతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేయాలన్నారు. మిల్లర్లు సన్న వడ్లను దింపుకునేలా చూడాలని కోరారు. అదేవిధంగా, లారీల కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

## కర్ణాటకలో సైబర్ నేరస్థుడిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



**ఖమ్మం టౌన్, జనంసాక్షి :** మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామని ఖమ్మంకి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి, డిజిటల్ అరెస్టు చేసి సుమారు 1.12 కోట్ల రూపాయలు దోచుకున్న కేసులో వ్యక్తిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు కర్ణాటకలోని హుబ్లీలో అరెస్టు చేసినట్లు సి.పి. సునీల్ దత్ గారు తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం అర్బన్ మండలంలోని టీచర్స్ కాలనికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి అయిన నాగుల బ్రహ్మం గారికి ఫోన్ లో మనీ లాండరింగ్ పాల్పడారని, ముంబాయి పోలీసులమని, అరెస్టు చేస్తామని బెదిరించి, అక్టోబర్- 2024 లో ఫలు ధఫాలుగా సుమారు 1.12 కోట్ల రూపాయలు దోచుకున్న కేసులో రూ. 32 లక్షలు అకౌంటికి వెళ్ళిన మహ్మద్ జాఫర్ బెల్గాం, వయస్సు 40 సం.ల వ్యక్తిని కర్ణాటకలోని హుబ్లీలో అరెస్టు చేసినట్లు, నిందుతున్ని సైబర్ క్రైమ్ కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ కి తరలించారు అని తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించి, కర్ణాటకలోని హుబ్లీలో నిందుతున్ని అరెస్టు చేసి, ఖమ్మంకి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా తీసుకువచ్చిన సైబర్ క్రైమ్ డిఎస్పీ, సిహెచ్.ఆర్వి ఫణిందర్ ఎస్సై రంజిత్ కుమార్, సహకరించిన ఎస్సై విజయకుమార్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సి.పి. అభినందించారు.



## సారూ.. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి

# మంత్రికి వృద్ధురాలి విన్నపం

### త్వరలోనే మంజూరు చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

**చిగురుమామిడి, మే 23(జనం సాక్షి) :** మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన మంతెన వెంకటమ్మ అనే వృద్ధురాలు తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వేడుకున్నారు. వివరాల్లోకి వెళితే కరీంనగర్ ఫిలింనగర్ ఒక కార్యక్రమానికి వెళుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ం తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, పేదరాలైన నాకు ఇల్లు మంజూరు చేయాలని మంత్రిని వేడుకున్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సాధ్యమైనంత త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచండి

### నాణ్యమైన విద్యను అందించండి: ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

**సుల్తానాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య సూచించారు. శుక్రవారం ఆంగ్లం ప్రధానోపాధ్యాయులు, ఎస్‌జిటి ఉపాధ్యాయుల రెండవ విడత శిక్షణ కార్యక్రమంలో భాగంగా 4వ రోజు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి మల్క కొమరయ్య హాజరై ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి , నాణ్యమైన విద్యను అందించే ప్రణాళికలు తయారు చేసుకొని ,శిక్షణా తరగతులను సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు. ఈ నాటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు కావున ఉపాధ్యాయులు భాధ్యతగా మెలగాలని తెలిపారు. శిక్షణా తరగతులను సందర్శించి సంతృప్తి తెలియజేసారు. అనంతరం కోర్సు డైరెక్టర్ , ఎం.ఈ.ఓ. ఆరెపల్లి రాజయ్య , ప్రోగ్రాం అబ్జర్వర్ సి.హెచ్. ప్రద్యుమ్న కుమార్ ఎం.ఎల్.సి ని శాలువాతో ఘనంగా సన్మానించారు.

## కరీంనగర్‌లో లోక్ సత్తా ఉద్యమ నాయకుడు నరేడ్ల శ్రీనివాస్ విగ్రహ ఆవిష్కరణ



**కరీంనగర్ బ్యూరో, మే 23 (జనంసాక్షి):** కరీంనగర్ ఫిలిం సొసైటీ ప్రాంగణంలో సామాజిక ఉద్యమకారుడు, గొప్ప మానవతావాది, లోక్ సత్తా ఉద్యమ నాయకుడు నరేడ్ల శ్రీనివాస్ విగ్రహాన్ని రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.
నరేడ్ల శ్రీనివాస్ ఒక సామాజిక ఉద్యమకారుడిగా, లోక్ సత్తా ఉద్యమ నాయకుడిగా, వినియోగదారుల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 1987లో ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తాను శ్రీనివాస్‌తో కలిసి మాజీ మంత్రి జె. చొక్కారావు, సత్యనారాయణ రావు వంటి నాయకులతో అనేక సామాజిక అంశాలపై చర్చలు జరిపినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. శ్రీనివాస్‌తో కలిసి మహారాష్ట్రలోని రాలేగావ్ సిద్ధి ప్రాంతానికి వెళ్లి నీటి వినియోగంపై అధ్యయనం చేసిన విషయాన్ని కూడా ప్రభాకర్ పంచుకున్నారు. శ్రీనివాస్ వినియోగదారుల హక్కుల కోసం, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా అవినీతికి వ్యత ఫిలిం సొసైటీలో కీలక సభ్యుడిగా వ్యవహరించారని ఆయన కొనియాడారు.ఫిలిం సొసైటీ కోసం మంచి స్థలం సమకూర్చాలని, ఈ విషయంలో కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. స్థల సేకరణకు నిధులు సమకూర్చే బాధ్యత తాను తీసుకుంటానని, కరీంనగర్ జిల్లాకు పైడి జయరాజ్ వంటి మహనీయుల చరిత్ర ఉందని ఆయన అన్నారు. నరేడ్ల శ్రీనివాస్‌కు నివాళులు అర్పిస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, యువతను గంజాయి వంటి వ్యసనాల నుండి దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు, సమాజం కలిసి చర్యలు తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఫిలిం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు మాట్లాడుతూ, శ్రీనివాస్ సమాజంలో జీవించి, మహనీయుడిగా నిలిచారని అన్నారు. ఆయన ఒక సమాచార కేంద్రంలా పనిచేస్తూ, తనకు తెలిసిన విషయాలను ఇతరులతో పంచుకుని సమాజాన్ని చైతన్యవంతం చేశారని కొనియాడారు. గురుకులాల జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, శ్రీనివాస్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన అధికారుల తరపున, బాధితుల తరపున మాట్లాడుతూ సమాజం నుండి ప్రశంసలు పొందారని తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటూ పేదల కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు.

# ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లండి

- రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ పార్టీ విధి విధానాలపై అవగాహన కల్పించండి
- యువజన కాంగ్రెస్ నాయకులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం



**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** దేశంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) సాగిస్తున్న నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర బాల వికాస కేంద్రంలో నిర్వహిస్తున్న "వైట్ టీ షర్ట్" శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం యువజన కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మంగా చేపట్టిన "వైట్ టీ షర్ట్" ఉద్యమం చాలా గొప్పదన్నారు. కరుణ, ఐక్యత,అహింస, సమానత్వం, అందరికీ పురోగతి లాంటి అయిదు మార్గదర్శకాలకు "వైట్ టీ షర్ట్" చిహ్నంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అన్నారు. దేశ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా యువజన కాంగ్రెస్ అవతరించిందన్నారు. ఆ స్ఫూర్తితో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రవణ్ రావు, నాయకులు నితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ జడలు విప్పుతున్న కరోనా

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేసుల నమోదు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక

**విజయవాడ/హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** యావత్ ప్రపంచాన్నీ వైరస్‌తో వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ జడలు విప్పుతోన్న సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలో గత నాలుగు రోజులుగా అక్కడక్కడా కరోనా మాట వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి. అయితే, తాజాగా తెలంగాణలో కరోనా కేసు నమోదు నమోదైంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఒక డాక్టర్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపోతే కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు గత రాత్రి కరోనా పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు కరోనా సోకినట్లు- రిమ్స్ వైద్యులు తేల్చారు. వృద్ధురాలికి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఇక కడప జిల్లాలో మరోసారి మొదటిగా ఒక కరోనా కేసు వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నిన్న విశాఖలో ఓ మహిళకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఏపీలో ఇప్పటి వరకు రెండు కరోనా కేసులు నమోదు అయ్యాయి. విశాఖలో వివాహితకు కరోనా పాజిటివ్ అని తేలింది. మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివాహిత చలి జ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు- ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కోవిడ్ 19గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆరోగ్య శాఖ అధికారులు కేజీహెచ్‌లో మరోసారి శాంపిల్‌ను పరీక్షించగా అది కూడా పాజిటివ్ గానే నిర్ధారణ అయ్యింది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వెంటనే ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మద్దెలపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వివాహిత కుటుంబ సభ్యులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించి కేజీహెచ్‌కు పంపించారు. వారందరూ కూడా హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కాగా.. ఇప్పటికే ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కరోనాకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గ్రూప్‌గా ఉన్న చోట తిరగవద్దు అంటూ పలు ఆదేశాలను ఈనెల 21నే వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చింది.ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు కచ్చితంగా వాడాలని పేర్కొంది. అలాగే చలి జ్వరం , దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి- వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాల నొప్పులు, బాడీ పెయిన్స్, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు , బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని ఏపీ ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది.

# బీఎస్పీకి డాక్టర్ జె పూర్ణచంద్రరావు రాజీనామా

- అధినేతకు రెండు పేజీల లేఖ

**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) : బీఎస్పీకి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు రాజీనామా చేశారు. రెండు పేజీల లేఖతో తన రాజీమానాను అధినేత మాయావతికి పంపారు. ఈ లేఖలో** ఆంధ్రప్రదేశ్లో రెడ్డి, కమ్మ వర్గాల ఆధిపత్యం కొనసాగుతుందని గ్రహించానని, వారు రాష్ట్ర జనాభాలో 8% ఉన్నప్పటికీ, అసెంబ్లీలో 44% ఎమ్మెల్యే స్థానాలను ఆక్రమించారని పేర్కొన్నారు. ఇక 52% జనాభా ఉన్న బీసీలు కేవలం 20 శాతం ఎమ్మెల్యే స్థానాలను పొందారని, రెడ్డి, కమ్మ జనాభా సంఖ్యతో సమానంగా ఉన్న ముస్లింలు అయితే 2శాతం ఎమ్మెల్యేలను కూడా పొందలేకపోయారని, ఇది బీసీలకు, ముస్లింలకు ఇంకా సరిగ్గా అవగతం గాని ఆందోళనకర పరిస్థితి ఉందని తెలిపారు. తాను బీఎస్పీ ఈ స్వప్నాన్ని నెరవేరుస్తుందని నమ్మానని, బహుజనుల రాజకీయ ఉద్యమాన్ని బలహీనపరిచే కమ్మ రెడ్డి నాయక పార్టీల రాజకీయ వ్యూహాలను ఎదిరించాల్సింది పోయి, బీఎస్పీ అంతర్గత వ్యవహారాలలో మునిగి పోయింది. బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బక్క పరంజ్యోతి అనూహ్యంగా తొలగించబడటానికి జాతీయ కోఆర్డినేటర్ కీలక పాత్ర పోషించారని, పార్టీ అంతర్గత రాజకీయాల్లో శ్రీ ఒక్క పరంజ్యోతి చంచాగిరీ పాల్పడకుండా నిబద్ధతతో ఉన్నా, బీసీ, ఎస్సీ, ఇతర కుల సంఘాలతో సమావేశాలను హాజరుకావడాన్ని నిరోధిస్తూ, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ పార్టీ ప్రకటించిందని, ఫలితంగా ఆయన రాజీనామా చేశారు. తర్వాత మొదటి దక్షిణ భారత బీఎస్పీ ఎమ్మెల్యే శ్రీ లకే రాజా రావు కూడా రాజీనామా చేశారని, వారిని తిరిగి నియమించమని తాను పార్టీ సుప్రీమ్, చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్ ను కోరినా ఫలితం లేకపోయింది. నాలో బహుజనుల అభ్యున్నతి పట్ల నిబద్ధత అచంచలమైనది. మాన్యవర్ కాంశీరామ్ సూచించిన మార్గాన్ని నేను కచ్చితంగా అనుసరిస్తాను. ఆయన బహుజన్ రాజకీయ సాధికారత కోసం, జ్యోతిరావు పూలే, శాహు మహారాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్ మార్గదర్శకత్వాన్ని అనుసరించారు. అలాగే పెరియర్, నారాయణ గురు వంటి మహనీయులు బహుజన రాజకీయ అవగాహనకు దిశానిర్దేశం చేశారని, కాబట్టి, పార్టీ ఆంక్షల నుండి విముక్తి పొందడానికి, బహుజనులకు మేలు చేయడానికి, నేను బీఎస్పీ నుండి మరియు నా పదవి నుండి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

# మైసూర్ పాక్‌లో పాక్ మాయం!

- ఇక స్వీట్లల్లో పాక్ స్థానంలో శ్రీ చేరిక
- మైసూర్ శ్రీగా స్వీటుకు నామకరణం



**జయపుర,మే 23 (జనంసాక్షి) :** మైసూర్పాక్‌లో పాక్ మాయమయ్యింది. దాని స్థానంలో శ్రీ వచ్చిచేరింది. ఇప్పుడు మైసేర్ పాక్ స్వీటుకాస్తా మైసూర్ శ్రీ గా మారింది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా..ముమ్మాటికీ నిజం. పాక్ అనే శబ్దం లేకుండా స్వీట్ల పేర్లన్నీ మారాయి. చివరన అన్నింటికీ శ్రీ చేరింది. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌పై యావత్ భారతీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న ఆ దేశాన్ని అంతర్జాతీయ సమాజంలో ఏకాకిని చేయాలన్న డిమాండ్లు వినిపించాయి. ఇదే సమయంలో నెట్టింట మరో చర్చ మొదలైంది. మైసూర్‌పాక్ పేరును మార్చాలని కొందరు సోషల్‌మీడియాలో ప్రతిపాదనలు చేశారు. కొందరైతే మరో అడుగు ముందుకేసి దీనిపై మీమ్స్ కూడా చేశారు. ఈ డిమాండ్ ఓ వ్యాపారికి బాగా నచ్చేసింది. అందుకే తమ దుకాణంలో విక్రయించే స్వీట్లలో 'పాక్' పదాన్ని తీసేసి కొత్త పేర్లు పెట్టారు. మైసూర్ పాక్ ను 'మైసూర్ శ్రీ'గా మార్చేశారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో గల ప్రముఖ 'త్యోహార్ స్వీట్స్' యజమాని ఈమేరకు తమ దుకాణంలో మార్పులు చేశారు. మైసూర్ పాక్‌తో పాటు-.. మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్ పేర్లను మార్చి.. మైసూర్ శ్రీ, మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీ అని కొత్త పేర్లు పెట్టారు. స్వర్ణ భాషం పాక్, చాందీ భాషమ్ పాక్‌ను కూడా స్వర్ణ శ్రీ, చాందీ శ్రీగా మార్చేశారు. దీనిపై ఆ దుకాణం యజమాని మాట్లాడుతూ.. దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల్లో ఉంటే సరిపోదు. ప్రతి పౌరుడికి దేశంపై ప్రేమ ఉండాలి. అందుకే మేం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.వాస్తవానికి 'పాక్' అనే పదం పాకం నుంచి వచ్చింది. కొన్ని భాషల్లో చక్కర లేదా బెల్లంతో చేసే పదార్థాన్ని కూడా పాకం అని పిలుస్తాం. ఇక్కడ ఈ పదానికి పాకిస్థాన్‌తో సంబంధం లేకపోయి నప్పటికీ.. దాన్ని పలికే శబ్దం ఆ దేశాన్ని గుర్తుచేసేలా ఉండటంతోనే పేరు మార్చినట్లు తెలిపారు. 'శ్రీ' అనే పదం శుభానికి సూచికగా పెట్టినట్లు పేర్కొన్నారు. మొత్తానికి ఉత్తరాది మైసూర్ శ్రీ ఇప్పుడు ఫేమస్ కానుంది.

# చీటింగ్ కేసులో ట్యాపింగ్ శ్రవణ్ రావు

- కస్టడీ విచారణకు తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :** చీటింగ్ కేసులో శ్రవణ్ రావును పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. అఖండ సంస్థను మోసం చేసిన వ్యవహారంపై సీసీఎస్ పోలీసులు ఆరా తీస్తున్నారు. రూ.6.58 కోట్లపై ప్రశ్నించడంతో పాటు బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు. చీటింగ్ కేసులో శ్రవణ్ రావును నాంపల్లి కోర్టు ఒక్కరోజు పాటు- కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో చంచల్ గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న శ్రవణ్ రావును శుక్రవారం సీసీఎస్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కుంటున్న శ్రవణ్ రావుపై చీటింగ్ కేసు నమోదు అయ్యింది. అఖండ సంస్థకు కోట్లలో నష్టం కలిగించడంతో పాటు మోసానికి పాల్పడ్డారంటూ బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎకోర్ ఇండస్ట్రీ నుంచి ముడి ఇనుమును కొనుగోలు చేస్తే టన్నుకు భారీగా లాభం ఉంటుందంటూ అఖండ ఎంటర్ ప్రైసెస్ సంస్థ నుంచి రూ. రూ.6.58 కోట్లు- తీసుకుని మోసానికి పాల్పడ్డాడు శ్రవణ్ రావు. అయితే డబ్బులు తీసుకున్నాక కట్టకుండా అమెరికాకు పారిపోయాడంటూ అఖండ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శ్రవణ్‌రావుపై పోలీసులు కేసు నమోదు చేసి ఈనెల 13న అరెస్ట్ చేశారు. ఆపై జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో శ్రవణ్ రావుకు సంబంధించిన బ్యాంక్ లావాదేవీలు, ఆయన కంపెనీకి సంబంధించిన ఆర్థిక పరమైన లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇదే కేసులో శ్రవణ్ రావుతో పాటు ఆయన భార్య స్వాతి రావును కూడా చేర్చారు. ఈ కేసులో శ్రవణ్ రావు భార్య ఏ4 నిందితురాలిగా ఉన్నారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు నిందితుడిని ఐదురోజుల పాటు- కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు. వాదనలు విన్న న్యాయస్థానం నిందితుడిని ఒక్క రోజు పాటు- కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో నేడు శ్రవణ్‌రావును పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఈరోజు సాయంత్రం 5:30 గంటల వరకు శ్రవణ్ రావును విచారణ జరుపనున్నారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన తర్వాత జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించే అవకాశం ఉంది.

# నేనూ ఈడి బాధితుడినే శివసేన ఎంపి సంజయ్ రౌత్

**ముంబయి, మే 23 (జనంసాక్షి) :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడి బాధితుల్లో తానూ ఉన్నానని శివసేన ఎంపి సంజయ్ రౌత్ అన్నారు. బిజెపి మరియు ప్రధాని మోడీల ఆయుధమని రౌత్ వ్యాఖ్యానించారు. తన నివాసంపై కూడా ఈడి దాడులు నిర్వహించిందని, తాను ఈడి బాధితుడినని అన్నారు. తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టిఎఎస్‌ఎంఎసి)పై మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడి దర్యాప్తును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కేంద్ర ఏజన్సీ అన్ని పరిధులను దాటుతోందని, సమాఖ్య నిర్మాణాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై శుక్రవారం సంజరురౌత్ మీడియాతో మాట్లాడారు. 'సుప్రీం పేర్కొన్నట్లు ఈడి అన్ని హద్దులను దాటుతోంది. నేను కూడా ఈడి బాధితుడినే. నాలాంటి వారు చాలామంది ఉన్నారు. ఈడి అనేది బిజెపి, ప్రధాని, అమిత్‌షాల ఆయుధం. ఈడి ఉన్నంత కాలం మోడీ-షాల ద్వయం, బిజెపి ఉంటాయి' అని అన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్‌ని రాహుల్ గాంధీ ప్రశ్నించడంపై కూడా సంజయ్ రౌత్ స్పందించారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలో తప్పు లేదని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. రాహుల్ మాత్రమే కాదు దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు తెలుసుకోవాల్సి ఉందని అన్నారు.

# ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కారును ఢీకొన్న లారీ: ఆరుగురు దుర్మరణం

**ఒంగోలు, మే 23 (జనంసాక్షి) :** ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమరోలు మండలం తాటిచెర్లమోటు- వద్ద శుక్రవారం మధ్యాహ్నం కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుతాసుపత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మరోవైపు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులంతా స్టువర్ట్‌పురం వాసులను పోలీసులు తెలిపారు. కారులోని వారంతా మహానంది వద్దనున్న మహాబలిపురం వెళ్లి.. బాపట్ల తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు- చేసుకుందని వెల్లడించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు- పోలీసులు వివరించారు. ప్రమాద సమయానికి ముందు కారు, లారీలు రెండు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని.. అందుకే ప్రమాద తీవ్రత బాగా పెరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారంతా మరణించారని చెప్పారు. కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు.

# లిక్కర్ స్కామ్‌లో జగన్‌పై నిందలు

- లేనిపోని ఆరోపణలతో అబద్దాలు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ సాకే శైలజానాథ్

**అమరావతి, మే 23 (జనంసాక్షి) :** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత శైలజానాథ్ మండిపడ్డారు.. సీఎం చంద్ర బాబు అధికార దుర్వి నియోగం చేస్తున్నారని విమర్శించిన ఆయన.. జగన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మద్యం అక్రమా లపై ఆధారాలు చూపాలని వైఎస్ జగన్ సవాల్ చేశారు. నిజంగా డేటా డిలిట్ చేస్తే దాని వెనుక మొత్తం డిపార్ట్‌మెంట్ ఉన్నట్టే కదా..? అని ప్రశ్నించారు. ఆధారాల్లేవని ఒకవైపు చెప్తూనే మరోవైపు బ్యాక్‌ఎండ్ లో ఉన్నాయని రాశారు. అంటే బ్యాక్‌ఎండ్‌లో మీకు కావాల్సినట్టు ఆధారాలు తయారు చేస్తున్నారనే అనుమానం కలుగుతోంద న్నారు. మద్యం కేసులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి ఒక్కొక్కరు ఒక్కో రీతిలో ఆరోపణలు చేశారని శైలజానాథ్ ఫైర్ అయ్యారు.. నిజంగా అక్రమాలు జరిగి ఉంటే బేవరేజ్ కార్పొరేషన్ అధికారులందరి మీదా ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. డిస్టలరీల మీద కూడా కేసులు పెట్టి ఎందుకు విచారణ చేయ లేదు..? అని నిలదీశారు. ఆధారాలు లేకుం డా కట్టుకథలు చెప్పటం మానాలని సూచిం చారు. ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకా లను అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు జనాన్ని మోసం చేసి నందునే వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నామని ప్రకటించారు. నిన్నటి ప్రెస్‌మీట్ లో జగన్ వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# పదవీ విరమణ రోజూ 11 తీర్పులు

- చరిత్ర సృష్టించిన జస్టిస్ ఓకా



**న్యూఢిల్లీ, మే 23 (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎఎస్ ఓకా చరిత్ర సృష్టించారు. తన పదవీ విరమరోజు సాంప్రదాయాల్ని పక్కనపెట్టి పనే పరమావధి అని చేసి చూపించారు. ఎంతో ప్రేమ ఉన్న తన తల్లిని కోల్పోయి ఒక్క రోజు కూడా గడవగముందే కోర్టుకు హాజరయ్యారు. అంతేకాదు, ఏకంగా చివరి రోజున 11 తీర్పులు ఇచ్చారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా శుక్రవారం పదవీ విరమణ చేయబోతున్నారని బార్ అండ్ బెంచ్ ప్రకటించింది. దీనికి ముందు రోజు ముందు ఓకా తన తల్లి చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరు కావడానికి ముంబైకి బయలుదేరి వెళ్లారు. ఒక్క రోజులోనే ఢిల్లీకి తిరిగివచ్చి కోర్టుకు హాజరయ్యారు. పదవీ విరమణ రోజున పని చేయకూడదనే సంప్రదాయాన్ని పక్కనపెట్టి జస్టిస్ ఓకా తన సాధారణ బెంచ్‌లో భాగంగా 11 తీర్పులు వెలువరించారు. తర్వాత చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌తో కలిసి ఉత్సవ బెంచ్‌కి వెళ్లారు. ఈ వారం ప్రారంభంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన ఓకాకు సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ అభినందన సభ ఏర్పాటు చేసింది. ఆ సభలో జస్టిస్ ఓకా మాట్లాడుతూ చివరి రోజున పని చేయకూడదనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని సభా ముఖంగా ప్రకటించారు. పదవీ విరమణ చేసే న్యాయమూర్తి చివరి రోజున పని చేయకూడదనే సుప్రీంకోర్టులో అనుసరించే ఒక సంప్రదాయాన్ని నేను ఆమోదించను. ఆ సంప్రదాయాన్ని వదిలించు కోవడానికి మనకు కొంత సమయం పడుతుంది, కానీ కనీసం చివరి రోజున నేను రెగ్యులర్ బెంచ్‌లో కూర్చుని కొన్ని తీర్పులు ప్రకటించడంలో నాకు సంతృప్తి ఉందని ఆయన చెప్పారు.

# కేంద్రమంత్రులతో సిఎం చంద్రబాబు వరుస భేటీలు

- జితేంద్ర సింగ్‌తో భేటీ..అంతరిక్ష తయారీ ఆవిష్కరణపై చర్చ
- రెండు స్పేస్ సిటీల అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పణ
- సిఆర్ పాటిల్‌తో భేటీలో బనకచర్లపై ప్రత్యేకంగా చర్చ
- గోదావరి మిగులు జలాలు వాడుకోవడమే ప్రధాన లక్ష్యమని వెల్లడి



**న్యూఢిల్లీ, మే 23 (జనంసాక్షి) :** హస్తిన పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అవుతున్నారు. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, భూ విజ్ఞాన శాఖల మంత్రి జితేంద్ర సింగ్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంతరిక్ష తయారీ, ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరుతూ ఒక సమగ్ర ప్రతిపాదనను సీఎం సమర్పించారు. ఈ ప్రతిపాదనలో రాష్ట్ర మద్దతుతో రెండు స్పేస్ సిటీల అభివృద్ధికి సంబంధించిన వివరాలున్నాయి. వీటిలో ఒకటి ఇస్రో షార్ అంతరిక్ష కేంద్రం సమీపంలో, మరొకటి లేపాక్షి వద్ద ఉంటాయి. ఉపగ్రహాల ఉత్పత్తి, ప్రయోగ వాహనాల అభివృద్ధి, పరిశ్రమల సహకారానికి ఇవి సమగ్ర కేంద్రాలుగా ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అంతరిక్ష సాంకేతికత సలహాదారుగా ఇస్రో మాజీ ఛైర్మన్ డా.ఎస్. సోమనాథ్ నియామకం గురించి కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తెలియజేశారు. ఆయన మార్గదర్శకత్వంలో అంతర్జాతీయంగా పోటీపడే అంతరిక్ష ఎకోసిస్టంను నిర్మించడంలో రాష్ట్ర ప్రయత్నాలకు ఈ నియామకం దిశానిర్దేశర చేస్తుందని వివరించారు. వ్యూహాత్మక స్థానం, పారిశ్రామిక బలం, భవిష్యత్తుకు సిద్ధమైన మౌలిక సదుపాయాలతో, భారతదేశ అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు.కేంద్రం ఈ విప్లవాత్మక మార్పులను గుర్తించి, తగిన విధంగా భాగస్వామ్యం కల్పిస్తుందనే ఆశాభావాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. అంతకుముందు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం కలిశారు. ఈ సమావేశంలో పోలవరం – బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను సమర్పించారు. గోదావరి వరద నీటిని ఏపీలోని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడమే ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు లక్ష్యం. జల్ జీవన్, బ్లూ రివల్యూషన్, మేక్ ఇన్ ఇండియా వంటి జాతీయ మిషన్ల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత దిగువ రాష్ట్రంగా మిగులు జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కును కూడా ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. పోలవరం- బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించిన వివరాల డీపీఆర్ త్వరలో సమర్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పనులను త్వరగా ముందుకు తీసుకెళ్లడానికి తక్షణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు అభ్యర్థించారు. శుక్రవారం ఉదయం కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీతో సీఎం సమావేశమై... ఏపీలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు సహకారంపై చర్చించారు. పీఎం సూర్యఘర్ యోజన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు సోలార్ రూఫ్ టాప్ కేటాయింపులు ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. కేంద్రం సహకరిస్తే పునరుద్పాదన ఇంధన వినియోగంలో ఏపీ.. భవిష్యత్‌లో దేశానికి మార్గనిర్దేశం చేయగలదని అన్నారు. ఆపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ- అయిన సీఎం చంద్రబాబు.. ఏపీలో వ్యూహాత్మక రక్షణ, ఏరో స్పేస్ ప్రాజెక్టులపై చర్చించారు. సిఎం వెంట కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, చందరశేఖర్, ఎంపి లావు కృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370